
జీవనకిరణాలు
చెప్యాల మలహల్ రావు

# జీవన కిరణాలు

చెప్యాల మలహాల్ రావు
అడిషనల్ డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ (ప)
సైబరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్.

# జీవన కిరణాలు


| | |
|---|---|
| సేకరణ | : చెప్యాల మలహాల్‌రావు<br>**malhalrao@gmail.com** |
| ప్రతులు | : 1000 |
| ప్రథమ ముద్రణ | : 2010 |
| వెల | : 50 రూపాయలు |
| వీరి ఇతర గ్రంథాలు | : **1. ఆణిముత్యాలు**<br>**2. మన సంస్కృతి**<br>**3. Sense the essence** |
| ప్రతులకు | : నవోదయ బుక్ హౌస్,<br>ఇంటి.నెం. 3-3-859/1<br>ఆర్య సమాజ్ ముందు<br>కాచిగూడ, హైదరాబాద్ - 500027<br>ఫోన్ : 24652387, 55169585. |
| | : విశాలాంధ్ర, పబ్లిషింగ్ హౌస్<br>4-1-435, బ్యాంక్ స్ట్రీట్,<br>హైదరాబాద్ - 5000001.<br>ఫోన్.నెం. 040-24744580. |
| | : శైలీ పబ్లికేషన్స్<br>స్టాల్.నెం. 46,<br>ప్లాట్ ఫామ్ నెం. 60, యం.జి.బి.ఎస్,<br>హైదరాబాద్<br>సెల్.నెం. 98850-45360<br>99664-42038 |
| లే అవుట్ | : కె. రాంచందర్ రావు |
| కవర్ డిజైన్ | : కె. శ్రీనాథ్ రెడ్డి. |
| డిటిపి & టైప్ సెట్టింగ్ | : |
| ముద్రణ | |

# నా మనవి

గౌరవనీయులైన సాహితీవేత్తలకు, ప్రియమైన తెలుగు పాఠకులకు, సహృదయులైన శ్రేయోభిలాషులకు పుస్తకం రూపు దిద్దుకోవడానికి సహకరించిన వారందరికి, పుస్తక విక్రేతలకు నా హృదయపూర్వక నమస్కారములు.

మహనీయుల పుస్తకాలు చదువుతున్నపుడు అందులోని నన్ను ప్రభావితం వేసిన కొన్ని కొన్ని వాక్య సమూదాయాలను వ్రాసుకోవడం నాకు అలవాటు. అలా వ్రాసిన వాటిని ఏర్చి కూర్చి ఒక పద్ధతి ప్రకారం పెట్టుకోవడం జర్గింది. అంతే కాకుండా ఇంకెన్నో విషయాలను వివిధ రచనల నుండి, వివిధ సంధర్భాలలో సేకరించడం వాటిని వివిధ రూపాలలో పెట్టడం జర్గింది.

ఇలాంటి సేకరణలను పుస్తక రూపంలో తీసుకొస్తే బాగుంటుందని నా, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రోత్సహించడం వలన ఈ పుస్తకానికి రూపం ఇవ్వడం జర్గింది.

వేదాన్ని అర్థం చేయుంచడానికి ప్రయత్నించిన చాలా మందిలో మహోన్నత వ్యక్తి ఐన డా. దాశరథి రంగాచార్యులు ఒకరు. వీరు వేదాలను సులభ వచనంలో వ్రాసి సామాన్య జనులకు అందించడం విశేషం. వేదాలనే కాక మరెన్నో అద్భుత రచనలు చేసిన డా. దాశరథి రంగా చార్య గారి యొక్క దర్శన భాగ్యం కలగడం వారితో ఎన్నో విషయాలు చర్చించడం. వారి ద్వార అనేక విషయాలు నేర్చు కోవడం నా జన్మలో మరపురాని మధురమైన క్షణాలు. నేనే వారిని కోరగానే వారు నా ఈ పుస్తకానికి వారి అమూల్యమైన ముందు మాటను వ్రాయడం నా అదృష్టంగా భావిస్తాను. వారి పుస్తకాల నుండి మధురమైన వాక్యాలను తీసుకొని క్రోడికరించినవి ఈ పుస్తకంలో చదివితే అవి ఎంత విలువైనవో మీకే తెలుస్తుంది.

ఒక యోగి ప్రస్థానం రచయిత ప్రపంచప్రఖ్యాతి గాంచిన కెనడ దేశస్థుడైన రాబిన్ ఎస్. శర్మను నేను కల్వడం వారియొక్క అమూల్యమైన వ్యాఖ్యానాన్ని నేను వినడం నా అదృష్టంగా భావిస్తాను. వారి రచన నుండి అమృత వాక్యాలు మన జీవితానికి ఎంతగా ఉపయోగపడుతాయో ఈ పుస్తకం చదివితే మీకే తెలుస్తుంది.

అంతే కాక ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి ఒక విజేత ఆత్మ కథ నుండి సేకరించిన విషయాలే కాక ఇతర అన్ని శీర్షికలు నేను అపురూపమైనవిగా భావిస్తాను. చదివి ఆనందించండి.

ఇందులో అక్షర దోషములను గాని ఇతర దోషములను గాని మా దృష్టికి తెస్తే తరువాతి ముద్రణలో సవరించగలము.

నన్ను ఎంతగానో ప్రభావితం చేసిన విషయాలు ఇతరులకు అంద చేసే సదుద్దేశంలో చేసిన ఈ చిన్న ప్రయత్నంలో ఏమైన తప్పులు దొర్లితే పెద్దమనస్సుతో క్షమించగలరు.


ప్లాట్ నెం. 34, భావన ఎన్‌క్లేవ్, ఫేస్ III
సెంటర్ పాయింట్ హోటల్ దగ్గర
బోయిన్ పల్లి, సికింద్రబాద్
హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్
ఇండియా 500011
సెల్. నెం. **9618059635**
ల్యాండ్ నెం. 040 – 27750466

**చెప్యాల మలహాల్ రావు**
**అడిషనల్ డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ (ప)**
**సైబరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్.**

# సారాంశం

జీవితం అఖండం, అనిర్వచనీయం, దీనిని అర్థం చేసుకున్నవాళ్ళు చాలా తక్కువమంది, ఎవరికి అర్థంకాలేదని నా ఉద్దేశం. జీవితం తన దారిలో సాగుతుంటుంది. మనం దాని వెంట సాగుతాం.

అయినా కొందరు తమ జీవితంలో కొన్ని కోణాలను అర్థం చేసుకుంటారు. రచనలను సాగిస్తారు. అవి చాలా మందికి కరదీపికలు అవుతాయి.

మలహల్ రావు గారు అలాంటి కొన్ని జీవితాల కిరణాలను సేకరించారు. వాటిని వెలుగుపుంజంగా అందిస్తున్నారు. అన్ని చదవలేని వారికి కొన్నింటి సారాంశమిది. ఇది చదువరులకు ఉపయోగపడుతుంది అని భావిస్తున్నాను.

డా. దాశరథి రంగాచార్యులు,
విరోధి, మాఘ, కృష్ణ, చవితి,
తేది. 02-02-2010,
మంగళవారం,
సా.గం॥ 5.15 ని.లు.

# ప్రవేశిక


| క్ర.సం. | పుస్తకం | రచయిత | పేజీలు |
|---|---|---|---|
| 1. | జీవన యానం | డా.దాశరథి రంగాచార్యులు | 1 |
| 2. | వేదం జీవన నాదం | డా.దాశరథి రంగాచార్యులు | 8 |
| 3. | ఒక యోగి ప్రస్థానం | రాబిన్ ఎస్.శర్మ | 13 |
| 4. | ఒక విజేత ఆత్మ కథ | ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ | 22 |
| 5. | గీతాంజలి | రవీంద్రుడు | 27 |
| 6. | విషవృక్షం | బంకిం బాబు | 28 |
| 7. | 13వ శతాబ్ధం నాటి ఓరుగల్లు చరిత్ర | ముదిగొండ శివ ప్రసాద్ | 29 |
| 8. | భద్రాచలం దేవస్థానం చరిత్ర | దేవస్థానం నుండి సేకరించినవి | 30 |
| 9. | వేముల వాడ దేవస్థానం చరిత్ర | దేవస్థానం నుండి సేకరించినవి | 33 |
| 10. | అల్లూరి సీతారామరాజు ఉద్యమ చరిత్ర | అప్పటి పోలీసు రికార్డుల ప్రకారం | 35 |
| 11. | అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో చింతపల్లి పోలీసు స్టేషన్ముట్టడి | అప్పటి పోలీసు రికార్డుల ప్రకారం | 38 |
| 12. | భగవద్గీత | గాంధీజీ ఆత్మ కథ నుండి | 39 |
| 13. | తరాలు అంతరాలు | మార్క్ విక్టర్ | 40 |
| 14. | తెలుగు భాష- పద్యసాహిత్యం | | 41 |
| 15. | ప్రదేశాలు - పురాతన మరియు ఇప్పటి పేర్లు | | 58 |
| 16. | ఋతువులు ప్రకృతి | | 59 |

# జీవన యానం

(డా.దాశరథి రంగాచార్యులు)

## ప్రకృతి – ప్రేమ – ఆప్యాయత

అది తామరలు నిండిన చెరువు. తామరాకుల మీద నీటి బిందువులు. సూర్య కిరణాల తళతళలు. విచ్చుకున్న తామరలు – అరవిచ్చినవి – మొగ్గలు. వాటిపై ఝుమ్మని తిరిగే తుమ్మెదలు! అబ్బో – ఎంత అందం! అది అందానికి అందం!! అక్షరానికి అందని అందం.

చద్దన్నంలో మామిడికాయ పచ్చడి – పేరిన నెయ్యి కలిపేది మా అమ్మ. మా అన్నయ్యనూ, నన్నూ కూర్చుండబెట్టుకునేది. చెరొక ముద్దా పెడ్తుండేది. ఆ ముద్ద అమృతం. అది అమృతానందం!

పెరట్లో మొక్కజొన్న కంకులు విరిచి, బొగ్గుల నిప్పుల – మీద కాల్చి, పచ్చి మిరపకారంలో వెన్న కలిపి, మొక్కజొన్న పొట్టలో పెట్టి ఇచ్చేవారు. ఒక్కొక్క సారి అమ్మ వలిచి చేతులో పోసేది. గింజలు నోట్లో పోసుకుని, వెన్న కలిపిన పచ్చిమిరపకారంతో నములుతుంటే చందమామ మీద – పొన్న చెట్టు కింద ఆడుతున్నంత ఆనందం.

ఆనాటి మా తాతయ్య, అమ్మమ్మల నిశ్చింతమూ, నిరామయము, ఆరోగ్యకరము, ఆత్మీయము అయిన జీవితాన్ని తలచుకుంటే అది అందని ఆకాశంలా, దొరకని ఇంద్ర ధనుస్సులా, చేరరాని తారాపథంలా అనిపిస్తుంది.

గుంపుగా బయల్దేరడం – పొలాల్లోంచి సాగడం – పచ్చి పెసరకాయలు, పచ్చివేరు శెనగలు ఏరుకొని తినడం – జలాశయాలలో – జలకాలాటలు – ఇసుక మీద బట్టలు ఆరేసుకోవడం – అది అక్షరానికి అందని అనుభూతి!

ప్రతి ఇంట్లోనూ ఏవో పండ్ల చెట్లుండేవి. కూరగాయలు ఇండ్లలోనే కాసేవి. సొర పాదులు. గుమ్మడి పాదులు పాకిన గుడిసెలు ఎంతో అందంగా ఉండేవి. కూరగాయలు అమ్మటం ఎరుగరు. ఒకళ్ళకు ఒకళ్ళు ఇచ్చుకోవడమే! అయితే, ఎండకాలం కూరగాయలువుండవు. అందుకు సిద్ధంగానే ఉండేవారు. గొయ్యి తవ్వి దోసకాయలు, బూడిదలో పెట్టేవారు. ఒరుగులు, వడియాలు,పప్పులు,మామిడికాయలు,చింతపండుతో వెల్ల దీసుకునేవారు. తప్పాల చెక్క, ఉప్పుడు పిండి, కుడుములు, అట్లు, గారెలు – అప్పుడు తినే పిండి వంటలు. అరిశెలు, బూజెలు, జంతికలు, చక్కినాలు, చేగోడీలు, అటుకులు, పోపు బియ్యం వగైరాలు నిలవ ఉండే పిండి వంటలు. పాడికూడా సర్వసాధారణం.అవి అమ్మటం పాపంగా భావించెవారు. దాలిలో కాచిన పాలు – టీ, కాఫీ పేరు తెలియదు. కవ్వంతో చల్ల చేయడం ఒక కళ, ఆశబ్దం ఒక స్వరం, వెన్న తీసి నేయి కాస్తుంటే కమ్మని వాసన! ఏదండీ ఆనేయి! ఏదండీ ఆ చల్ల !

'కూడారై' నాడు పాయసం గుండీలతో చేసేవారు. గోతులు తీసి, వాటిని నీళ్ళతో నింపి గుండీగలు అందులోకి దింపేవారు. పాయసం చల్లారడానికి ఆ ఉపాయం. పాయసంలో ఏలకులు – కుంకుమ పూవు – జీడిపప్పు – ద్రాక్ష వగైరాలు వేసేవారు. పాయసం నోటిదాకా పోకముందే ఘుమ ఘుమ!

## సంప్రదాయాలు

జంతువుల విషయంలో కరుణ కనబరచడం భారత సంప్రదాయం. చీమలకు చక్కెర, పాములకు పాలు పోయడం మన సంప్రదాయం.

అసలు జీవన విధానంలోనే ఆరోగ్య సూత్రాలు, వ్యాయామం ఇమిడి ఉన్నాయి. కాబట్టి వైద్యుల అవసరం ఉండదు.ఉదయం లేచి వేపచెట్టు ఎక్కి పళ్ళపుల్ల విరుచుకోవాలి. దొడ్డికి చెంబు పట్టుకొని నడిచిపోవాలి. స్నానానికి ఏటికి గాని చెరువుకు గాని వెళ్లాలి. లేకుంటే బావిలో నీళ్ళు చేది పోసుకోవాలి. ఎక్కడికి పోయినా నడిచి పోవాలి. ఇదంతా పురుషులకు స్వతస్సిద్ధంగా జరిగే వ్యాయామం.

ఎవరి వృత్తులు వారికి సిద్ధంగా ఉండేవి. ఉద్యోగాన్వేషణలు, మానసిక వత్తుడులు లేవు. జీవితంలో పరుగు పందాలు లేవు. కాళ్ళు కూలటం లేదు. అన్నింటినీ మించి ఆనాటి విద్యా విధానం దురాశలకు పోనీదు. యాంత్రిక యుగపు దు:ఖాలన్నింటికి కారణం దురాశయే!

తోరణాల ఆకులు తడుపుతారు. దొంతరలుగా చేస్తారు. వాటి మీద విసుర్రాళ్ళు పెడ్తారు. ఆ బరువుకు తెల్లవారేవరకు. ఆకులు విస్తళ్లు కుట్టడానికి అనువుగా అణుగుతాయి. అంతకు ముందే చొప్పనుంచి చీరిపెట్టిన పుల్లలుంటాయి.

మహిళలు తమ పనులు తీర్చుకొని వసారాల్లో చేర్తారు. ఇద్దరు ముగ్గురు గృహిణులు ఒక ఇంట్లో కూడ్తారు. విస్తళ్లు కుడ్తుంటారు. ముచ్చట్లు పెడ్తుంటారు. ఊరి ముచ్చట్లన్నీ అక్కడే! ఎక్కడెక్కడి వార్తలు – వ్యాఖ్యాలు, సంపాదకీయాలు ఉంటాయి. వ్రాయని వార్తా పత్రిక !

విస్తళ్ళు కుడ్తుంటారు. పాటలు ఒక్కొక్కరు విడిగా సామూహికంగా పాడుతుంటారు. అందులో సీతమ్మ వారి వేవిళ్ళ – ఊర్మిల నిద్ర – సుభద్ర పరిణయం – ఒక్కటేమిటి అనేకం ఉంటాయి. ఇది వేదిక లేని సాంస్కృతిక ప్రదర్శనం! ఇది పేరు తెలియని వినోదం. విస్తళ్లది మహిళల పరిశ్రమ.

విస్తళ్ళు కుడ్తుంటారు. ఒక తల్లి చిరుతిండి వంతుల వారిగా చేసి తెస్తుంది. నవ్వులాటలు – పరిహాసాలు – దరహాసాలు – కోపాలు – చిరుతగాదాల మధ్య చిరుతిండ్లు. ఇది సామూహిక జీవనం – సామూహిక వ్యవహారం. ఇది పేరులేని క్లబ్బు. ఇదీ మన జీవన విధానం.దీనిని మటుమాయం చేసింది మరల నాగరికత!

## గుడి

**గుడి దేవుడిది మాత్రం కాదు. దానికి బహుళ ప్రయోజనాలున్నాయి.**

**భద్రత :–** దండయాత్రలు – దోపిళ్ళు – తుఫానులు వచ్చినపుడు, గ్రామ ప్రజలను రక్షిస్తాయి. 1977 లో వచ్చిన దివిసీమ ఉప్పెనలో దేవాలయాలు ఎందరినో కాపాడినాయి.

**వినోదం :–** విజ్ఞానం – దేవాలయంలోనే హరి కథలు, పురాణాల వంటివి జరిగేవి. భారత సంస్కృతికి మూల స్తంభాలయిన రామాయణ, భారత భాగవతాలను ప్రజలలోనికి తీసుకుని పోయిందీ, వానిని పరిరక్షించిందీ దేవాలయాలే ! అందుకే అవి అన్య మతస్తుల ఆగ్రహానికి – దోపిడికి – వినాశనానికి గురి అయినాయి.

**పాపభీతి :–** దేవుని ముందు ప్రమాణం చేసి అబద్ధం చెప్పరాదనీ – దేవుని ముందు చేసిన వాగ్దానం నిలబెట్టాలనీ, అలా కాకుంటే పాపం తగిలి ఏదో అరిష్టం, జరుగుతుందనీ భయపడేవారు. ఆ భయమే సామాజిక జీవితాన్ని న్యాయ మార్గంలో నడిపించింది.

**సమానత :–** దేవుని – గుడిలో కులం – అధికారం – సంపద అనే వ్యత్యాసం లేదు. అందరూ ఒకే పంక్తిలో తీర్థ ప్రసాదాలు తీసుకుంటారు. ప్రసాదం ఇవ్వడంలో ముందు వెనుకలు తప్ప వ్యత్యాసాలు లేవు.

**సామాజికం :–** గ్రామంలో ఎక్కడ కలసినా, కలవకున్నా గుళ్లో కలుసుకుంటారు. ఒకరి కథలు ఒకరికి చెప్పుకుంటారు. ఈ చెప్పుకోవడంలో ఉన్న ఊరట దేనిలోనూ లేదు.

## త్యాగం

వాల్మీకి త్యాగం మీద ఆధారపడిన సమాజాన్ని దర్శిస్తాడు. రాముడు తండ్రి కోసం రాజ్యం వదులుకుంటాడు. సీతాలక్ష్మణులు రాముని కోసం రాజ్యభోగాలు వదులుకుంటారు. భరతుడు అన్న కోసం రాజ్యం వదులుకుంటాడు. " నా ఇహం అర్థపరో దేవి " అంటాడు రాముడు. నేను అర్థపరుణ్ణి కాదు, ధర్మపరుణ్ణి అంటాడు. అతడు ధర్మంకోసం అర్థాన్ని త్యజించాడు.

రంతి దేవుడు తనకు ఉన్నది సొంతం ఇచ్చి – తనకు తిండిలేకున్నా సకల ప్రాణిజాలపు దు:ఖాలన్నీ తనకే కలిగించమనీ – ప్రాణిజాలం సొంతం సుఖంగా వర్ధిల్లాలనీ ప్రార్థిస్తాడు. రంతి దేవుని ప్రార్థన మానవుల విషయంలో మాత్రమే కాదు. చెట్టు, చేమ, పక్షులు, పశువులు అన్నింటికీ వర్తింప చేసాడు.

శిబి తనను శరణు కోరిన పావురం కోసం తన శరీరం మాంసం కోసి ఇచ్చి ప్రేమ పూర్ణుడు – త్యాగ ధనుడు – మహా మహిమాన్వితుడు అయినాడు. గౌతముడు, క్రీస్తు, ప్రేమవేదం ప్రవచించినారు.

నేటి సమాజానికి లక్ష్యం లేదు. అది సరంగులేని ఓడవలె దిక్కులేకున్నది. దీనికి భయము, విధేయత లేవు. ప్రేమ, అభిమానము లేవు. ఈ సమాజానికి ఉన్నవి దురాశ – డబ్బుమాత్రమే. ఈ రెండూ మానవుని మనసును తొలిగించి రక్కసిగా మార్చాయి.

## బడి చదువు

" ఉర్దూ భయానికి తెలుగు వారు తమ పిల్లలను స్కూళ్ళలో చదివించేవారు కారు. తెలుగు వారికి ఉద్యోగం దొరుకుతుందని నమ్మకం లేదు. పల్లెల్లో కులవృత్తులు అడుగంట లేదు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండేది.

నిజాం రాజ్యంలో చదువు వచ్చిన వారి సంఖ్య వేయికి 82, అందులో ముసల్మానుల్లో 59 హిందువుల్లో 23. నిజాంలోని విద్యావిధానమే విద్యకు వ్యతిరేకం. పాఠశాలలూ, కళాశాలలూ అన్నీ సర్కారువే. అవి ఏర్పరచడానికి ప్రమాణాలు. ప్రతి సుబాకు ఒక ఇంటర్ మీడియట్ కాలేజీ. నిజాం రాజ్యంలో నాలుగు. అంటే రాజ్యం మొత్తంలో నాలుగే ఇంటర్ కాలేజీలు.

ప్రతి జిల్లాకు ఒక ఫౌఖాన్యా – అంటే హైస్కూల్.
ప్రతి తాలుకాకు వస్తాన్యా – అంటే మిడిల్ స్కూల్
గ్రామ ప్రాముఖ్యతను బట్టి తహతన్యా – అంటే ప్రైమరీ స్కూల్.
నిజాం నవాబు ఖాస్గీబడులు – అంటే వీధి బడులను ఫర్మాన ద్వారా నిషేధించాడు.
అందువల్ల పంతుళ్ళు తమ ఇంట్లోనే తెలుగు చదువు చెప్పేవారు.

పిల్లలు పంతులు వచ్చేదాక బడిపెద్ద గుణింతాలు – ఎక్కాలు – ఎరుసులు చదివిస్తాడు. ఒకడు చెపుతాడు. అంతా కలిసి చదువుతారు. పంతులుగారు లేచి వచ్చి కొత్త పాఠం చెపుతారు. అది కూడా కంఠోపాఠమే – నోటికి రావలసిందే. ఎక్కువగా చదివేది ఉండదు. గుణింతాలు, ఎక్కాలు బాగా వస్తాయి. కాబట్టి సాధారణంగా తప్పులు ఉండవు. ఎరుసులు అంటే సుమారు ఎక్కాల లాంటివి. కాసులు ఎరుసు. అణాల ఎరసుల – గిద్దెల ఎరుసు ఇలా ఎన్నో చెప్పుతారు. ఇన్ని కాసులు ఎంత? ఇన్ని అణాలు ఎంత? ఇన్ని గిద్దెలు ఎంత? ఇత్యాది:. అన్నీ నోటికి ఉంటాయి. కాబట్టి టక్కున చెప్పుతారు. సుమారు కంప్యూటర్ లాగే. కాగితం కలం అక్కర లేదు. అంతా నోటికే!

తిథులు – నక్షత్రాలు – వారాలు – మాసాలు – రుతువులు – సంవత్సరాలు – నదులు – పర్వతాలు మున్నగు చరిత్ర, భూగోళం, సామాజిక శాస్త్రం, నీతి శాస్త్రం వగైరా నిత్య జీవితానికి అవసరం అయినవి అన్నీ చెపుతారు.

పెందలకడ పిల్లలు బడికి వస్తే సుమారు ఎనిమిదింటికి పళ్ళ తోముకుని ముఖం కడుక్కోవడానికి వదులుతారు. అప్పుడు పిల్లలు ఇండ్లకు వెళుతారు. ముకాలు కడుక్కుంటారు. చద్దన్నం – మామిడి ఊరగాయ తింటారు. అప్పటికి టీలు – కాఫీలు లేవు. తిరిగి బడికి చేరుకుంటారు. మళ్ళీ మద్యాహ్నం అలాగే భోజనాలకు వెళ్ళివస్తారు. సాయంకాలం నీతి శతకాలు చదివించి " దీపంజ్యోతి " చదివించి బడి వదులుతారు.

పిల్లలు ఇంటివద్ద చేసేపని అంటే హోంవర్క్ ఉండదు. బడి వదులుతే ఆటలే! తొక్కుడు బిళ్ళ – బిళ్ళంగోడు – ఉప్పుచెర – చెడుగుడు – కోతి కొమ్మంచి వగైరా. ఈ మధ్య ఆనాటి పద్ధతి ఆరోగ్యానికి అనుకూలం అయింది అంటున్నారు.

ఒక్క పలక – ఒక పుస్తకం – కూర్చునే గోనెసంచి లేదా చిరుచాప తప్ప పిల్లలు మోసుకొని పోవాలసింది లేదు. పలక అంటే రాశి పలక కాదు. చెక్కపలక. దానికి ఒక రకం ఆకు బొగ్గు దంచి పట్టించాలి. అది కూడా లేకుండా ఇసుక కుప్ప మీద అక్షరాలు వ్రాపే పద్ధతి ఉంది.

పుస్తకాల బరువు కరీదు తండ్రికి లేదు. మోసే భారం పిల్లలకు లేదు.

చదువు మొత్తంలో కంటిమీద భారం లేదు. చదివేది తక్కువ. జ్ఞాపకం చేసేది ఎక్కువ. కాబట్టి బాల్యంలోనే దృష్టి లోపాలు రావు. బడి వదులుతే పిల్లలకు నిశ్చింత. హోంవర్క్ బెడద లేదు. తల్లిదండ్రులకూ, పిల్లలకు మానసిక విశ్రాంతి. ఇది పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి ఉపకరిస్తుంది.

చదివిన చదువు నిత్య జీవితానికి అక్కర వస్తుంది. సరిపోతుంది.

## ఉర్దు మరియు ముస్లిములు – ప్రాధాన్యత

ప్రధాన ముస్లిం దినాలను శలవులుగా ప్రకటించారు. ముస్లింల నమాజుదినం కాలంలో శుక్రవారం వారపు శలవు. మొహర్రం సందర్భంగా సుదీర్ఘ శలవులు. రంమ్జాన్ సందర్భంగా ఒక పూట ఆఫీసులు, ముస్లిం పర్వదినాలన్ని తప్పని సరి శలవులు. రంమ్జాన్ సందర్భంగా తిను బండారాలు కనిపించనీయరాదు. హొటళ్ళకు మిఠాయి దుకాణాలకు నల్లని తెరలు విధిగా వేయాలి. మసీదులకు వంద గజాలు అటు, వంద గజాలు ఇటు బాజాలు మ్రోగించరాదు. అది దేవుని సేవగాని, పెళ్ళి ఊరేగింపు గానీ, శవయాత్రగాని – ఈ నియమం పాటించవలసిందే. శిక్షాస్మృతి ప్రకారం అది నేరం అవుతుంది. శిక్షపడుతుంది.

విగ్రహాలు ఇస్లాంకు విరుద్ధం కాబట్టి రాజ్యంలో ఎక్కడా బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పరచడం జరగలేదు.

సిరిసిల్లలో ఉన్న గ్రంథాలయాన్ని చూచిన తహసిల్దారు సర్కారు వారి దప్తరములలో – ఆఫీసుల్లో – వ్యవహారమంతము ఉర్దూలో ఉండగా చచ్చిపోయిన తెలుగును బైటికి గుంజవలసిన సనిలేదు అవి మూసివేయించాడు.

వరంగల్లు జిల్లా మడికొండలో ఆంధ్ర గ్రంథాలయం స్థాపించబడింది. ఇందుకు ప్రభుత్వ అనుమతి అవసరం అని పోలీసు పటేలు పట్టు పట్టాడు. కార్యదర్శి అది అవసరం లేదన్నాడు. గ్రంథాలయం నిర్వహించడం కష్టం అయింది. ఇలా ఉండగా అదాలత్ – ( కోర్టను ) నుంచి కార్యదర్శి పేర ఒక లేఖ వచ్చింది.

"ప్రతి – రోజు సదరు లైబ్రరీకి పుస్తకములు, ప్రతికలు చదువు – కొనగలందులకు జనులు వచ్చుచున్నారు. మరిన్నీ ఆంధ్రప్రత్రిక, కృష్ణా పత్రిక, ముషీర్ దక్కన్ వగైరా పత్రికలు వస్తూ ఉన్నవి. హాలు–ప్రస్తుతం– సదరు లైబ్రరీ ఖాయం చేయుటకుయే – మహద్మ – డిపార్ట్‌మెంటు నుండి అయినా హుకుం – అనుమతి పొంది వున్నారా? అగరు – ఒకవేళ – పొందకున్నట్లయితే, ఫౌరన్ – వేంటనే – పొంద వలసింది. కెంకె– ఎందుకనగా – అక్సరు– తరుచు – మజహాబీ – మతపు – వార్తలతో జగడాలు అవుతూ ప్రాణహాని కూడా కలుగుతూ ఉన్నది. కాబట్టి మరియొక హుకుం వరకు గ్రంథాలయం మూసి ఉండవలెను."

ఉస్మాన్ " తబ్లీగ్ " అనే ప్రమాదకరం అయిన ఉద్యమాన్ని ప్రభుత్వ పరంగా ప్రారంభించాడు. తబ్లీగ్ అంటే మతాంతరీకరణం. ప్రభుత్వ పరంగా బడ్జెటులో ఇందుకు ధనం కేటాయింపు జరిగింది. ప్రతి తాసీల్ కార్యాలయంలో ఇందుకోసం ఒక అధికారిని నియమించారు. ఇందుకుగాను ఏర్పడిన శాఖ " ఉమూర్ మజుహబీ. "

నిజాం రాజ్యం సర్వతంత్ర స్వతంత్రం. కాబట్టి రాజ్యం బయటినుంచి వచ్చే సరుకులమీద సుంకం విధిస్తారు. దాన్ని ఆంగ్లంలో కస్టమ్స్ అంటారు. ఉర్దూలో కరోడ్గిరి అంటారు. నిజాం ప్రభుత్వంలో కరోడ్గిరి ఒక శాఖ. ప్రతి రైల్వే స్టేషను దగ్గర కరోడ్గిరి భవనం ఉండేది. ఆ భవనాలు ఇప్పటికీ ఉన్నాయి. వాటిల్లో వేరే కార్యాలయాలున్నాయి.

## దొర

ఒక ఊరి దొర ఇంటి పేరు – ఆ ఊరిలోని మంగలి ఇంటి పేరు ఒక్కటే. మంగలితో ఇంటి పేరు మార్చుకోమ్మని ఆదేశించారు. "తాతల తండ్రులకాడి నుంచి వస్తాందె, బాంచెను ఇంటి పేరెట్లు మార్తది దొర" అన్నాడు వాడు. ఎదురు చెప్పినందుకు తుపాకితో కాల్చి పూడ్చిపెట్టించాడు, మంగలి కుటుంబం మొత్తాన్ని దరిదాపుల్లో లేకుండా వెళ్ళగొట్టించాడు దొర.

ఒక దొర చావిట్లో కూర్చున్నాడు. అతని ముందు నుంచి చొక్కా తొడుగుకున్నవాడు పోతునావ్నడు, చొక్కా వంటి మీదనే చిరిగే దాక కొట్టి పంపించాడు.

దొర – ముందు – నుంచి పోవాలంటే తలగుడ్డా, చెప్పులూ – సాధారణంగా ఉండవు. ఒక వేళ ఉంటే – చొక్కా సహితంగా దూరంగానే అన్నీ విప్పి చేతుల్లో పట్టుకుని – వంగి దండం పెడ్తూ సాగిపోవాలి.

గడీలు కోటల్లా ఉంటాయి. అందులోకి వెళ్లిన మనిషి తిరిగి వచ్చేదాకా నమ్మకం లేదు. ఒక ఊరుగడీ – పేరు తెలుసుకాని, చెప్పను – ఆ గడీలోకి ముత్యాల వర్తకులు వచ్చారు. దొరలు, దొరసానులు ఖరీదు చేశారు. మరొకసారి మరీ విలువయినవి తెమ్మన్నారు. రత్నాలు వర్తకులు తెచ్చారు. దొరలు, దొరసానులు కొన్నారు. దొరల చుట్టాలు – దొరసాన్ల బంధువులు కొన్నారు. మరిన్ని వజ్ర, వైఢూర్యాలు తెమ్మన్నారు. వర్తకులు లాభానికి ఆశపడ్డారు. తెచ్చారు. వారిని చంపించి, పాతిపెట్టించారు. వజ్ర వైఢూర్యాలు కాజేశారు. వర్తకుల కోసం వెదుకుతూ వచ్చినవాళ్లను, ప్రాణాలు దక్కవని బెదిరించారు. బయటినుంచే సాగనంపారు.

ఇలాంటివి కోకొల్లలు. అయితే ప్రజలు సహించినన్నాళ్ళు సహించేవారు, తిరగబడ్తే దొరల ప్రాణాలు తీసేవారు. అప్పుడప్పుడూ ఆ వార్తలూ వచ్చేవి.

దొరను – నట్టనడి ఊళ్లో – పట్టపగలు – గునపం గుచ్చి చంపారు. ప్రజలు బండరాతితో దొర మెదడు చితక్కొట్టారు. ఒక ఊళ్లో దొరను గొడ్డళ్లతో నరికారు. ఒక ఊరి దొరను ముక్కలు ముక్కలుగా నరికి కాకులకు, గద్దలకు వేశారు. ఇలాంటి వార్తలు తరచుగా కాకున్నా అప్పుడప్పుడూ వినిపిస్తుండేవి.

## పటేల్ – పట్వారి

గ్రామాల్లో ప్రజలను పటేల్, పట్వారీలు పెట్టినన్ని బాధలు దొరలు కూడా పెట్టలేదు. పోలీస్‌పటేల్ అంటే గ్రామానికి పోలీసు అధికారి. శాంతి భద్రతల బాధ్యత అతనిది. జగడం జరిగిందనో, దొంగతనం అనో, కంసాల్లదగ్గర దొంగబంగారం ఉందనో సతాయించి లంచాలు గుంజుతాడు. పట్వారీ అంటే కరణం. భూమికి సంబంధించిన వ్యవహారాలన్నింటికి పట్వారీ బాధ్యత. కరణమంత పేచీకోరు మరోకరు ఉండడు. పొలాల సరిహద్దులు మారుస్తాడు. పేర్లతో పేచీ పెడ్తాడు. అందుకే కరణం పగ కాటికి పోయేదాక ఉంటది అని సామెత.

## దేశీయ రాజ్యాలు – నిజాం – భారత జాతీయ కాంగ్రెసు

భారత జాతీయ కాంగ్రెస్ దేశీయ సంస్థానాల పాలనలో జోక్యం కలిగించుకోలేదు. వారి పోరాటం బ్రిటిషిండియాకు మాత్రమే పరిమితం అయింది. మహాత్ముడు దేశీయ రాజ్యాల విషయంలో కల్పించుకోబోమని ప్రకటించారు అలా చేసి వారి విశృంఖలత్వానికి లైసెన్సు ఇచ్చారు. నవాబులు, రాజులు, మహారాజులు ప్రజల రక్తాన్ని వారి ఇచ్చవచ్చినంత పీల్చారు.

భారత జాతీయ కాంగ్రెస్, మహాత్ముని – ఆ పాలసీ వలన మూడోవంతు భారతదేశం కట్టుబానిస అయింది. అయినా, వారు పట్టించుకోలేదు. మహారాజుల దుశ్చర్యలను గురించి దీవాన్ జర్మనీదాస్ " మహారాజా " అనే ఇంగ్లీషు పుస్తకంలో వివరించారు. మహాత్ముడు హైదరాబాదు వచ్చారు. వచ్చినపుడల్లా తాను రాజకీయాలు మాట్లాడనని మాట ఇచ్చారు. నిర్మాణ కార్యక్రమాల గురించి తప్ప మాట్లాడలేదు. మహాత్ముడు మాట తప్పడు. అది నిజాంకు తెలుసు.

జాతీయ నాయకురాలు – భారత కోకిల సరోజినీనాయుడుగారి నివాసం హైదరాబాదు. వారి నివాసం గోల్డెన్ త్రెషోల్డ్‌లో ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు ఉంది. సరోజినీ నాయుడు రాజకీయ నాయకత్వం హైదరాబాదు రాజ్యానికి ఆవలనే ! హైదరాబాదు వచ్చినపుడు రాజకీయానికి సంబంధించి పల్లెత్తు మాట మాట్లాడేవారు కారు !

## తెలంగాణ

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రులు తమిళుల పోరు పడలేకపోయారు. తమిళుల పెత్తనం వదిలించుకోవడానికి ఆంధ్రులు తమకు భాషా రాష్ట్రం కావాలన్నారు. అది సాధించడానికి ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఆ విధంగా భారతదేశంలో భాషారాష్ట్రప్రతిపాదన తెచ్చిన తొలివారు ఆంధ్రులు అయినారు. బ్రిటిషాంధ్రులు కోరిన భాషారాష్ట్రం బ్రిటిషిండియాలోని ఆంధ్రులకే పరిమితం అయింది. తెలంగాణాంధ్రుల గురించి అందులో ప్రస్తావన లేదు.పొట్టి శ్రీ రాములుగారి ఆత్మాహుతి, శ్రీభాగ్ ఒడంబడికలో కూడా తెలంగాణ ప్రస్తావన లేదు.

## కార్ల్ మార్క్స్

మానవ జాతి చరిత్రలో శ్రమను దోచుకోవడాన్ని శాస్త్రీయంగా వివరించినవాడు కారల్ మార్క్స్ ఒక్కడే. ధన స్వామ్య సమాజంలో ధనస్వాములు శ్రామికుల రక్తాన్ని పీల్చడం చూసి, కారల్ మార్క్స్ హృదయం తపించినంతగా మరొకరి హృదయం తపించి ఉండదు. మార్క్స్ మహా మేధావి. మహా మనీషి. అనంత మానవతామూర్తి. అతడు ధనస్వామ్యపు పట్టపగలు దోపిడిని బయట పెట్టాడు. వారి ఎత్తులను, జిత్తులను కనిపెట్టాడు. శ్రామిక వర్గం ధన స్వామ్యపు ఊబినుండి బయటపడడానికి సశాస్త్రీయమైన వెలుగు బాటను కనిపెట్టిన మహర్షి కారల్ మార్క్స్. సమాజంలో లోపాలను అనేకమంది వివరించారు. ఎత్తి చూపారు. మానవ సమాజం ఇలా ఉండాలి అని చెప్పినవాడు మార్క్స్ మహాశయుడు ఒక్కడే. " ప్రపంచ శ్రామికులారా ! ఏకం కండి. ఎదురు తిరగండి. మీ దగ్గర ఏమీలేదు పోగొట్టుకోడానికి. పోతే బానిసత్వమే పోతుంది – తెగుతే సంకెలులే తెగుతాయి" అనే నినాదంతో శ్రామిక ఉద్యమాల చిచ్చు రగిల్చినవాడు మార్క్స్ మహర్షి.

## వింతలు

మేరు బసవయ్య ఊళ్ళోకి సింగర్ మిషను తెచ్చాడు. అదొక పెద్ద వింత! ఊళ్ళకు ఊళ్ళు వచ్చి చూచారు. నేనూ, మా అన్నయ్య గంటల తరబడి నుంచోని చూచాం. అదొక వింత అనుభూతి! ఇలా తొక్కగానే చక్రం తిరుగుతుంది. లయబద్ధ ధ్వని, బట్టను కుట్టడం. బహుశ: ఇప్పుడు చంద్రుని మీద దిగినా అలాంటి అనుభూతి రాదు.

గ్రామోఫోను లోంచి పాట వినిపిస్తే ఎక్కడి – నుంచి వస్తున్నదా అని ఆశ్చర్యం! అందులో మనిషి ఉండి పాడుతున్నాడేమో అనుకునేవాణ్ణి! అన్నం నీళ్ళు లేకుండా మనిసి ఎట్లా ఉంటాడు అని అనుమానం! ఎవరిని అడిగినా చెప్పరు. వారికే తెలియదేమో! గ్రామోఫోను పెద్దే అక్కడే ఉండాలనిపించేది. ఎంతసేపు ఉంటాం? మా నాయన – వెంట పోవడం – రావడం.

ఖమ్మంలో చిమ్నీ లైట్ల బదులు ప్రధాన వీధుల్లో పెట్రోమాక్సులు ఏర్పరచారు. ఒక గడకు లైట్లు తగిలించుకొని వస్తాడు. వెలుగు మనిషి. వెలుగుట తెస్తున్న మనిషిని చూస్తే విచిత్రం అనిపించేది. చిమ్నీలు అందంగా ఉండేవి. పెట్రోమాక్సులు విచిత్రంగా ఉండేవి! వెలుగు మనిషి తీగ కొక్కేనికి లైటు తగిలిస్తాడు. తీగను లాగుతుంటే పైకి వెళ్ళిపోతుంది. లైటు పెట్టిన తొలిరోజు మా సంబరానికి అవధుల్లేవు. తెల్లవార్లూ ఆడాం.

నిజాం రాజ్యంలో పోలీసునాకా – స్కూలు – టపాఖానా ఉన్నది ప్రధాన గ్రామం. ఈ ఊళ్లో ఇవన్నీ ఉన్నాయి. "మాసూమలీ" అనే పోస్టు బంట్రోతు విచిత్రంగా ఉండేవాడు. అతని నడుముకు పటకా, వానికి తళతళమెరిసే ఇత్తడి బిళ్ల. దానిమీద ఊర్దూలో నిజాం సర్కారు ఉద్యోగి టపాజావాను అని వ్రాసి ఉండేది. అతని చేత ఒక బల్లెం. ఆ బల్లానికి గజ్జెలు. గజ్జెలు గలగలలాడిస్తూ ఉరికేవాడు.

కూత కూసుకుంటూ రైలు సాగుతుంది. రైలు మొత్తం అయిదారు పెట్టెలకు మించి ఉండేవి కాదు. ఒకటే లైను. ఎదురు బండి వస్తే స్టేసనులో ఆగిపోవాలి. అది సాగిపోయాక – ఇది కదలాలి. మద్రాసు – ఢిల్లీల మధ్య నడిచే జి.టి.ఎక్స్‌ప్రెస్ తప్ప – మిగతా రెండు పాసింజర్లే. అన్ని స్టేషన్లలో ఆగుతాయి. బెజవాడ వరకు మహారాష్ట్ర రైల్వే. బెజవాడ నుంచి – మద్రాస్ సదరన్ మహారాష్ట్ర రైల్వే. బెజవాడలోకు గుర్తింపులేదు. దానికి స్వంత ప్లాట్ ఫారం ఉన్నా గంటల తరబడి వంటిరెక్క దగ్గర నిలిపివేసేవారు.

• • •

# వేదం-జీవననాదం

(డా.దాశరథి రంగాచార్యులు)

వేదం మానవజాతికి పరమాత్మ ప్రసాదించిన ప్రాచీన గ్రంథం. తొలి గ్రంథం. విశిష్ట గ్రంథం. పవిత్ర గ్రంథం. వేదం భారత దేశంలో వెలిసింది. ఆర్యావర్తంలో వెలిసింది. ప్రస్తుతం అదృశ్యం అయిన సరస్వతీ నదీ తీరాన వెలిసింది. అంతమాత్రాన ఇది భారతదేశానికి మాత్రమే చెందినదికాదు. ఏ మతానికీ, ఏ కులానికీ, ఏ దేశానికి చెందింది కాదు. ఏ వర్గానికి చెందినదికాదు. ఇది సమస్త మానవాళికి చెందినది !

జ్ఞానానికి, విజ్ఞానానికి భౌతికహద్దులు లేవు. జ్ఞానం విజ్ఞానం మహాపర్వతాలను దాటగలదు. సముద్రాలను దాటగలదు. అరణ్యాలను దాటగలదు.

గాలిని బంధించిన మొనగాడులేడు ! జ్ఞానమును కట్టిపెట్టగల నియంతలేడు !!

వేదం చేసిన మహత్కార్యం స్త్రీ పురుషుల లైంగిక స్వేచ్ఛను అరికట్టడం – దాన్ని నిబద్ధీకరించడం. కుటుంబ బాధ్యతలు స్వీకరించేట్లు చేయడం. పశువులలో వలె సంతాన బాధ్యత తల్లిది మాత్రమేకాక తండ్రినికూడా బాధ్యుణ్ణి చేయడం. వివాహం వేదం ఏర్పరచిన ఓ మహత్తర వ్యవస్థ. ఇది కుటుంబాన్ని కలిపి ఉంచుతుంది. మానవుడు ప్రేమ, అభిమానం, ఆత్మీయత, అనురాగం, ఈర్ష్య, ద్వేషం, ప్రతీకారంలాంటి సమస్తమూ కుటుంబంనుంచే నేర్చుకుంటాడు. నిన్నటి, నేటి,రేపటి ఎంతటి ప్రగతిశీల సమాజం అయినా కుటుంబ సంక్షేమం మీదనే ఆధారపడి ఉంటుంది.

అనంత స్వేచ్ఛతో ఆటవిక జీవనం కొనసాగిస్తున్న నరుని చెవులు పిండి, కుటుంబంగా ఏర్పరచి వేదం,మహర్షులు విశ్రమించలేదు. మానవుని ముందుకు నడిపించడానికీ, సచ్ఛీలమగు జీవితం గడిపేట్లు చేయడానికి వేదం, మహారుషులు అనే సంస్థలు నిరంతరం కృషి చేశాయి.

ఇన్ని వేల సంవత్సరాలుగా కుటుంబాన్ని, సమాజాన్ని ఈ సంబంధాలే కూర్చి ఉంచుతున్నాయి. అందుకు ఎన్ని వేలమంది నిరంతరం నిస్వార్థంగా పనిచేశారో – ఎంత శ్రమించి ఒక్కొక్కరిని ఒప్పించడానికీ కూర్చడానికి అవిశ్రాంతంగా సంచరించారో ఊహించాల్సిందే! చరిత్ర లేదు! రికార్డులు లేవు!! వారి పేర్లు తెలియవు!!!

వేదం గ్రామాలను ఏర్పరచింది. కొన్ని కుటుంబాలను కలిపి ఒక గ్రామంగా ఏర్పరచింది. 'ఏర్పరచింది' అనడం తేలికే కాని ఏర్పరచడానికి ఎన్ని హంగులు కావాలి. ఇల్లు, గృహం ఎన్ని పరిశోధనల ఫలితమో! ఇంటి నిర్మాణం, అందుకు సంబంధించిన శాస్త్రం, వస్తుసామగ్రి, స్థలం, వీధులు, గ్రామ నిర్వహణ ఇది సామాన్య తపస్సు ఫలితంకాదు!

లోకమంతటా ఒకేరకపు పర్ణశాలలు, పెంకుటిళ్లు, సౌధాలు నిర్మించబడినాయి. శాస్త్రజ్ఞులు అందుకు అక్కడ లభించే సామగ్రిని, శ్రమనే వాడారు. తమకు తాము ఇళ్లు కట్టుకునే పద్ధతిని మానవాళికి నేర్పారు. ఆ విషయంలో మానవుని స్వయంసమృద్ధుని చేశారు.

గ్రామజీవితం సులభంగా, సుగమంగా సాగడానికి గ్రామపెద్దను ఏర్పరచారు. అతని అధికారాలను స్థిరపరచి గ్రామస్థులు అతని అధికారానికి లొంగి ఉండేటట్లు–ఆదేశాలను పాటించేటట్లు చేశారు.

వృత్తిపనుల వారిని ఏర్పరచడం జరిగింది. అవసరం అయిన వృత్తులను గుర్తించి, వారికి శిక్షణ ఇచ్చి, గ్రామంలో సౌకర్యం కలిపించి ఉంచడం జరిగింది. ఏ వృత్తి పనివారి ఇళ్లు ఆ వృత్తికి కర్మాగారాలు మాత్రమేగాక పాఠశాలలు–శిక్షణాలయాలు.

ఏ వృత్తి కుటుంబంలో పుట్టినవారికి శిక్షణ ఆ కుటుంబంలోనే లభిస్తుంది. వారు నైపుణ్యం సంపాదిస్తారు. ఇవి స్వయంపోషక శిక్షణాలయాలు-కర్మాగారాలు. వీరిని గ్రామం పోషిస్తుంది. వీరు గ్రామానికి సేవలు అందిస్తారు. ఈ వ్యవస్థలో 'నిరుద్యోగం' అనే పదం ఉండదు. కరవు, ఆకలిని గ్రామం ఉమ్మడిగా భరిస్తుంది. సంపద, సమృద్ధిని గ్రామం ఉమ్మడిగా అనుభవిస్తుంది.

చెప్పడం చాల తేలిగ్గా వుంది. కాని వృత్తులు ఎన్ని అవసరం? ఎవరు తొలుత ఎంతమందికి శిక్షణ ఇచ్చారు? శిక్షితులు గ్రామాలకు వెళ్లి ఎలా శిక్షణ ఇచ్చారు? ఏ విధంగా ఈ వృత్తులను స్థిరపరచారు? స్థిరపరచి నిరంతరం పనికివచ్చే స్వయంసమృద్ధ సంస్థలుగా ఎలా ప్రతిష్ఠించారు? ఎవరితో అక్కరలేక నిరంతరం సాగిపోయే ఒక అక్షయ వ్యవస్థను ఎలా ఏర్పరచారు? ఎన్ని పరిశోధనలు, ఎన్ని ఆవిష్కరణలు, ఎందరి ప్రచారాలు ఈ వ్యవస్థను సుస్థిరం చేశాయి? వీటిని గురించి ఊహించినపుడు, ఆలోచించినపుడు మనోనేత్రంతో వీక్షించినపుడు అబ్బురము, ఆశ్చర్యం కలుగుతాయి!

వేదం, ఋషి ఈ సంస్థ ఎంతటి విశాలమో, ఎన్ని శాఖోపశాఖలదో, ఎంత విరాట్ స్వరూపం గలదో అర్థం అవుతుంది. ఇందులో ఒకదాని తరువాత ఒకటి జరుగుతే సమాజ నిర్మాణం సాధ్యపడదు. వివాహం, కుటుంబం, వావి వరుసలు, గృహం, గ్రామం, గ్రామణి, వృత్తిపనులవారు ఒకటి తరువాత ఒకటికాదు అన్ని ఏకకాలంలో జరిగి ఉండాలి. అంటే ఆ సంస్థకు ఒక నాయకుడు-శాఖోపశాఖల శాస్త్రజ్ఞులు ఏకకాలంలో పనిచేయకుంటే అభ్యుదయం అసాధ్యం. ఇందుకు ఎంతో పటిష్ఠమైన ప్రణాళిక, కార్యక్రమం అవసరం. వీటి నిర్మాణం చూస్తుంటే నేటి మన పారిశ్రామిక ప్రణాళికను మించిన దానిగా కనిపిస్తున్నది. ఈ కార్యక్రమాన్నంతా మునులు, ఋషులు, ఆశ్రమాలు నిర్వహించి వేదరూపంగా ప్రచారంచేసినట్లు కనిపిస్తుంది.

జంతువులు లేక మానవుడు జీవించజాలడు. ఎటువంటి జంతువులు అవసరం అని ఒక శాఖ కృషి చేయగా మరొక శాఖ ఆటవిక జంతువులను మచ్చిక చేసి వాటిని గ్రామాలకు చేర్చినట్లు అనిపిస్తుంది. వేదం పంచ పశువులను గుర్తించింది. 1.నరుడు 2.అశ్వము 3.గోవు 4.గొర్రె 5.మేక. ఇవికాక అధర్వవేదంలో 6.ఒంటె 7.గాడిదను కూడా చేర్చడం జరిగింది. ఋగ్వేదంలో పశువులను మూడు వర్గాలుగా విభజించడం జరిగింది. 1. వాయవ్యములు--గాలిలో ఎగిరేవి 2.ఆరణ్యకములు-అడవి మృగాలు 3.గ్రామ్యములు-పెంపుడు జంతువులు. జలచరాల విషయం ఇందులో చెప్పలేదు.

ఈ మహా విశ్వంలో కొన్ని వేల రకాల గడ్డి ఉంది. వీటిలో విషతుల్యమూ అపాయకరములు ఉండి ఉండాలి. వీనిలో బియ్యం, గోధుమలు, జొన్నలు, సజ్జల వంటివి మాత్రమే తినదగినవి అని తెలిసికోవడానికి ఎటువంటి పరిశోధనలు జరిగినవో! ఇవాళ పరీక్షనాళికయే పరిశోధనలకు మూలం అంటున్నారు.

భారత సాహిత్యంలో ఆత్మహత్యలు లేవు.జీవించి సాధించాలి అనేది మన సాహిత్యపు సందేశం. సీతారాములూ-పాంచాలీ పాండవులు-నలదమయంతులు, చంద్రమతీ హరిశ్చంద్రులు-కష్టాలకొలిమిలో కాలి జీవితాన్ని ప్రకాశవంతం చేసుకున్నారు. వారిని మించిన కష్టాలు ఉండవు. పూర్వం వీరి కథలు అందరికీ తెలిసేవి. అంతేకాదు అవి అందరి జీవితాల్లో అంతర్భాగాలు అయినాయి.

'పొయ్యి' ఈ పదం ఎప్పుడు పుట్టిందో తెలియదు. కాని తొలుత ఇది మూడురాళ్లు. రెండు రాళ్ళు ముందు-ఒకటి వెనుక. ఇది కనిపెట్టిన మహాత్ముడెవడో సకల మానవజాతికి వందనీయుడు. కనిపెట్టాడు సరే ఊరూరా దీనికి ప్రచారం ఎట్లా చేశాడు? భారత ప్రభుత్వం. అనేక వ్యయ, ప్రయాసాలతో-పొగలేని పొయ్యి ఏర్పరచింది. టి.వి., రేడియో మున్నగు అత్యంత శక్తివంతమైన సాధనాలతో ప్రచారం చేస్తున్నది. అయినా దాన్ని గురించి తెలిసినవారు కొద్దిమంది-తెలియనివారు ఎక్కువమంది. మూడురాళ్ల పొయ్యి-మరీ నాగరికులం అనిపించు కునేవారికి తప్ప-అందరికీ తెలుసు. మన జనానికి రానిది అక్షరం మాత్రమే! బతికే నేర్పు భారత ప్రజలకుంది. వారు అడవుల్లో, గుట్టల్లో, తిరునాళ్లలో నిముషంలో పొయ్యి ఏర్పాటు చేసికోగలరు. దీనికి పైసా అక్కరలేదు. మెకానిక్కుతో పనిలేదు!

ఇటు నిప్పు, అటు నీటి సంధానం చేయడానికి 'కుండ'ను కనిపెట్టారు. కుండను తొలుత కనుగొనడం సామాన్యం కాదు. గిరగిరా తిరిగే సారె–చక్రం. దానిమీద తన హస్తకళా నైపుణ్యంతో మట్టి రూపాలను తీర్చి, దిద్దే కుమ్మరి! పచ్చి కుండలను కాల్చి గట్టిపరచే వాము. అలా తయారై అందంగా పేర్చిన కుండలు!

నేటికీ మూలరూపం కుండలదే! పదార్థం మారింది. పాత్రలైనాయి అంతే!

పొయ్యి మీద నీటికుండ ఉంచి, పొయ్యిలో మంట పెడ్తే అగ్నిగుణం నీటికి అంటుతుంది. నిప్పు చల్లారదు! ఇది ఎంత మహత్తర క్రియ! మానవ జాతి నాగరికతకు సోపాన ప్రాయం ఇది. ఇప్పటికీ మూల సూత్రం ఇదే! ఆవిరి పద్ధతి Steam system దీని మీదనే ఆధారపడి ఉంది. నీటికీ, నిప్పుకూ మధ్య సయోధ్య – కుండ ద్వారా–కలిగించి తరువాత అన్నం వండడం వచ్చింది. అదీ అంత తేలికకాదు. వడ్లు దంచడం–అందుకు రోలూ రోకలీ కనిపెట్టడం–బియ్యం కడగడం–ఎసట్లో వేయడం–ఉడికిందీ లేనిదీ–తెడ్డుతో ఉడికే మెతుకును తీసి చూడడం–అప్పుడు కుండ దింపడం. ఇవన్నీ సామాన్యములు కావు.

ఎండకాలంలో కొత్త కుండలో నీళ్లు ఎంత రుచి! ఇసుకలో ధాన్యం చల్లుతే వచ్చిన మొక్కల్లో కుండ కంటి కింపు. చల్లని నీరు నాలుకకు ఇంపు!

ప్రాచీన భారత రాజ్యం పాలించింది – ఎన్నడూ శాసించలేదు. ఇంగ్లీషు రాజ్యం వచ్చేదాకా భారతదేశానికి శాసనాలు చేయడం – తెలియదు ! సామాజిక నియమాలకు లోబడి రాజులు పాలించారు! ధర్మానికి లోబడి రాజులు పరిపాలించారు.

సమాజానికి అధికారం లేదు. బలం లేదు. ఆయుధం లేదు. అయితే ప్రాచీన భారతం స్వార్థరహితులు, త్యాగనిరతులు, సమాజ కళ్యాణ కారకులగు మహర్షులను–మహామునులను–సాధువులను, సంతులను సిద్ధం చేసింది. వీరికి జీతభత్యాలు లేవు. వీరు భిక్షాటనకు కూడా సిద్ధపడ్డారు. సమాజం వారిని పోషించింది. వారు సమాజానికి సత్యబలం, ధర్మబలం, న్యాయబలం నైతిక బలం కలిగించారు.

ఈ మహానుభావులు వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేశారు. వారిని నీతిమంతులుగా, ధర్మవంతులుగా సిద్ధం చేశారు. ప్రజలను ధర్మానువర్తులను చేశారు – రాజ్యానువర్తులను కాదు. కావున రాజు ధర్మానువర్తి కాక తప్పింది కాదు.

సాంఘిక నేతలు స్వచ్ఛందులు. వారికి అధికారం లేదు –బలం లేదు. అయినా వారు రాజులను మించిన శక్తిమంతులు. వాల్మీకి–వ్యాసుడు–శ్రీశుకుడు–మహా వీర వర్ధమానుడు–బుద్ధ భగవానుడు–ఏసు ప్రభువు–మహామ్మదు చేసినంత ప్రభావం ఏ రాజు, ఏ చక్రవర్తి, ఏ సామ్రాట్టు చేయలేకపోయారు.

సత్యబలం–న్యాయబలం–ధర్మబలం అన్ని ఆయుధాలను తలదన్నినవి! ఆయుధం నాశనం చేస్తుంది. ధర్మం నిర్మాణం చేస్తుంది. ఆయుధానికి దురాశ ఉంది. ధర్మానికి సమున్నత మానవతా లక్ష్యం – ధ్యేయం ఉంది.

సామాజిక నేతలకు సాహిత్యమే ఉపకరణం. సాహిత్యం అక్షర నిర్మితం మాత్రమే కాదు. అది వాగ్నిర్మితం కూడ. కథలు చెప్పి –కథల ద్వారా నీతి బోధించి మానవ జీవితాన్ని శాంతిమయం, సుఖప్రదం చేయడానికి ప్రయత్నించడం భారత సాహిత్య కృషియే. రామాయణ, భారత, భాగవత కథలు, పంచతంత్రాదులు, బుద్ధుని జాతక కథలునరుని మానవుని చేయడానికి జరిగిన మహత్తర ప్రయత్నం. ఇందు మనం ఎంతో విజయవంతులం అయినాం.

ప్రజలలో ఈ దైవభీతి కలిగించడానికి వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, భారత, భాగవతాలు, కావ్యాలు నిరంతరం కృషి చేశాయి. ప్రభుత్వం ఉన్నా, లేకున్నా–శాసనం ఉన్నా లేకున్నా వ్యక్తి నీతిమంతుడు అయినాడు. ఆ విధంగా గ్రామస్వరాజ్యం న్యాయాన్నీ, ధర్మాన్ని పరిరక్షించుకుంది.

పూర్వం కుటుంబంలో నాలుగు తరాలుండేవి. తర్వాత మూడు తరాలు ఐనవి. నిన్నటి కుటుంబం తల్లిదండ్రులు – పిల్లలు అనే రెండు తరాలకు తగ్గిపోయింది. నేటి కుటుంబంలో తరాలే లేవు. భార్య ఒకచోట– భర్త ఒక చోట– ఉంటే గింటే పిల్లలు హాస్టళ్లలో వీరు డబ్బును తప్ప దేన్నీ ప్రేమించరు. ధనమే వీరి ప్రమాణం. అన్నిటి కొలతా డబ్బుతోనే.మానవ సంబంధాలు కేవలం ఆర్థిక సంబంధాలైనాయి.

సుగ్రీవుడు సీతమ్మ మూటకట్టి విడిచిన నగలను రామునికి చూపించాడు. గమనించండి వాల్మీకి కథావైచిత్రి !

రాముడు మూట అందుకున్నాడు. దానిని చూడగనే రామునికి జానకి గుర్తుకు వచ్చింది.

మంచు కమ్మిన చంద్రునివలె – రాముని కనులు కన్నీటనిండినవి. ఒక శ్లోకంలో రామునకు సీత విషయంలో ఉన్న ప్రేమను, ఆమె ఎడబాటువలన రాముడు అనుభవిస్తున్న వేదనను తెలియపరచాడు. భార్యాభర్తలకు ఉండవలసిన అనుబంధాన్ని వివరించాడు.

" లక్ష్మణా! నేను చూడలేకున్నాను. ఇవి సీత నగలేనా చూచి చెప్పు" అన్నాడు.

రాముని మాటలు విని లక్ష్మణుడు ఇలా అన్నాడు.

నాకు కేయూరములూ తెలియవు. కుండలములూ తెలియవు. నిత్యం పాదాభివందనం చేస్తాను. అందువలన కాళ్ల కడియాలు 'అభిజానామి' బాగుగా తెలియును.

బహు సుందరమైన ఈ శ్లోకంతో వాల్మీకి వదిన-మరదుల సంబంధాన్ని ఎంతో బలంగా వివరించాడు. వదిన తల్లివంటిది. కాని తల్లికాదు. తల్లి ముఖం చూడకుండా ఉండడం అసాధ్యం. వయసులో వ్యత్యాసం అలా ఉంచుతే ఎంత పెద్దవాడైనా మాతృపరిష్వంగంలో అనిర్వచనీయ ఆనందాన్ని అనుభవిస్తాడు! వదినతో సంబంధం అలాంటిది కాదు. వయసులో సామ్యంవల్ల వదిన దూరంనుండి తల్లి అవుతుంది. ఆమె ముఖం చూడరాదు. పాదాభివందనం మాత్రం చేయాలి.

ఇంత స్పష్టంగా, సమగ్రంగా మానవ సంబంధాలను నిర్వచించింది రామాయణం. రామాయణంవంటి మహోన్నత కావ్యం- వాల్మీకివంటి మహామనీషి, మహర్షి, మహాకవి భారత సమాజానికి తప్ప, మరే సమాజానికీ లేరు. అందుకు భారతజాతి గర్వించాలి. పాశ్చాత్యులు రామాయణంమీద పడి చస్తున్నారు. వారిని చూచి అయినా మనం నేర్చు కోవాలి!

రామాయణ ప్రస్తావన రావడానికి కారణం కుటుంబంలో వావి వరుసలు వేదమే ఏర్పాటు చేసిందని చెప్పడం.

నేడు పార్లమెంటు శాసనసభలు యంత్రాల్లా శాసనాలను తయారు చేస్తున్నాయి. కాని అమలు పరచడానికి సామర్థ్యం లేకున్నది. శాసనాలు శాసన భంగానికి సహకరిస్తున్నాయి. క్రిమినల్స్‌ను తయారు చేస్తున్నాయి!

సృష్టిలో అతి సూక్ష్మపదార్థం పరమాణువు. 2-పరమాణువులు 1-అణువు, 3-అణువులు-ఒక త్రసరేణువు, 3-త్రసరేణువులు-ఒక తృటి, 100-తృటులు-1-వేధ, 3-వేధలు-ఒక లవం, 3-లవములు-ఒక నిమేషం-ఇది మనం వాడుతున్న మినట్ నిమిషం కాదు. ఇది సెకెనులో 16/75వ భాగం, 3నిమేషములు-ఒకక్షణం, 5-క్షణాలు 1-కాష్ట, 10-కాష్టలు-ఒక లఘువు, 15-లఘువులు-ఒక గడియ, ఏడున్నర గడియలు 1-జాము, 8-జాములు-ఒక రోజు, 15-రోజులు-ఒక పక్షం,2పక్షాలు-ఒక నెల, 2నెలలు-ఒక ఋతువు, 3ఋతువులు-ఒక అయనం, 2ఉత్తర, దక్షిణాయనములు-ఒక మానవ సంవత్సరం, 17,28,000 సంవత్సరాలు-కృతయుగం, 12,96,000 సంవత్సరాలు-త్రేతాయుగం, 8,64,000 సంవత్సరాలు-ద్వాపరం, 4,32,000 సంవత్సరాలు కలియుగం.

4 యుగాల మొత్తం కాలం 43,20,000 సంవత్సరాలు.

సృష్టికాలం 1000×4 యుగాలు=4 కోట్ల 32 లక్షల సంవత్సరాలు. 4000 యుగాల తరువాత ప్రళయం. 4000 యుగాల కాలం సృష్టి ఉండదు. తరువాత మళ్లీ సృష్టి మొదలు.

సృష్టి ఆది నుండి ప్రమాది సంవత్సరం-1999-2000 వరకు 195,58,85,100 సంవత్సరాలు

కలియుగంలో గడచిన సంవత్సరాలు-5,100.

పాశ్చాత్యుల కాలం సొంతం ఇప్పటికి 2000 సంవత్సరాలే!

వారు వ్రాసిన చరిత్ర 5000 సంవత్సరాలు దాటదు. వారికి కలియుగం మాత్రమే తెలుసు!

యూరొపు చరిత్ర సొంతం వందల వేల సంవత్సరాలదే! అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల చరిత్ర వందల యేళ్లదే! పాశ్చాత్యుల కొలతలతో వేదకాలాన్ని కొలవడం గజంబద్దతో ఆకాశాన్ని-బకెటుతో సముద్రాన్నీ కొలవడంలాంటిది. అయితే పాశ్చాత్యులు వేదాన్ని-స్వప్రయోజనంకోసమే అయినా-అధ్యయనం చేశారు. అలా అధ్యయనం చేసిన వారిలో 'మాక్స్‌ముల్లర్' ముఖ్యులు. అతని అధ్యయనానికి ఆనందించిన భారతీయ మేధావులు అతన్ని 'మోక్షమూలరుడు' అనికూడా అన్నారు. మోక్షమూలరుడు వేదాన్ని గురించి అన్న మాటలివి:

"What can be more tedious than the Veda, and yet, what can be more interesting, if once we know that it is the first word spoken by the Aryan man?"

"The Veda has a two-fold interest: it belongs to the history of world and to the history of India...As long as we continues to take an interest in the history of his race, and as long as we collect in libraries and museums the relics of formers ages, the first place in that long row of books which contain the records of the Aryan branch of mankind, will belong for ever to the Rgveda".

"వేదంకన్నా విసుగు కలిగించేది ఏది? అయినా ఇది ఆర్య మానవుని తొలినోటి మాట అని తెలుసుకొన్నపుడు వేదానికన్నా ఆసక్తికరం అయింది మాత్రం ఏది?

వేదానికి రెండురకాల ఆసక్తి-ప్రయోజనం ఉంది. వేదం భూగోళచరిత్ర-భారతచరిత్ర అగును. మానవుడుతన జాతి చరిత్రలో ఆసక్తుడైనంతకాలం అతడు గత కాలంకోసం గ్రంథాలయాలను, ప్రదర్శనశాలలను, అవశేషాలకోరకూ అన్వేషిస్తూనే ఉంటాడు. అలాంటి అన్వేషణలో-గ్రంథపరంపరలో-నిరంతరం దర్శనం ఇచ్చేది ఋగ్వేదం, మానవులలో ఆర్యులకు సంబంధించిన సమస్త వృత్తాంతం ఋగ్వేదంలో నిక్షిప్తం"

జీన్ లీ మీ ఇలా వ్యక్తపరిచారు:

"Precious or durable materials-gold, silver,bronze, marble, onyx or granite-have been used by most ancient people in an attempt to immortalize their achievements. Not so, however, with the ancient Aryas. They turned to what may seem the most volatile insubstantial of all-the spoken word and out of this bubble of air fashioned a monument which more than thirty, perhaps forty, Centuries later stands untouched by time or the elements. For the pyramids have been eroded by the desert wind, the marble broken by earth quakes, and the gold stolen by robbers, while the Veda remains recited daily by an unbroken chain of generations, travelling like a great wave through the living substance of mind".

'అత్యంత పురాతన నరుల్లో అనేకులు-తమ విజయాలను శాశ్వత పరచడానికి, విలువైన మన్నికగల బంగారం-వెండి -కంచు-పాలరాయి-నల్లరాతిని వాడారు. సనాతన ఆర్యులు మాత్రం భిన్నంగా వ్యవహరించారు. వారు త్వరగా చెరిగే, అస్థిరరూపంగల అక్షరాన్ని-శబ్దాన్ని-ఎన్నుకున్నారు. ఆర్యులు ఈ గాలిబుడగతో తీర్చిదిద్దిన నిర్మాణం ముప్పది, నలుబది శతాబ్దాల తరువాత కూడా కాల, ప్రాకృతిక ప్రభావాలకు అతీతంగా చెక్కుచెదరక నిలిచి ఉంది. పిరమిడ్లు ఎడారి గాలులకు తరిగిపోయాయి. పాలరాతి కట్టడాలు భూకంపాలకు కూలిపోయాయి. బంగారం దొంగల పాలైంది. వేదగానం మాత్రం నిత్యం, నిరంతరం తరతరాలుగా వినిపిస్తున్నది. ఆ వేదస్వరం మేదస్సుయొక్క సజీవ పదార్థంగా-అలలుగా, తరంగాలుగా పయనిస్తూనే ఉంది'.

• • •

# ఒక యోగి ప్రస్థానం

## ( రాబిన్ ఎస్.శర్మ)

## ఆస్తులు త్యజించి ఆత్మశోధన కోసం

జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించాలంటే, నీ తోటకు కాపలా నిల్చుని అతి చక్కని సమాచారాన్ని మాత్రమే లోనికి రానివ్వాలి. ఒక్క వ్యతిరేక ఆలోచనని కూడా రానివ్వకూడదు ఒక్కటంటే ఒక్కటి కూడా. బయటి నుంచి చూసినపుడు, ఈ ప్రపంచంలో ఉన్న ఆనందం పొందినవారూ, శక్తి మంతులూ, తృప్తితో జీవిస్తున్నవారూ అందరూ మనలానే ఉంటారు. మనందరిలోనూ ఉన్నది మాంసమూ, ఎముకలే. అందరం ఒకే విశ్వాధారం నుంచి జన్మించాం. అయితే, కేవలం బతకడంతో సరిపెట్టుకోక, తమ శక్తి సామర్థ్యాలను నిరతాగ్నిహోత్రంగా జ్వలింపజేస్తూ, జీవిత నాట్యాన్ని అనుభవించగలిగిన వాళ్ళు, సాధారణ జీవితం గడిపే వారికంటే భిన్నమైన జీవితాన్ని జీవిస్తారు. అన్నిటి కంటే ముఖ్యంగా వాళ్ళు చేసే పని, ప్రపంచం గురించి, అందులో జరిగే విషయాల గురించి సానుకూల దృక్పథం కలిగి ఉండడం.

ఒక సగటు మనిషి ఒక సగటు రోజున తన మనసులో అరవై వేల ఆలోచనలు కలిగివుంటాడట. దాని కంటె విచిత్రమేమిటంటే, ఈ ఆలోచనల్లో 95 శాతం దానికి ముందురోజు ఆలోచించినవే. మన సారం లేని ఆలోచనల వైపరీత్యం అది. రోజూ ఒకే ఆలోచనలున్న వాళ్ళు, అందులోనూ వ్యతిరేక స్వభావం కలిగిన ఆలోచనలు వచ్చేవాళ్ళు మానసికంగా దురలవాట్లకు గురవుతారు. తమ జీవితంలోని మంచిపై దృష్టిని కేంద్రీకరించి, జీవితాన్ని మరింత మెరుగు పరుచుకుందామని అనుకునే బదులు, వారు తమ గతానికి బానిసలవుతారు. వీరిలో కొందరు విఫలమైన అనుబంధాల గురించో, ఆర్థిక సమస్యల గురించో ఆలోచిస్తారు. మరి కొందరు బాల్యంలో జరిగిన చెడు అనుభవాలను తలుచుకుంటారు. ఇంకా కొందరు మరీ అల్ప విషయాల గురించి ఆలోచిస్తారు; ఒక దుకాణంలో గుమాస్తా తమను అవమాన పరిచాడనో, సహోద్యోగి తనపై వ్యతిరేకత ప్రకటించాడనో ఆలోచిస్తూ కూర్చుంటారు. ఇలాంటివి ఆలోచించేవాళ్ళు తమ ఆందోళనల వల్లే జీవన శక్తిని హరింప చేసుకుంటున్నారు. తమ మనసుల్లో ఉన్న మాంత్రిక శక్తిని, తమ జీవితాలకు, మానసికంగా, భౌతికంగా, చివరికి ఆధ్యాత్మికంగా సాఫల్యం చేకూర్చగల శక్తిని వాళ్లే అడ్డుకుంటున్నారు. మనసును నిర్వహించుకోవడంలోనే జీవితాన్ని నిర్వహించుకోవడం దాగివుందని ఇలాంటి వారు గుర్తించడం లేదు.

ఎక్కువ మంది తమ మనసుకున్న శక్తిని ఎరగరు. ఎంతో బాగా ఆలోచించగలిగిన వారు కూడా తమ మానసిక నిధిలో ఒక్కశాతం మాత్రమే వినియోగించుకుంటున్నారు. మనందరం ఊపిరి తీసుకున్న నాటి నుంచీ దాదాపు ఒకే రకమైన ముడి సరుకుతో వచ్చాం. కానీ కొందరు ఎక్కువ ఆనందాన్ని, విజయాన్ని సాధించడం ఎందుకు జరుగుతుందంటే వాళ్ళు ఆ ముడి సరుకును ఇతరులకంటే బాగా వినియోగించుకోవడం వల్ల. నీ ఆంతర ప్రపంచాన్ని మార్చుకోడానికి అంకిత భావంతో నువ్వు కృషి చేస్తే క్రమంగా నీ జీవితం సాధారణం నుంచి అసాధారణ ఆవరణలోకి మారుతుంది.

ఓ నిస్వార్థ పరురాలైన, నిజమైన సేవకురాలైన ఒక ఉపాధ్యాయురాలు యొక్క సూత్రం : 'నేను చేయగలను అన్న మీ మాట మీ మేధ కంటే నాకు ముఖ్యం'. అని ఆ ఉపాధ్యాయురాలు నమ్మేది. ఆమె ఎన్నో తరాల విద్యార్థులను తయారు చేసిన ఒక పాఠశాల భవనం ఒకానొక రోజు ఒక దుర్మార్గుడి కుట్ర వల్ల దగ్ధమైపోయింది. అందరూ ఈ నష్టానికి చాలా బాధపడ్డారు. కాలం గడిచే కొద్దీ, అందరూ దీనికి అలవాటు పడిపోయి, తమ పిల్లలకు స్కూలు భవనం లేదని సమాధానపడిపోయారు.

ఆ ఉపాధ్యాయురాలు అందరిలాంటి మనిషి కాదు. ఆశాజీవి. ఈ సంఘటనలో కూడ ఆమె ఒక అవకాశాన్ని గుర్తించింది. ప్రతి సన్నివేశంలోను మనం వెతకాలేగాని ఏదో మంచి ఉంటుందని పిల్లల తల్లిదండ్రులకు నచ్చ జెప్పింది. ఆ

దగ్ధమైపోయిన భవనం చాలా పాతది. పైకప్పు, గోడలు కారుతుండేవి. ఒక రకంగా అది పోవడం వరమే. మరో మంచి, కొత్త భవనం కట్టుకోవడానికి అవకాశం దీనివల్ల లభించింది. అలా వివరించిన ఆ అరవైనాలుగేళ్ళ మహిళా శక్తి వెనక అందరూ కూడి, చందాలు పోగుచేసి, సరికొత్త భవనాన్ని నిర్మించారు. వైపరీత్యం నుంచి మంచిని సాధించగల ఒక పవిత్ర కార్యానికి తార్కాణంగా ఆ భవనం ఇప్పుడు నిలబడింది.

ఏ విజయమైనా నీ భుజాల మధ్య ఉండే ఆ 12 పౌండ్ల మెదడు మీద ఆధారపడి వుంటుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, ప్రతి రోజూ. ప్రతి నిమిషం నీ మనసులోకి నువ్వు చొప్పించే ఆలోచనలమీద ఆధారపడివుంటుంది. నీ బాహ్య ప్రపంచం నీ అంతర ప్రపంచం స్థితిని సూచిస్తుంది. నీ ఆలోచనలను నియంత్రించడంలోనూ, నీ జీవితంలోని ఘటనలకు స్పందిచే విధానంలోనూ, నీ భవిష్యత్తును నువ్వే శాసించడం ప్రారంభమవుతుంది'.

జీవితంలో పొరపాట్లు ఉండవు; గుణపాఠాలే గానీ, వ్యతిరేక అనుభవాలంటూ ఏవీ లేవు; మనం ఎదగడానికీ, నేర్చుకోడానికీ, సాధికారం సాధించే మార్గంలో ముందుకు నడవడానికీ లభించే అవకాశాలే అవి. పోరాటం నుంచే బలం లభిస్తుంది. బాధకూడా గొప్ప పాఠాలు నేర్పుతుంది.

నీలో ఒక మహోన్నత ఆదర్శం ఏర్పడితే, ఒక అసాధారణ పథకాన్ని నువ్వు రూపొందిస్తే, నీ ఆలోచనలన్నీ తమ బంధనాలు తెంచుకుంటాయి; నీ మనసు అన్ని పరిమితులనూ అధిగమిస్తుంది; నీ చైతన్యం అన్ని దిశల్లోనూ వ్యాపిస్తుంది; నీలో నిద్రాణమై ఉన్న శక్తులు, ప్రతిభలు, జ్ఞానం ఒక్కసారిగా మేల్కొంటాయి. నువ్వు కల్లో కూడా ఊహించనంత ఉన్నతుడిగా నీకు నువ్వు దర్శనమిస్తావు.

మన బుద్ధి చాలా మంచి సేవకురాలే గానీ, చాలా ఘోరమైన యజమాని. నువ్వు చెడే ఎక్కువ ఆలోచిస్తున్నావంటే, నీ బుద్ధిపై తగినంత శ్రద్ధ పెట్టి దానికి మంచిని ఆలోచించే శిక్షణ ఇవ్వలేదని అర్థం. విన్‌స్టన్ చర్చిల్ అన్నట్టు, 'నీ ప్రతి ఆలోచనపై నీకు బాధ్యత ఉండడమే గొప్పదనానికి నువ్వు చెల్లించే మూల్యం'. అప్పుడే నువ్వు కోరుకున్న ప్రకాశవంతమైన బుద్ధి నీలో ఉద్భవిస్తుంది. ఒకటి గుర్తు పెట్టుకో; నీ శరీరంలోని ఇతర కండరాలలాగే నీ బుద్ధి కూడా. దాన్ని వాడుతావో వాడకుండా కోల్పోతావో నీయిష్టం.

అవును. ఒకటి ఆలోచించు. నీ చేతి కండరాల్ని మరింత ఉపయోగకరంగా వాడాలనుకుంటే దానికి శిక్షణ ఇస్తావు. అలాగే, కాళ్ల నరాలు కూడా. అలాగే, నీ బుద్ధి కూడా నువ్వు అలవాటు చేస్తే, ఎన్నో అద్భుతాలు చేయగలదు. దాన్ని కనక సరిగ్గా వాడ్డం నేర్చుకున్నావంటే, అది నీ కోరికలన్నిటినీ తీర్చగలదు. దాన్ని సరిగ్గా చూసుకుంటే, నీకు చక్కని ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. అంతే కాదు. నీకు అడగాలని తోచాలే గానీ దాని సహజ స్థితి అయిన ప్రశాంతత, నిర్మలత్వం మళ్ళీ సంపాదిస్తుంది.

తమ ఆలోచనలు తమ ప్రపంచం నుంచే వస్తాయనీ, ఈ ఆలోచనలపైనే జీవిత సౌందర్యం ఆధారపడివుంటుందనీ జ్ఞానులకు తెలుసు. నీకు ప్రశాంతమైన, అర్థవంతమైన జీవితాన్ని గడపాలని వుంటే, ప్రశాంతమైన అర్థవంతమైన ఆలోచనలు తెచ్చుకో.

నీకు ఓ కోరిక లేదా స్వప్నం ఉంది అంటే, దానికి అవసరమైన సామర్థ్యం కూడా ఉందని అర్థం. విశ్వజనీన సత్యాల్లో ఇది ఒకటి. అయితే, నీ మానసిక శక్తికి స్వేచ్ఛ ఇవ్వాలంటే, నువ్వు దాన్ని, తక్షణం జరగవలసిన పనిపై కేంద్రీకరించడం

అవసరం. ఎప్పుడైతే, యావశ్శక్తి, నీ ఎదుట ఉన్న ఒక్క లక్ష్యంపైన నిలిపావో, అసాధారణమైన ఫలితాలు నీకు ఎదురవుతాయి.

ఆనంద రహస్యం చాలా చిన్నది. నీకేం చేయడం అత్యంత ప్రీతికరమో తెలుసుకుని, నీ యావశ్శక్తి దాని వైపుకు మళ్ళించు ప్రపంచంలో అత్యంత ఆనందంగానూ, ఆరోగ్యంగానూ, తృప్తి గానూ జీవించే వారిని చూసావంటే నీకే అర్థమవుతుంది; వాళ్ళు తమ జీవితాశయం ఏమిటో గుర్తించి, దాని అన్వేషణకు, సాధనకు, జీవితాన్ని వెచ్చించారని. సాధారణంగా ఆ వ్యక్తులకు ఒకే ఆశయం ఉంటుంది; అందులో సేవా దృక్పథమూ ఉంటుంది. ఒక్కసారి నీ మనశ్శక్తిని నువ్వు ప్రేమించే విషయం వైపుకు మళ్ళించావంటే, నీకు అన్నీ సమృద్ధిగా అభిస్తాయి; నీ కాంక్షలన్నీ సులువుగా, హుందాగా తీరుతాయి.

ఊరికే నిద్రపోతూ, విశ్రాంతి తీసుకుంటూ, లేదా పనీ పాటా లేకుండ పొద్దు పుచ్చుతుంటే నీకు నిజమైన ఆనందం ఎప్పటికీ కలగదు. 'విజయ రహస్యం అంటే నిరంతర లక్ష్యం ఉండడమే'. నీకు నువ్వు గొప్ప లక్ష్యం పెట్టుకుని, దాని సాధనకు నిరంతరం ప్రయత్నిస్తూ ఉండడంలోనే ఆనందం దాగి వుంది. తక్కువ ప్రాముఖ్యం కలిగిన వాటికోసం అత్యధిక ప్రాముఖ్యం కలిగిన విషయాలను ఎప్పటికీ త్యాగం చేయకూడదు అన్న విశ్వజనీన సూత్రం అమలు జరపడమే మన లక్ష్యం. పూర్ణపురుషులని చెప్పగలిగిన వారంతా తమ లక్ష్యాలను, తమ ప్రతిభను గుర్తించి ఆ దిశగా నిరంతర కృషి చేసినవారే.

సగటున రోజుకు మనకు 60,000 ఆలోచనలు వస్తాయి. ఒక్క ఆకాంక్షను కాయితం మీద రాయడం ద్వారా నువ్వు నీ ఉపచేతనకు ఓ సంకేతం పంపిస్తున్నావన్న మాట; ఈ ఆకాంక్ష తక్కిన 59,999 ఆలోచనలకంటే ఇది నీకు ముఖ్యమని. అప్పుడు నీ మనసు ఈ లక్ష్యాన్ని సాధించడానికి గల అవకాశాలన్నిటినీ అన్వేషిస్తుంది. నిజం చెప్పాలంటే ఇది చాలా శాస్త్రీయమైన విధానం. మనలో చాలా మందికి ఈ అవగాహన లేదంతే. నీ చుట్టూ ఉన్న అవకాశాల పట్ల నీ మనసును జాగృతం చేయి. మరింత ఉత్సాహంతో జీవించడం మొదలు పెట్టు. మనిషి మనసు సృష్టిలో కెల్ల మంచి ఫిల్టర్ లాంటిది. దాన్ని సరిగ్గా ఉపయోగిస్తే, అది నీకు అతిముఖ్యమైన వాటిని వడపోసి, నీకు కావలసింది మాత్రమే అందిస్తుంది. ఒత్తిడి ఎప్పుడూ చెడ్డ పదార్థం కాదు. ఒత్తిడి తోనే మనం ఉన్నత విజయాలు సాధించగలం. చాలా సార్లు ఆపత్కర పరిస్థితుల్లో ఉండి, తీవ్రమైన ఒత్తిడికి గురైనపుడే మనం మనలోని సామర్థ్యాన్నంతా వెలికి తీయడానికి పూనుకుంటాం. నీ లక్ష్యాన్ని ఆచరణలో పెట్టడానికి అనేక మార్గాలున్నాయి. వాటిల్లో ఒకటి బహిరంగ ప్రమాణం. నీకు తెలిసినవారందరితోనూ, నువ్వు బరువు తగ్గబోతున్నావనీ, లేదా ఆ నవల రాయబోతున్నావనీ.. నీ లక్ష్యం ఏదైతే అది.. చెప్పడం ప్రారంభించు. నీ లక్ష్యాన్ని ఒకసారి ప్రపంచమంతటికీ చెప్పేసావనుకో…విఫలమైనట్టు కనిపించకూడదు కనక చచ్చినట్టు నీ మీద ఒత్తిడి పెరుగుతుంది.

మొదటి మెట్టు ఫలితాన్ని గురించి స్పష్టమైన ఊహ ఉండడం. రెండో మెట్టు నీకు నిరంతర ప్రేరణ కలిగించేందుకు ప్రయోజనకరమైన వత్తిడి సృష్టించుకోవడం. మూడో మెట్టు చాల సులభమైనది; ఒక కాలపరిమితి విధించకుండా ఏ లక్ష్యమూ పెట్టుకోకు. ఏ లక్ష్యానికైనా ఊపిరి పోసేది స్పష్టమైన కాల నియతే. ఒక మనిషి ప్రతిబింబం మూడు అద్దాల్లో కనిపిస్తుందట. మొదటి అద్దం–నువ్వు నిన్ను ఎలా చూసుకుంటావో చూపిస్తుంది; రెండోది ఇతరులు నిన్నెలా చూస్తారో దాన్ని చూపిస్తుంది; మూడో అద్దం నిజాన్ని చూపిస్తుంది.

నీ కలల పుస్తకాన్ని నీ జీవితంలోని భిన్న రంగాలకు సంబంధించి వేర్వేరు విభాగాలుగా వర్గీకరించు. ఉదాహరణకు, నీ శారీరక దారుఢ్యానికి సంబంధించిన లక్ష్యాలు, నీ ఆర్థిక లక్ష్యాలు, నీ వ్యక్తిత్వ వికాస లక్ష్యాలు, నీ అనుబంధాలకు సంబంధించిన లక్ష్యాలు, నీ సామాజిక లక్ష్యాలు, నీ కలల పుస్తకాన్ని నువ్వు కోరుకుంటున్న వస్తువులతో, నువ్వు కోరుకునే లక్షణాలుండి నువ్వు అనుకరించాలని ప్రయత్నించే వ్యక్తుల బొమ్మలతో నింపు. ఇక నీ నడుము చుట్టు కొలత సంగతి. నీకు

బరువు తగ్గాలనీ, అందమైన, దృఢమైన శరీరాకృతి కావాలనీ ఉందనుకో. నీ కలల పుస్తకంలో ఒక మారథాన్ రన్నర్ బొమ్మ అతికించుకో. సముద్ర తీరాన దివ్య భవనం కావాలనో. స్పోర్ట్స్ కార్ కావాలనో ఉందనుకో. వాటి బొమ్మలు నీ కలల పుస్తకంలో అతికించుకో. ప్రతిరోజూ ఈ పుస్తకాన్ని కొంతసేపైనా సమీక్షించుకో. దాన్ని నీ స్నేహితుణ్ణి చేసుకో. ఫలితాలు నిన్ను విస్మయంలో ముంచెత్తుతాయి.

నువ్వు నీ ఆశయ సాధన కోసం ప్రయత్నించే క్రమంలో జీవితాన్ని ఉల్లాసంగా గడుపు . ఎలాంటి శంకలూ లేని ఆనందాన్ని అనుభవించడం జీవితంలో చాలా ముఖ్యమని గ్రహించు. ప్రతి ప్రాణిలోనూ సౌందర్యాన్ని చూడవచ్చున్న విషయం మరిచిపోకు. ఈ క్షణంలో నువ్వూ, నేను భావాలు పంచుకోవడం కూడ మనకు లభించిన ఓ కానుకే. ఎప్పుడూ ఉత్సాహంగా, ఆనందంగా, ఉత్సుకతతో ఉండు. నీ జీవితాశయంపైన, ఇతరులకు నిస్వార్థసేవ చేయడంపైనా దృష్టిని కేంద్రీకరించు. ఇతర విషయాలను విశ్వమే చూసుకుంటుంది. నేను మాట్లాడుతున్నది ప్రణయ సంబంధమైన ఉద్దీపనం గురించి కాదు. అది కూడా సాఫల్యం కలిగించే, ఉత్సాహభరిత జీవనానికి మంచి సాధనమే అనుకో. కానీ నేను చెప్పేది జీవితం పట్ల గాఢమైన అనురాగం. రోజూ అత్యుత్సాహంతో, శక్తితో నిద్ర లేవడంలో ఎంత ఆనందం ఉందో అనుభవించు. నువ్వు చేసే ప్రతి పనినీ ఈ గాఢతతో నింపు. నీకు అతి త్వరలోనే గొప్ప భౌతిక, ఆధ్యాత్మిక ఫలాలు లభిస్తాయి.

ఈ రాత్రి నుంచి నీ జీవితాన్ని నీ అదుపులో ఉంచుకో. నీ కర్మకు నీవే బాధ్యుడివని నిర్ణయించుకో. నీ గమనాన్ని నిశ్చయించుకో. నీ జీవితంలో ఏం చేయదలుచుకున్నావో నిర్ణయించుకుంటే, నీ జీవితం ప్రేరణతో, ఉత్సాహంతో నిండిపోతుంది. చివరగా, ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో. నీ వెనక ఉన్నదాని కంటే, నీ ముందున్నదాని కంటే, నీ లోలోపల ఉన్నది చాలా విలువైనది. నువ్వు తగినంత సమయం తీసుకుని క్రమశిక్షణ, శక్తి, బలం, ఆశావహకదృక్పథం వంటి గుణాలు కల్పించుకున్నాక,

నీ సామర్థ్యం పైనా, నీ మొక్కవోని ప్రజ్ఞపైనా అపారమైన విశ్వాసం పెరిగాక, నీ ప్రయత్నాలన్ని టిలోనూ విజయం సాధించి, ఉన్నత ఫలితాలు పొందడంలో నీకు అడ్డేమీ ఉండదు. నీ మనసుపై అధికారం సంపాదించి, శరీరాన్ని పోషించి, ఆత్మను సంతృప్తి పరిచేస్థితి చేరుకోడానికి నువ్వు సమయం వెచ్చిస్తే, నీ జీవిత ప్రమాణాలు పెరుగుతాయి. తననే నడిపించలేని మనిషి ఒక సంస్థనేం నడిపిస్తాడు? నిన్ను నువ్వే పోషించుకోలేనపుడు నీ కుటుంబాన్ని ఏం పోషిస్తావు? నువ్వు ఆనందంగా లేనపుడు ఇంకోరికి ఆనందాన్ని ఎలా ఇస్తావు?

ధైర్యం వల్ల నీ మార్గాన్ని నువ్వే నిర్ణయించుకుంటావు. నువ్వు చేయదలుచుకుంది సరైనదేనని నమ్ముతావు కనక చేయగలుగుతావు కూడా. ఇతరులు వైఫల్యం చెందిన రంగాల్లో కూడా పనిచేయడానికి కావలసిన ఆత్మ నియంత్రణను ధైర్యమే అందిస్తుంది. నీ ధైర్యం ఏ స్థాయిలో ఉంటుందో నువ్వు సాధించే విజయం కూడ అదే స్థాయిలో ఉంటుంది. నీ జీవితమనే మహాకావ్యంలోని అద్భుత ఘట్టాలను దర్శించడం దానివల్లే సాధ్యమవుతుంది. ఆత్మ నియంత్రణ సాధించిన వారిలో ధైర్యం ఉండి తీరుతుంది.

నీ భౌతిక ఆకృతిని బాగు చేసుకోకుండా మనసును మాత్రమే మెరుగు పరుచుకోవడం అసంపూర్ణ విజయం అవుతుంది. నీ మనసును, శరీరాన్ని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్ళి, ఆత్మను విస్మరిస్తే, నీలో ఒక ఖాళీ ఏర్పడి, అసంతృప్తి మిగులుతుంది. అందువల్ల, ఈ మూడింటి పరంగా సర్వ శక్తులూ వినియోగిస్తేనే ఒక జ్ఞానవంతమైన జీవితం నుంచి లభించే దివ్యానందం నీకు లభిస్తుంది.

నీ మనసును, శరీరాన్ని మెరుగుపరుచుకోడానికి కష్టపడి పనిచేయి. నీలో ఉత్సాహాన్ని పోషిస్తుందు. నువ్వు మామూలుగా భయపడే పనులు చెయ్యి. అపరిమిత శక్తితో, హద్దుల్లేని ఉత్సాహంతో జీవించడం ప్రారంభించు. సూర్యోదయాన్ని గమనించు. వర్షపు నీటిలో స్నానం చేయి. నువ్వు కలలుకనే మనిషిగా అయిపోయావనుకో. నువ్వు ఎప్పుడూ చేయాలనుకుని కూడా, మరీ చిన్నవాడివనో, మరీ పెద్దవాడివనో, మరీ సంపన్నుడివనో, పేదవాడివనో అనుకుని మానేసిన పనులన్నీ చేయి. పూర్తి జీవనోత్సాహంతో జీవించు. సంసిద్ధంగా ఉన్నవాడినే అదృష్టం వరిస్తుంది మరియు సంసిద్ధుడిగా ఉన్న వాడినే జీవితం వరిస్తుంది.

భయాలన్ని మనం ఇన్నాళ్ళు సృష్టించుకున్న గందరగోలాలే. వెనక్కి లాగుతున్న విషయాలను గుర్తించు. నీకు మాట్లాడ్డమంటే భయమా లేక నీ అనుబంధాల్లో ఏవైనా సమస్యలున్నాయా? నీలో సానుకూల దృక్పథం కొరవడిందా? లేక నీకు ఇంకా శక్తి కావాలా? నీ బలహీనతల జాబితా తయారు చెయ్యి. జీవితంతో తృప్తి చెందిన వారే ఇతరుల కోసం ఆలోచించగలరు. నీకు జీవితం నుంచి నిజంగా కావల్సింది దక్కగలదని నీ లోపల్లోపల తెలిసినా, దాన్ని సాధించడానికి వస్తున్నఅవరోధాలేమిటో ఆలోచించు. ఒక సారి నీ బలహీనతలేమిటో తెలిస్తే, తర్వాతి మెట్టు వాటిని ఎదుర్కొని, నీలోని భయాలపై నువ్వు ఎదురు దాడి చేయడం. నీకు బహిరంగ సభల్లో మాట్లాడ్డం భయమైతే, ఇరవై ప్రసంగాలు చేయడానికి ఒప్పుకో. కొత్త వ్యాపారం మొదలు పెట్టడం లేదా అసంతృప్తికరమైన బంధం నుంచి బయట పడాలన్నా భయముంటే, నీ శక్తినంతటినీ పుంజుకుని ఆ పనిచెయ్యి. బహుశా కొన్నేళ్ళలో నువ్వు పొందే మొదటి స్వేచ్ఛా భావన ఇదే అవుతుంది. భయమంటే నువ్వు సృష్టించుకున్న మానసిక దయ్యమే. ఒక ప్రతికూల చైతన్య స్రవంతి’.

ఒక శిశువును పరిశీలించు. తనకు ఏ హద్దులూ లేవు. తన మనసు సామర్థ్యం, అవకాశాల వర్ణచిత్రం. సరిగ్గా పోషిస్తే, ఆమె గొప్పదవుతుంది. అదే ప్రతికూల ధోరణి అలవాటు చేస్తే, ఎందుకూ పనికి రాకుండ తయారవుతుంది. ఏ అనుభవమైనా, అది బహిరంగ ప్రసంగం కావచ్చు; నీ యజమానిని జీతం పెంచమని అడగడం కావచ్చు; సరస్సులో ఈత కొట్టడం కావచ్చు; వెన్నెల రాత్రి సముద్రం ఒడ్డున నడవడం కావచ్చు, ఏదీ దానంతట అదే బాధాకరం గానీ, ఆనందకరంగానీ కాదు. నీకు దాని పట్ల ఉన్న దృష్టే ఆ అనుభవాన్ని నిర్ధారిస్తుంది.

భయమనేది మానసిక నియంత్రణకు సంబంధించిన స్పందన. నువ్వు జాగ్రత్తగా ఉండకపోతే, అది నీ శక్తినీ, సృజనాత్మకతనూ, ప్రేరక శక్తిని కూడా పీల్చేస్తుంది. భయం తన వికారమైన ముఖాన్ని చూపించగానే, దాన్ని వెంటనే కొట్టి తరిమేయ్. దానికొకటే ఉత్తమ మార్గం. నీకు ఏదంటే భయమో దాన్ని చేసేయడం. భయం స్వభావాన్ని అర్థం చేసుకో. అది నువ్వు కల్పించిందే. ఏ సృష్టినైనా నిలబెట్టడం ఎంత సులభమో, పడదోయడం కూడా అంతే సులభం కదా. జాగ్రత్తగా, క్రమబద్ధంగా నీ మనసనే కోటను వెదికి, అందులో దాక్కున్న భయాల్ని నాశనం చెయ్యి. అదే చాలు నీలో ఆత్మ విశ్వాసం, ఆనందం, మనశ్శాంతి కలిగించడానికి’. ‘నీ మనసులోంచి భయాన్ని తొలగిస్తే, నీ వయసు తగ్గినట్టు కనిపిస్తావు; నీ ఆరోగ్యం కూడ మంరింత కాంతివంతమవుతుంది.

ఏకాంతం, నిశ్శబ్దం అన్నవి నీ సృజనాత్మక శక్తితో, విశ్వంలోని అపరిమిత మేధతో నీ సంబంధాన్ని  పునరుద్ధరింపజేస్తాయి. మనస్సు ఒక సరస్సులాంటిది. మన సంక్షుభితప్రపంచంలో చాలా మంది మనస్సులు నిశ్చలంగా ఉండలేవు. మన మనస్సులు అలజడి మాయలు. కానీ, మనము రోజూ కొంత సమయాన్ని నిశ్శబ్దంగా ఉండడానికి కేటాయిస్తే, మనసనే ఈ సరస్సు సుతిమెత్తగా ఒక గ్లాసు పళ్లెంలా తయారవుతుంది. ఈ అంతర నిశ్చలత్వం వల్ల, మనలో ఆరోగ్య భావన, అంతశ్శాంతి, హద్దులేని శక్తి ఉద్భవిస్తుంది. ఇకపై నిద్ర కూడా హాయిగా పడుతుంది; నీ దినచర్యలోనూ మెరుగుదల కనిపిస్తుంది.

ఏ మాత్రం వీలున్నా, రోజూ ప్రకృతితో కొంత సేపు గడుపు. అడవుల్లో కాసేపు నడవడం; లేదా తోట పని చేయడం నీలోని నిశ్చలతను ఉద్దీపింపజేస్తాయి. అలాగే నీలో ఉన్న అతీత జ్ఞానాన్ని నువ్వు గుర్తించేలా చేసే శక్తి కూడా ప్రకృతికి ఉంది శరీరాన్ని సిద్ధం చేసినట్టే. నీ శరీరానికి శిక్షణనిస్తే, మనసుకూ ఇచ్చినట్టే. ప్రతి రోజూ నీ శరీరమనే ఆలయాన్ని కఠినమైన వ్యాయామంతో కాపాడుకో. నీ రక్త ప్రసరణ పెరిగి, శరీరం బాగుపడుతుంది. వారంలో 168 గంటలున్నట్టు నీకు తెలుసా?

మనలోని శక్తిని ద్విగుణీకృతం చేసుకోడానికి అతి వేగవంతమైన, విజయవంతమైన విధానం సక్రమంగా ఊపిరి పీల్చుకోవడమే. మనందరికీ బతకడానికి ఊపిరి ఎలా పీల్చుకోవాలో తెలుసుగానీ, జీవించడానికి ఊపిరి ఎలా పీల్చుకోవాలో తెలీదు. అది మనం నేర్చుకోలేదు. మనందరం ఏదో పైపైన పీల్చుకోవడం చేస్తాం. కానీ మన శరీరాన్ని అత్యధిక వినియోగంలోకి తీసుకురాగల స్థాయిలో ఆక్సిజన్‌ను పీల్చుకోం. సరైన పద్ధతిలో ఊపిరి పీల్చడం ద్వారా ఎక్కువ ఆక్సిజన్ లోపలికి తీసుకుని నీ సహజ శక్తి నిల్వలను పెంచుకోవచ్చు.

నీ శరీరాన్ని నువ్వు ఎంత బాగా పోషిస్తే, నీ మనసును అంతగా పోషించినట్లు. నీరసంగా, బద్ధకంగా, నిస్పృహగా ఉండడానికి అతిగా పనిచేయడం, మానసిక వత్తిడి కారణమనుకుంటారు కాని, బద్ధకం వెనక ఉన్నది నేను తిన్న అనారోగ్యపు తిండి. యౌవనంతో, అందంగా ఉండడానికి ప్రకృతిలో లభించే సహజ పదార్థాలు తినాలి. సహజమైన తిండి. అంటే జీవించివున్నవి; చచ్చి పోయినవి కాదు' సహజమైనవంటే ? సూర్యుడు, గాలి,మట్టి, నీరుల కలయిక నుంచి సహజంగా జనించినవని అర్థం. అంటే శాకాహారం. నీ పళ్లెం నిండా తాజా కూర గాయలు, పళ్ళు, ధాన్యం గింజలు వడ్డించుకో. ప్రకృతి మనకు ఉద్దేశించిన ఆహారం ఇదే. ఇది సజీవమైందీ, శక్తివంతమైందీ, అత్యధిక ఆరోగ్యాన్ని ఇచ్చేది. దాన్ని సాత్వికాహారం అని పిలుస్తారు. ఇక బలం సంగతంటావా. ఈ గ్రహం మీద ఉన్న అతి బలవంతమైన జంతువులు, గొరిల్లా, ఏనుగు వంటివి శాకాహారులే. గొరిల్లాకు సగటు మనిషి కంటే ముప్ఫై రేట్ల బలం ఉంటుందని నీకు తెలుసా? నువ్వు పూర్తిగా శాకాహారివి కాకున్న, ప్రతి భోజనాన్నీ సలాడ్‌తో ప్రారంభించు ; భోజనానంతరం ఒక పండుతో ముగించు. ఇదే నీ భౌతిక జీవితంలో చెప్పలేనంత మార్పు తీసుకువస్తుంది.

జ్ఞానం అన్నది చాలామందికి ఫలానా పరిస్థితిలో ఏం చెయ్యాలో, తమ జీవితంలో ఏం చేయ్యాలో కూడ తెలుపుతుంటుంది. అయితే, ఈ జ్ఞానాన్ని నిత్య జీవితంలోనూ, తమ కలల సాఫల్యానికీ అనుక్షణం ఎలా వర్తింపజేయాలో వాళ్ళకు తెలీదు. ఈ సమృద్ధ జ్ఞాననిధి ద్వారా మనం జీవితాంతం జీవితాన్ని అధ్యయనం చేసే విద్యార్థులమవుతాం. అంతకంటే ముఖ్యంగా జీవితం అనే తరగతి గదిలో నువ్వు నేర్చుకునే పాఠాలు అమలు చేయాలని కూడా నీకు చెబుతుంది.

నీ మనసు నీకిచ్చే సందేశాలపై దృష్టిపెట్టు. నువ్వు నీకోసం కొంత సమయం కేటాయించుకుని, నీ మనస్సును, శరీరాన్ని, స్వభావాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే కొద్దీ, నీలోనే ఒక దిశా నిర్దేశకుడు ఉన్నట్లు, అతను నీకు ఏంచేస్తే జీవన సాఫల్యం లభిస్తుందో చెబుతున్నట్లు అనిపిస్తుంది. అప్పుడు నువ్వు గడియారం చూడ్డం మానేసి, జీవితాన్ని జీవించడం ప్రారంభిస్తావు'

ఒక పుస్తకం నుంచి మంచిని పొందాలంటే, నువ్వు దాన్ని ఊరికే చదవడం కాదు; అధ్యయనం చేయాలి. ముప్ఫై నిమిషాలు రోజూ చదవడం వల్ల నీ ఉపయోగం కోసం ప్రపంచంలో ఎంత జ్ఞానం ఉందో నీకు తెలుస్తుంది. నీ సమస్యలన్నిటికి సమాధానాలు నీకు పుస్తకాల్లో దొరుకుతాయి. నీకు ఇంకా మంచి న్యాయవాదివో, భర్తవో, మిత్రుడివో, ప్రేమికుడివో కావాలని ఉన్నా, ఆ లక్ష్యం వైపుకు నిన్ను తీసుకువెళ్లే సూత్రాలు పుస్తకాల్లో ఉంటాయి. నువ్వు ఇంకా చేయబోయే పొరపాట్లన్ని, నీకంటే ముందే ఈ మార్గంలో నడిచిన వాళ్ళు చేసేసారు. నిజంగా నువ్వు ఎదుర్కొబోయే సవాళ్లన్నీ నీకే మొదటి సారి వస్తాయనుకున్నావా?

ప్రపంచంలో ఎవరైనా, చేయబోయేవీ, చేస్తున్నవీ, తప్పిదాలన్నీ ఇదివరకే ఎవరో చేసేసే ఉన్నారు. మరీ ముఖ్యంగా, ఈ సమస్యలు, వాటికి పరిష్కారాలు పుస్తకాల్లో లభిస్తాయి. అందుకే సరైన పుస్తకాలు చదవడం. నువ్వు ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాళ్లను ఇతరులు ఎలా ఎదుర్కొన్నారో వాటి వల్ల తెలుస్తుంది. వాళ్ల వ్యూహాలు ఇపుడు నువ్వు ఆచరణలో పెట్టి చూడు, నీ జీవితంలో వచ్చే మార్పుకు నువ్వే నిశ్చేష్టుడివవుతావు

పుస్తకాల నుంచి నువ్వేం నేర్చుకుంటావన్నది విషయం కాదు. పుస్తకాలు నీ నుంచి దేన్ని బయటకు వెలికితీస్తాయన్నది ముఖ్యం. అదే నిన్ను మార్చగలిగింది. నిజం చెప్పాలంటే, పుస్తకాలు నీకు కొత్తవేమీ నేర్పించవు

ఒక నాలుగేళ్ల పిల్లాడు సగటున రోజుకు ఎన్నిసార్లు నవ్వుతాడో చెప్పు. మూడు వందల సార్లు. అదే మన సమాజంలో ఒక వయసొచ్చిన వ్యక్తి సగటున ఎన్ని సార్లు నవ్వుతాడో చెప్పు. 'పది హేను సార్లు' మన ఆరోగ్యానికి అత్యుత్తమ ఔషధం నవ్వే. నీకు ఇష్టం లేకున్నా రోజూ రెండు నిమిషాలు అద్దంలో చూసుకుని నవ్వు. ఆ తర్వాత నువ్వు గొప్పగా ఫీలవ్వకపోతే చెప్పు. 'మనం ఆనందంగా ఉంటాం కాబట్టి నవ్వం. మనం నవ్వుతాం కాబట్టి ఆనందంగా ఉంటాం' కనుక, నీ దినచర్యను నవ్వుతో ప్రారంభించు.

నువ్వు రోజల్లా నీతో ఏం మాట్లాడుకుంటావో అలాగే ప్రవర్తిస్తావు. నువ్వు గనక, నేను ముసలివాణ్ణి; అలసిపోయాను అని అనుకుంటూ ఉంటే, నీ బాహ్య వాస్తవంలో కూడా అదే నిజమై కూర్చుంటుంది. అలాగే నువ్వు బలహీనంగా ఉన్నావని, ఉత్సాహంగా లేవనీ నువ్వే అనుకుంటే, అదే నిజమవుతుంది కూడా. అదే నువ్వు నేను ఉత్సాహంగా, ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నాననుకుంటే నీ జీవితమే మారిపోతుంది. అసలు విషయమేమిటంటే, నీతో నువ్వు చెప్పుకునే మాటలు నీ పట్ల నీకున్న అభిప్రాయాన్ని నిర్ణయిస్తాయి. అవే నీ చర్యలను నిర్ధారిస్తాయి. ఉదాహరణకు, నీ ఉద్దేశంలో నువ్వు ఆత్మ విశ్వాసం లేనివాడివి, ఏ విలువైన పనీ చేయలేనివాడివీ అనుకో. చివరికి నువ్వు చేసే పనులన్నీ అలాగే ఉంటాయి. అలా కాక, నువ్వు జీవనోత్సాహంతో తొణికిసలాడే నిర్భయుడివీ అని అనుకున్నావనుకో, నీ చర్యలు కూడ దానికి తగ్గట్టే ఉంటాయి. అంటే నువ్వు నీ గురించి ఏమనుకుంటావన్నది ఒక రకంగా నీకు జోస్యం చెబుతుందన్నమాట.

నువ్వు ఏదైనా చెయ్యలేవు అని అనుకున్నావనుకుందాం. ఉదాహరణకు, నీకు అత్యుత్తమమైన సహచరిని పొందలేవనో, వత్తిడి లేని జీవితాన్ని జీవించలేవనో అనుకున్నావనుకో. దానివల్ల నీలో ఆత్మ విశ్వాసంలోపిస్తుంది. కనుక, అత్యుత్తమ సహచరిని పొందడానికి నువ్వు చేయవలసింది కూడా చెయ్యవు. నువ్వు ఈ దిశగా చేసే ప్రయత్నాలన్నీ విఫలమవుతాయి. అసలు సమస్య ఏమిటంటే మనందరిలోనూ ఒక తీవ్రమైన జబ్బుఉంది దాన్ని సాకులు వెతికే రోగం అంటారు.

వ్యక్తిత్వ నిర్మాణాలన్నీ ఈ సూత్రాలైన శ్రమ, దయ, వినయం, సాహసం, నిజాయితీ, ధైర్యం. నీ చర్యలన్నీ ఈ సూత్రాలతో అనుసంధించి ఉంటే, నీలో అంతర్గతమైన శాంతి, సామరస్యం నెలకొంటాయి. ఇలా జీవించడం వల్ల నీకు ఆధ్యాత్మిక విజయం తథ్యం. ఎందుకంటే అదే సరైన జీవన విధానం కనుక. ఇలా ప్రవర్తించడం ద్వారా నువ్వు ప్రకృతి నియమాలకు, విధానాలకు లోబడి ఉంటావు కనుక. ఇలా చేయడం వల్లే నువ్వు నీ దైనందిన జీవితంలో ఉపయోగించే శక్తి కంటే ఉన్నతమైన శక్తిని పొందగలుగుతావు. అప్పుడే నీ జీవితం సాధారణం నుంచి అసాధారణం లోకి పయనిస్తుంది; నువ్వు నీ జీవిత పవిత్రతను అనుభూతి చెందగలుగుతావు. జీవితాంతం నిలిచే జ్ఞానానికి మొదటి మెట్టును ఎక్కగలుగుతావు.

వైఫల్యమంటే, ప్రయత్నించేందుకు ధైర్యం లేకపోవడం; అంతకంటే ఎక్కువా కాదు; తక్కువా కాదు. ఎక్కువమందికీ, వారి కలల సాఫల్యానికీ మధ్యఅడ్డు గోడగా నిలుచున్నది వైఫల్యభీతే. అయితే, ఏ విజయానికైనా వైఫల్యాలు తప్పనిసరి. వైఫల్యం

మనల్ని పరీక్షిస్తుంది; వైఫల్యం వల్లే మనం ఎదుగుతాం. అది మనకు గుణపాఠాలు నేర్పి, జ్ఞానమార్గంలో మనకు అండగా నిలుస్తుంది. మనం వేసే బాణం లక్ష్యాన్ని ఒక్కసారి తాకిందంటే, అంతకుముందు వందసార్లు గురి తప్పిందన్నమాట. నష్టం ద్వారా లాభం పొందడం అన్నది ప్రకృతి న్యాయం. వైఫల్యానికి ఎప్పుడూ భయపడవద్దు. వైఫల్యం నీ మిత్రుడు.

మన విధినిర్మాతలం మనమే అనే విషయంలో మనకేం సందేహం వద్దు. మన ముందున్న కార్య ం మన శక్తికి మించిందేమీ కాదు; దానిలోని కష్టనిష్టూరాలు మనం భరించలేనివి కావు. మన లక్ష్యం పై మనకు విశ్వాసం ఉండి, గెలిచి తీరాలన్న దృఢ సంకల్పం ఉన్నంత కాలం, విజయం మనకు లభించి తీరుతుంది.

సంకల్ప శుద్ధి లేకపోవడం ఒక మానసిక వ్యాధి వంటిది. నీకు గనక ఈ బలహీనత ఉంటే, వెంటనే దాన్ని పీకి పారెయ్. సంకల్పం, క్రమశిక్షణ అన్నవి మన వ్యక్తిత్వపటిష్టతకు, ఆనందమయ జీవితాలకు అతిముఖ్యమైన లక్షణాలు. సంకల్ప శుద్ధి అన్నది నువ్వు చేయాలనుకున్నది, నువ్వు చేయాలనుకున్న సమయానికి చేయడానికి అవసరమైన శక్తినిస్తుంది. వణికించే చలికాలం ఉదయం, వెచ్చగా పడుకోకుండా, అయిదు గంటలకే నిద్ర లేచి వాకింగ్ వెళ్ళడానికీ, ధ్యానం చేయడానికీ నిన్ను పురికొల్పేది నీ సంకల్పబలమే. నీకంటే అల్పుడైన వ్యక్తి నిన్ను అవమానం చేసినా, నీతో విభేదించినా, మాట తూలకుండ నిన్ను ఆపేది సంకల్ప బలమే. అవరోధాలు అవధులు దాటినపుడు సైతం నీ కలల మార్గంలోకి వెళ్ళడానికి ప్రోత్సహించేది సంకల్పబలమే. ఇతరుల పట్ల, ముఖ్యంగా నీ పట్ల నీకున్న నిబద్ధతను నిలుపుకోడానికి తోడ్పడేది సంకల్ప బలమే.

క్రమశిక్షణ అనే ఉక్కుతో నువ్వు ధైర్యశాంతులతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటావు. సంకల్పమనే గుణంతో, జీవితంలో అత్యున్నతమైన ఆదర్శాన్ని అందుకుని, మంచి, ఆనందం,శక్తి నిండిన స్వర్గతుల్యమైన భవనంలో నివసిస్తావు. ఇవి లేకపోతే, దిక్సూచి లేని నావికుడులా, నౌకతో పాటు ఏనాటికైనా సముద్రంలో మునిగిపోయే వాడిగా అయిపోతావు.

వాళ్ళకు సంకల్పబలం ఉన్నట్లు వాళ్లకే తెలియకపోవడం వల్ల కావచ్చు. ఈ బలహీనతకు వాళ్ళు తమని తప్ప అందరినీ నిందిస్తారు. కోపం ఎక్కువగా వచ్చే అతనంటాడు 'నేనేం చెయ్యను? మా నాన్న కూడ కోపిష్టే అలాగే అన్నిటికి ఆందోళన చెందే అతనంటాడు 'అది నా తప్పు కాదు; నా పని అంత ఒత్తిడి కలిగించేది'. ఎక్కువ నిద్రపోయే వాళ్ళంటారు 'నేనేం చేయను? నా శరీరానికి పది గంటల నిద్ర అవసరం'. ఇలాంటి వారికి తమలో అంతర్గతంగా ఉన్న శక్తి సామర్థ్యాలు తెలీవు. తెలుసుకోవాలన్న బాధ్యత లేదు. నీకు కాలాతీతమైన విశ్వ స్వరూపం తెలిస్తే, ప్రకృతి న్యాయం తెలిస్తే, ఈ విశ్వంలో నివసించే సకల ప్రాణుల జీవనాన్ని పాలించే సూత్రాలు తెలిస్తే, తమ పూర్తి సామర్థ్యంతో బతకడం తమ జన్మ హక్కని గుర్తిస్తారు. నీ పరిసరాల కంటే ఎక్కువ శక్తి నీకుంది. అలాగే, నీ గతానికి బందీగా కాక, ఇంకా ఎక్కువ సామర్థ్యంతో బతకగలవు.

ప్రతి ఒక్కరికి కాలం విలువలు తెలుసు. ఇసుక రేణువుల్లా మన చేతుల్లోంచి జారిపోయిన కాలం తిరిగి రాదని తెలుసు. చిన్నతనం నుంచే కాలాన్ని వివేకంతో ఉపమోగించుకున్న వారే, నిర్మాణాత్మకమైన, సంతృప్తికరమైన జీవితాల్ని గడుపుతారు. కాల నియంత్రణే జీవిత నియంత్రణ అన్న సత్యాన్ని తెలుసుకోలేని వాళ్ళు తమ సంపూర్ణ సామర్థ్యాన్ని కూడ గుర్తించలేరు.కాలం అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. మనం ఎంత గొప్పవాళ్ళమయినా, ఏమీ లేని వాళ్ళమయినా, అందరికీ ఉన్నవి ఇరవై నాలుగ్గంటలే. అసాధారణ జీవనం కాలాన్ని ఉపయోగించుకునే విధానంలోనే ఉంది.

ఒక బలహీనురాలయిన స్త్రీ ఉండేది. ఆమె భర్త చనిపోయాడు. తన కొడుకు, కోడలు, మనవరాలితో ఉండడానికి వెళ్లింది. రోజు రోజుకూ ఆమె చూపు, వినికిడి తగ్గిపోయాయి. ఒక్కోసారి ఆమె చెయ్యి ఎలా వణికేదంటే కంచంలోని బఠాణిలు దొర్లి కిందపడిపోయేవి; సూప్ కప్పులోంచి జారిపోయేది. ఈమె చేసే అపరిశుభ్రానికి కొడుకూ, కోడలు విసుక్కునేవారు.

చివరికి ఇంక ఈమెని భరించడం కష్టమనుకున్నారు. ఒక మూల చీపుర్లు పెట్టే బీర్వా పక్క ఒక చిన్న బల్ల వేసి అక్కడే ఆమెకు ఒంటరిగా భోజనం పెట్టేవారు. ఆమె తింటున్నంత సేపూ వాళ్ల కేసి నీళ్ళు నిండిన కళ్లతో చూసేది. కానీ ఏస్పూనో, ఫోర్కో కింద పడేస్తే తిట్టడానికి తప్ప వాళ్లెవరు ఆమె తో మాట్లాడేవారు కాదు.

ఒక రోజురాత్రి భోజనానికి కూర్చునే ముందు మనమరాలు బిల్డింగ్ బ్లాక్‌తో ఇల్లు కట్టుకుంటోంది. తండ్రి 'ఏం కడ్తున్నావు' అని అడిగాడు. 'నేను పెద్దగయ్యాక, నీకు, అమ్మకు, మూలన కూర్చుని తినడానికి టేబిల్ తయారు చేస్తున్నాను' అని జవాబిచ్చింది ఆ పాప. తల్లీ, తండ్రీ చాలా సేపు చేష్టలుడిగి, మాట్లాడలేకపోయారు. ఆ తర్వాత ఏడవడం ప్రారంభించారు. ఆ క్షణమే వాళ్లకు తాము చేస్తున్న నిర్దాక్షిణ్యమైన పని అర్థమైంది. ఆ రాత్రి వృద్ధురాలిని తిరిగి పెద్ద భోజనం బల్ల దగ్గరికి తీసుకువచ్చి కూర్చోబెట్టారు.... ఆనాటి నుంచీ ఆమెఅన్ని పూట్లా వాళ్లతో కలిసి భోంచేసేది. ఆమె పళ్ళెం లోంచి ఓ మెతుకు కిందపడ్డా, ఫోర్కు జారిపడ్డా ఎవ్వరూ ఏమీ అనుకునేవారు కాదు.

ఈ కథలో తల్లిదండ్రులు దుర్మార్గులని అనలేం వాళ్ళలో ఉన్న కనికరం దయ వెలుపలికి రావడానికి ఓ చిన్న కాంతి పుంజం వాళ్ళకు అవసరమైంది. ప్రతిరోజూ ఉదయం కాస్సేపు ఆ రోజు నువ్వు ఇతరులకోసం చేయగలిగిన దాన్ని గురించి ఆలోచించు. నీనుంచి ఏమీ ఆశించని వారికి నిజాయితీగా నీ ప్రశంసను అందించడం, ఆపదలో ఉన్న స్నేహితులకు వెచ్చని ప్రేమను అందివ్వడం.

మిత్రులు జీవితానికి హాస్యాన్ని, అద్భుతాన్ని, సౌందర్యాన్ని జతపరుస్తారు. చిరకాల మిత్రుడితో మనసారా నవ్వగలగడం కంటే మధుర క్షణాలు చాలా తక్కువ ఉంటాయి. నువ్వు మరీ అహంభావం ప్రకటిస్తున్నపుడు నిన్ను వినయపథంలోకి తీసుకువెళ్ళేవాళ్ళు మిత్రులు. నిన్ను నువ్వు మరీ సీరియస్‌గా తీసుకుంటున్నపుడు, నిన్ను నవ్వేలా చేయగలిగిన వాళ్ళు మిత్రులు. జీవితం నిన్ను హఠాత్తుగా కుదేసి, పరిస్థితులు ఉన్నదానికంటే ఘోరంగా కనబడినపుడు, నీకు తోడుండేవారే మిత్రులు.

నిజమైన విజయం కావాలంటే, భవిష్యత్తు కోసం లక్ష్యాలు, కలలు ఏర్పరచుకోవడం చాలా ముఖ్యం. నీ భవిష్యత్తులో లభించేదానిపై నీకున్న ఆశాభావమే రోజూ నువ్వు ఉత్సాహంగ నిద్ర లేవడానికీ, రోజంతా చురుగ్గా ఉండడానికి ప్రేరణ ఇస్తుంది. లక్ష్యాలు నీ జీవితాన్ని శక్తి సంపన్నం చేస్తాయి. ఏదో సాధించాలనే తపనలో ఇప్పుడు లభిస్తున్న ఆనందాన్ని దూరం చేసుకోకు. నీ ఆరోగ్యానికి సంతృప్తికీ తోడ్పడే అనుభవాలను వాయిదా వేయకు. ఈ రోజును సంపూర్ణంగా అనుభవించాలి; నువ్వు ఎప్పుడో లాటరీ గెలిచిన రోజో, పదవీ విరమణ చేసిన రోజో కాదు. జీవించడాన్ని ఎప్పుడూ వాయిదా వేయకు.

• • •

# ఒక విజేత ఆత్మ కథ

## (ఎ.పి.జె. అబ్దుల్ కలామ్)

కోట్ల జనాభా గలిగిన భారత దేశానికి భగవంతుడు చెప్తున్న దేమిటంటే : " కించపడవద్దని, అధైర్య పడవద్దని, మనమందరం మనలో ఒక దివ్యాగ్నితో జన్మించాం. మన ప్రయత్నాలెపుడూ ఆ అగ్నికి రెక్కలిచ్చేలా ఉండాలి. తద్వారా ఈ ప్రపంచమంతా సత్ప్రకాశంతో వెలుగు పొందాలి."

భారతీయ యువత ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏమంటే, ఒక దార్శనిక స్పష్టత లేక పోవడం, ఒక దిశానిర్దేశం లేక పోవడం. ఎవరు ఎంత చిన్నవాళ్ళుగానీ, ఎంత తక్కువ అవకాశాలకు నోచుకోనీ, ఎంత బీదవాళ్ళు గానీ, వాళ్ళు నిరాశచెందనవసరం లేదు. ఎక్కడన్నా ? ఒక బీద విద్యార్థి, నిర్భాగ్య సామాజిక స్థితిలో ఉంటున్న వారెవరైనా ఈ కథ చదివి ఎంతో కొంత ఓదార్పు పొందుతారని నా ఆశ.

### ధృడ మనోవైఖరి

నాకేదన్నా సంభవించాలని నేననుకునే ముందు నేను దాన్ని గట్టిగా ఆకాంక్షించాలనీ, అది తప్పక జరిగి తీరుతుందని ప్రగాఢంగా విశ్వసించాలి.

కోరిక అనేది హృదయం నుంచీ ఆత్మనుంచి ఉప్పొంగినపుడు,అది పరిశుద్ధమూ,తీవ్రమూ, అయినపుడు దానికొక గంభీరమైన విద్యుదయస్కాంత శక్తి వస్తుంది. మనసు నిద్రలోకి జారుకున్న. ప్రతీ రాత్రీ ఈ శక్తి శూన్యంలోకి విడుదలవుతుంది.తిరిగి ప్రతి ఉదయమూ, అది విశ్వశక్తి ప్రవాహాల బలాన్ని పుంజుకొని మన వ్యక్తస్థితలో మననిచేరవస్తుంది. నువ్వేది సంభావించావో అది తప్పక సాక్షాత్కరిస్తుంది. ఈ కాలాతీత వాగ్దానం మీద ఓ యువకుడా, నువ్వు తప్పక ఆశపెట్టుకోవచ్చు. అనంతకాలం నుండీ సూర్యోదయం గానీ ఎలాగతితప్పలేదో ఈ వాగ్ధానమూ అలాగే.

వృత్తిలో అత్యున్నత స్థానానికి చేరాలనుకునే వారికి పూర్తి అంకితభావం కీలక అర్హత. తన యావత్తునీ విని యోగించి పనిచేయాలనుకునే వాళ్ళ జీవితంలో ఇంక దేనికి చోటువుండదు. జీతం తీసుకుంటూ కూడా వారానికి నలభై గంటల కనీస పనిని  ఎగతాళీ చేసేవారు కూడా ఉన్నారు. అలాగే తమ పని కలిగించే ఉద్రేకం వల్ల వారానికి అరవై, ఎనభై , చివరికి వంద గంటలు పని చేసేవారిని కూడా నేనెరుగుదును. విజయవంతులైనా స్త్రీ పురుషులందరికి పూర్తి అంకిత భావం అనేది ఉమ్మడి ధర్మం.

చెట్టు తాలూకు కాండం ఒక నిర్మాణం. అందులోని క్రియలన్నీ రూపవంతాలుగా, విధానాలన్నీ నియమ శీలాలుగా, నిర్ణయాలన్నీ సమీకృతంగా ఉంటాయి. ఆ చెట్ల కొమ్మలు, వనరులు, ఆస్తులు, కార్యకలాపాలు, ఉత్పత్తులు, నిరంతర మూల్యంకన ద్వారా, సమిష్టి సమీక్ష ద్వారా వాటికి ఆ కాండం నుంచి పోషణ అందుతూనే ఉంటుంది.

సాంకేతిక నిర్వహణ అనే ఈ వృక్షం చక్కగా పెరిగితే ఉత్తమ సదుపాయమనే ఫలాన్ని ఇస్తుంది. సంస్థల్ని బలోపేతం చేసే పరిజ్ఞానంగా మారుతుంది. మనుష్యుల్లో సాంకేతిక నైపుణ్యాల్ని వృద్ది పరుస్తుంది. జాతి స్వయంసామర్థ్యాన్ని బలపరుస్తుంది. ఆ దేశ పౌరుల జీవన ప్రమాణంలో మెరుగుదలను తీసుకువస్తుంది.

మీ జీవితాన్ని నియంత్రించగల శక్తి మీ చేతుల్లోనే ఉందా? నేను చెప్తున్నాను వినండి. బయట ఒత్తిళ్ళు మిమ్మల్ని నిర్వీర్యుల్ని చేయడానికే ప్రయత్నిస్తాయి. వాటి మీద ఆధారపడి మీరెంత తక్కువగా నిర్ణయాలు తీసుకొనగలిగితే మీ జీవితమంతా మంచి జీవితమవుతుంది. మీ ధృడమైన అంతరంగ ప్రభోదకులైన నాయకులు ఉన్నందువల్ల మొత్తం జాతి లాభపడుతుంది. తనకైతాను ఆలోచించగలిగే వీరులున్నచోట, తమనితాము తెలుసుకొనో, తమని తాము నమ్ముకునే మనుష్యులుండే దేశమున్న చోట ఏ నిరంకుశత్వం గానీ, ఏ స్వార్థ ప్రయోజనం కానీ నిలబడజాలవు.

మీ అంతరంగిక వనరుల్ని, ముఖ్యంగా మీ భావనాశక్తిని వినియోగించి మీ జీవితాన్ని తీర్చిదిద్దు కోవడానికి మీరు సిద్ధపడితే అది మీకు తప్పక విజయాన్నిస్తుంది. మీ అద్వితీయ దృక్పథం నుంచి మీరొక బాధ్యత నిర్వహించడానికి సంసిద్ధులయినపుడే మీరు నిజంగా ఒక మనిషి అనిపించుకుంటారు.

## లక్ష్యానికి అంకితం

ప్రేమ లేకుండా పెట్టిన రొట్టె చేదుగా ఉండటమే కాదు అది ఆకలిని సగమే తీరుస్తుంది. హృదయాలతో ఏమి చెయ్యని వాళ్ళ విజయం బోలుగా ఉండటమే కాక అది తన చుట్టూ వెగటుతనాన్ని వ్యాపించ చేస్తుంది. ఎవరైన బ్రాంచ్ ఎన్నుకోబోయే ముందు చూసుకునాల్సిందేమంటే వాళ్ళ ఎంపిక వాళ్ళ అంతరంగిక అనుభూతినీ ఆకాంక్షను వ్యక్తం చేయగలుగుతుందా లేదా అనే. నువ్వు డాక్టరువో లాయర్‌వో కావాలని రహస్యంగా తపిస్తూ పైకి మాత్రం రచయితగా రచనలు చేస్తున్నావనుకో నీ అక్షరాలు నీ పాఠకుల ఆకలిని సగమే తీర్చగలుగుతాయి. నువ్వు ఒక వ్యాపారివి కాలేక ఒక ఉపాధ్యాయుడివి అయ్యావనుకో నీ పాఠాలు నీ విద్యార్థుల జ్ఞాన తృష్ణని సగమే తృప్తిపరచగలుగుతాయి. నువ్వు సైన్సుని ద్వేషిస్తూ ఒక సైంటిస్టుగా పని చెయ్య వలసి వచ్చిందనుకో నీ కృషి నీ లక్ష్యాన్ని సగమే నెరవేరుస్తుంది.

నువ్వెట్లా లక్ష్యానికి అంకితమయి నిన్ను నువ్వు నిర్దేశించుకున్నాక దానికి మంచి ఆరోగ్యం కూడా జతకావాలి. అది ఎవరెస్ట్ పర్వతం కానివ్వు లేదా నీ వృత్తి శిఖరం కానివ్వు, దాన్ని అధిరోహించడానికి బలం కావాలి. పురుషులు రకరకాల శక్తిని ఖర్చు చేసుకుని అలసిపోయినవాడికే అందరికన్నా ముందుగా బలాన్నీ పుంజుకునే అవకాశం చిక్కుతుంది.

పెద్ద పెద్ద శాస్త్రీయ ప్రణాళికలు మహా పర్వతాల్లాంటివి. నీవేగం నీ స్వధర్మానికి అనుగుణంగా ఉండాలి. శక్తులు కూడగట్టు కొని వేగం పెంచు. ఒత్తిడి మొదలయిందా వేగం తగ్గించు. నువ్వొక సమతూక మన:స్థితిలోనే పర్వతారోహణ సాగించాలి. నీ ప్రాజెక్ట్ లోని ప్రతి ఒక్క అంశాన్నీ దేనికదే ఒక అద్వితీయ సంఘటన అని నువ్వు భావించుకోగలిగినపుడే పనిలో సక్రమంగా ముందుకు పోతున్నట్టు.

జీవితమంటే ఏమిటి? కొన్ని అపరిష్కృత సమస్యల కొన్ని సంధిగ్ధ జయాల కొన్ని రూపరహిత అపజయాల సమాహారమే కదా. చిక్కేమిటంటే, మనం జీవించడం మాని, తరచు దానిని విశ్లేషించడానికి పూనుకుంటాము. మనుషులు వాళ్ళ అపజయాల్ని కార్య కారణాల కోసం చీల్చి చూస్తారు. నిజానికి చేయాల్సింది వాటినుంచి అనుభవం గ్రహించడమూ, ఆ అవివేకం ఆధారంగా అటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవడము అని, నా నమ్మకం.

ఇక్కడే నూతన ప్రపంచ వ్యవస్థ తీరుని మనం గమనించాల్సింది. అది సాంకేతిక ఆధిక్యత మీద ఆధారపడ్డది. నీ శత్రువుకి ఆధునిక పరిజ్ఞానం లేకుండా చెయ్యి. అప్పుడతడు నువ్వు చెప్పినట్టు వింటాడు. చాలా కాలం క్రితం ఒక చైనా తాత్వికుడు చెప్పిన మాటల్ని గుర్తు తెస్తున్నాయి. అతనేమన్నాడంటే ఒక శతృవుని జయించాల్సింది అతని సైనికుల్ని ఒక్కొక్కర్నే హత మార్చడం ద్వారా కాదు, ముందతని సంకల్ప శక్తిని దెబ్బతియ్యి, అప్పుడతను ఓటమిని అంగీకరిస్తాడని. బహుశా అది ఈ సాంకేతిక ఆధిక్యత గురించి సూచనే అయివుంటుంది.

నా జీవితం తమని తాము మలుచు కోవడానికి ఎవరికన్నా ఆదర్శ ప్రాయమనేటంత ఆలోచన నాకు లేదు. కానీ ఎక్కడున్నా ఒక బీద విద్యార్థి ఏ మారుమూలనో ఒక నిర్భాగ్య సామాజిక స్థితిలో ఉంటున్న వాడెవడైనా ఈ కథ చదివి ఎంతో

కొంత ఓదార్పు పొందుతాడని నా ఆశ. అటువంటి పిల్లలు తమ మిథ్యాత్మక దాస్యం నుంచీ, బంధన నుంచీ విడి పడటానికి నాజీవితయాత్ర కథనం ఎంతో కొంత సహకరిస్తుందిని నమ్ముతున్నాను. వాళ్ళప్పుడు ఎక్కడున్నా దేవుడు వాళ్ళ చెంతనే ఉన్నాడని తెలుసు కోవాలి.

' వినయం ' మనం ఇంగ్లీషులో చెప్పే మోడస్టీ అనే పదం కన్నా పెద్ద పదం. అది తన విలువలని, తన విశిష్టతలను ప్రదర్శించు కోకుండా ఉండటం. అంటే వినయమనే మాట మనకు చెప్పేదేమిటంటే నువ్వు ఒక పని చేయడానికి కావల్సిన నైపుణ్యం, శ్రద్ధ, అనుకూల పరిస్థితులు అన్నీ సమకూరినప్పుడు కూడా నువ్వు ఎక్కడో ఏదో ఒక పొరపాటు చేసే అవకాశం ఉందని గుర్తు పెట్టుకోవడం. ఆ పొరపాటు పట్ల నువ్వు ఏమరు పాటు చూపించడం వల్లనే నీ మొత్తం శక్తి సామర్ధ్యాలు, నీ కృషి అన్ని నిరుపయోగం కాగలిగే పరిస్థితి రాగలదని తెలివిడి ఉండటం.

దీనికి ఒక ఉదాహరణ నైట్రిక్ యాసిడ్ వాల్వు ఊడిపోయి యాసిడ్ ఒలకడం అనే చిన్న పొరపాటు వల్ల ఎస్.ఎల్.వి –3 విఫలమై ఏళ్ళ తరబడి ఒక బృందం చేసిన కృషి అంతా చిన్నాభిన్నం అయినది.

## కృతజ్ఞత

విశ్వాసం, వినయం అనే గుణాలతో పాటు కలాం లోని మూడవ ముఖ్య లక్షణం ' కృతజ్ఞతా భావం' కృతజ్ఞత లనే దానిని సనాతన ధార్మిక వ్యవస్థలన్నీ దాదాపుగా ఒక అత్యంత పవిత్రమైన మత భావన స్థాయిలో ఎత్తిచూపాయి. రామాయణంలో నారదుణ్ణి ' ధర్మజ్ఞుడు అయిన మనిషి ఎవరు '? అని ప్రశ్నిస్తూ ఆ వెంటనే 'కృతజ్ఞుడు ఎవరు? అని ప్రశ్నించాడు. కృతజ్ఞత అనే సంస్కృత పదానికి ఖచ్చితమైన అర్థం ' చేసింది గుర్తుపెట్టుకోవడం ' అని దానికి విరుద్ధం అయిన పదం ' కృతఘ్నత.' దానికి ఖచ్చితమైన అర్థం ' చేసిన దానిని ధ్వంసం చేయడమని ' చాలా సాధారణమైన ప్రాపంచిక భాషలో చెప్పాలంటే ఒక మనిషి కృతజ్ఞుడుగా ఉండాలంటే అతనికి మానవ శ్రమ పట్ల విలువలేని వాడు మాత్రమే చేసిన దానిని ధ్వంసం చేయగలుగుతాడు.

భారతదేశంలో నేటికి కూడ టెక్నాలజీ అనే పదం చాలా మందికి పొగలు కక్కే కర్మాగారాల్నీ, యంత్రభూతాల్నీ గుర్తుకు తెస్తుంటుంది. కానీ అది టెక్నాలజీకి సరయైన అర్థం కాదు. ఒకప్పటి గుర్రపు కళ్ళెం సాంకేతిక ఆవిష్కరణే. అలాగే తదనంతర కాలంలో లోహపు కొలిమి కూడా అటువంటి ఆవిష్కరణే టెక్నాలజీ అంటే సాంకేతిక సూత్రాలు, పద్దతులూ. వాటిని ఉపయోగించే యంత్రాలు అన్ని వేళలా టెక్నాలజీలో భాగం కావచ్చు, కాక పోవచ్చు. అందువలన సాంకేతిక పరిజ్ఞానమంటే ఒక రసాయనంతో ఎట్లా పని చేయించ వచ్చో తెలియడం కావచ్చు. చేపల్ని పెంచే పద్దతులు కావచ్చు, కలుపుని నిర్మూలించే పద్దతులు కావచ్చు, ధియేటర్లలో దీపాలు అమర్చే పద్దతి కావచ్చు, చరిత్రని బోధించే పద్ధతి కావచ్చు. యుద్దాలు చెయ్యడం కావచ్చు, లేదా వాటిని నివారించగలగడం కావచ్చు.

భారతీయులు తమ ఆవేశాలు ఏవిధంగా నిభాయించుకోవాలో తెలియకనే తమ జీవితమంతా దుర్భర వేదనకు గురువుతుంటారు. వాళ్ళొక మానసిక జడత్వంలో చచ్చుబడి పోయుంటారు. మరో మంచి అవకాశం ఒకే ఒక్క సాధ్య పరిష్కారం లేదా ప్రత్యామ్నాయం మరో మంచి రోజొచ్చేదాకా లాంటి పదాలు మన వ్యవహార సరళలో భాగమై పోయాయి. ఆ విధమైన విధ్వంసాత్మక ప్రవర్తనని ఆత్మ అపజయాత్మక ఆలోచనా పద్దతుల్నీ, అటువంటి వ్యక్తిత్వ పోకడల్నీ బహిర్గతం చేసేలా ఎందుకు రాయకూడదు ?

## నాయకత్వ నైపుణ్యం

మంచి నాయకుడు రెండు రకాల వాతావరణాల్ని గుర్తించవలసి ఉంటుంది. ఒకటి, మనుషుల అవసరాల్ని తృప్తి పరచగలిగేది. రెండవది, మనిషికి తన పని పట్ల అసంతృప్తికి కారణమయ్యేది.మనుషులు తమ జీవితాలకి అర్థాన్నిచ్చే విలువల్నీ, లక్ష్యాల్ని తాము పని చేసే చోట చూడాలని ప్రయత్నిస్తారు. ఒక పని ఆ ఉద్యోగికి సాఫల్యమూ, గుర్తింపూ భాద్యత, ఎదుగుదల, మెరుగుదల ఇవ్వగలిగినప్పుడు ఆ ఉద్యోగి లక్ష్య సాధనకై కష్టపడి పని చేస్తాడు.

పని తన ఉద్యోగిని తృప్తి పరచడం మొదలయ్యాక ఆ ఉద్యోగి అప్పుడు ఆ పని చుట్టూ ఉన్న వాతావరణాన్ని స్థితిగతులను పట్టించుకోవడం మొదలుపెడతాడు. అలాగే, పాలనా విధానాల్నీ, నాయకుడి గుణగణాల్నీ, ఉద్యోగ భద్రతను, హెూదాని, ఉద్యోగ పరిస్థితుల్ని పరిశీలించడం మొదలు పెడతాడు. ఈ అంశాలకు తన సహచరుల్తో గల సంబంధాలతో పోల్చి చూసుకొని తన వ్యక్తిగత జీవితాన్ని పరీక్షించి చూసుకుంటాడు. వీటన్నిటినీ కూడగా వచ్చిందే ఉద్యోగి ప్రయత్నాల పని తీరుయొక్క ఉన్నతినీ, నాణ్యతనీ నిర్ణయిస్తుంది.

## శ్రమ – ఎగతాళి

అగ్ని ఫెరోజ్ డిజైన్‌లో వాతావరణంలో పున: ప్రవేశించగలిగితే దాని వేగం మరొక సవాలు. అది వాతావరణంలో శబ్దవేగంకంటే పన్నెండు రెట్లు అధిక వేగంతో ప్రయాణిస్తుంది. అంత వేగంలో ఆ నౌకని ఎట్ల అదుపు చేయాలో మనకి తెలియదు పరీక్ష చేయ్యాలన్నా కూడా అంత వేగాన్ని పుట్టించగల గాలి ఎక్కడా లేదు. మనకి ఒక వేళ మనం అమెరికా సహాయం కోరాం అంటే అదేదో వాళ్ళ సొత్తని మనం కోరుకుంటున్నట్టు భావిస్తారు. ఒక వేళ వాళ్ళు సహకరించడానికి ఒప్పుకున్నా ఆ విండ్ టన్నెల్ ఖరీదు మన మొత్తం ప్రాజెక్టు బడ్జెట్ కన్న ఎక్కువ చెప్తారు.

500 మంది శాస్త్రజ్ఞులపై నేను వార్షిక రహస్య నివేదికల రూపంలో పని తీరు మదింపు చేయవలసి ఉంటుంది బయటి నిపుణులతో కూడిన ఒక అసైన్‌మెంట్ బోర్డుకి నేను ఈ నివేదికలని వారి సూచనల నిమిత్తం పంపాల్సి ఉంటుంది. నా ఈ భాద్యతను చాలా మంది అపార్థం చేసుకున్నారు. ఎవరన్న ప్రమోషన్ పొందలేక పోతే నేను వాళ్ళ పట్ల అయిష్టంగా ఉన్నానని వాళ్ళనుకున్నారు. అలాగే ఎవరన్న ప్రమోషన్ పొందితే అది వాళ్ళంటే నాకు ఇష్టముండటం వల్లనే సాధ్యమైందని అనుకున్నారు. పని తీరు మదింపు చేయాల్సిన బాధ్యతవల్ల నేనొక న్యాయాధిపతిగా ప్రవర్తించవలసి వచ్చింది

" అగ్ని " ప్రయోగం సాంకేతిక సమస్యవలన ఆగినప్పుడు, పత్రికలు తుపాకులెక్కు పెట్టినాయి. వాళ్ళ పాఠకుల సరదా తీర్చ డానికి వాళ్ళకు తోచిన కథలు రాసారు. నౌక ప్రయోగాన్ని వాయిదా వెయ్యడంపైన ఎవరికి తోచిన వ్యాఖ్యానం వారు చెప్పుకున్నారు. కార్టూనిస్టు సుధీర్‌దార్ ఒక కార్టూన్ గీసాడు. అందులో ఒక దుకాణదారు ఒక వస్తువుని సేల్స్ మెన్‌కి వాపసు చేస్తూ 'అగ్ని' పని చేయక పోవడానికి కారణం ప్రెస్ బటన్ నొక్కబడక పోవడమేనని ఎవరో శాస్త్రవేత్త వివరిస్తున్నట్లుగా కార్టూన్ గీసాడు. హిందుస్తాన్ టైమ్స్ కార్టూన్‌లో రాజకీయ నాయకుడు ప్రజల్ని ఓదారుస్తుంటాడు. మరేం భయపడకండి. అది పూర్తిగా శాంతియుతమైన, అహింసాత్మక మిస్సైల్ మాత్రమే అదీ.

అటువంటి పరిస్థితులు రాకెట్ ప్రయోగాల్లో అరుదు కాదు. అటువంటి సంఘటనలు విదేశాల్లో కూడా సంభవిస్తుంటాయి. కాని పత్రికల కుతూహలానికి మా కష్టాలతో నిమిత్తం లేదు. అమూల్ కంపెని కూడా మమ్మల్ని వదల లేదు. వాళ్ళ కార్టూన్ ఉంటుంది కదా. మా వెన్నని ఇంధనంగా వాడి చూడండి అప్పుడు అగ్ని ఎగర గలుగుతుంది అని.

బహుశా ప్రపంచంలో ఒక జాతి గౌరవాన్ని నిలబెట్టడానికి మండేలా చేసిన దానితో పోలిస్తే రాకెట్ల తయారీలో నా దేశాన్ని ముందుకు నడిపించాలని నేను చేసిన కృషి ఏమంత ముఖ్యం కాక పోవచ్చు. కానీ ఆ లక్ష్యాల సాధనలోని గాఢత్వంలో మాత్రం భేదం లేదు. తాత్కాలిక కృత్రిమ ఆనందాల వెంట పడడం కన్నా నిర్దిష్టమైన విజయాల్ని సాధించడంలో దృష్టి పెట్టండి. అని విద్యార్థులకు హితవు ఇచ్చాను.

ఒక కళగా జ్యోతిష్యం పట్ల నాకేమి అభ్యంతరం లేదు. కానీ అది విజ్ఞానం ముసుగులో ఆమోదం కోసం ప్రయత్నిస్తే మటుకు నేను నిరాకరిస్తాను. గ్రహాలు, నక్షత్ర రాశులు చివరికి ఉపగ్రహాలు కూడా మనుషుల మీద ప్రభావం చూపగలదని చెప్పే ఈ కల్పన లెట్లా రూపుదిద్దుకున్నాయో నాకు తెలియదు.

ఇతరుల్ని అర్థం చేసుకున్నవాడు విజ్ఞాని. కానీ తనను తాను తెలుసుకున్నవాడే వివేకి. వివేకం లేని విజ్ఞానం ప్రయోజన శూన్యం.

నాయకుడు తన బృందంలో ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసేవాడు కావాలి. ఎక్కడెక్కడ ఎవరెవరికి ప్రశంస అందాలో దాన్ని నలుగురిలో అందించాలి. వారిని విమర్శించవలసి వస్తే ఏకాంతంలో పిలిచి విమర్శించాలి.

శ్రీమతి గాంధీ వజ్ర హస్తంతో పనిచేయించే నాయకురాలు కాగా రాజీవ్‌గాంధీ తన మనోహర వ్యక్తిత్వంతో ఆశయాన్ని సాధించుకున్నారు.

ఇంజనీర్లు తమకి దొరకని మొదటి అవకాశంలోనే ఈ దేశాన్ని వదలిపెట్టి మరింత సంపాదించడానికై విదేశాలకు వెళ్ళిపోతున్నారు. వాళ్ళకి అక్కడ ఆర్థికావకాశాలు పుష్కలంగా ఉన్న మాట నిజమే కాని తన స్వదేశీయుల ఆదరాభిమానాలకు ఏది సాటిరాగలదు?

• • •

# గీతాంజలి

## (రవీంద్రుడు)

నిన్ను నేను ప్రార్థించేడి ఒకందుకే ప్రభూ! నాలోని లోభిత్యాన్ని సంకుచిత తత్వాన్ని సమూలంగా నిర్మూలించు. కష్టసుఖాలను తేలికగా భరించే శక్తి నాకు ప్రసాదించు. నా ప్రేమను నీ సేవలో ఫలప్రదం చేసుకొనే శక్తిని నాకివ్వు. పేదవారిని తిరస్కరించకుండా, అధికార గర్వం ముందు తలవంచకుండా ఉండె బలాన్ని నాకు అనుగ్రహించు సగర్వంగా తల ఎత్తి రోజు వారీ చిల్లర కష్టాలను చూచినవ్వే తత్వాన్ని నాకు కల్గజేయి. ప్రేమతో నా సర్వస్వాన్ని నీ ఇచ్ఛకు సమర్పించే శక్తిని నాలో ప్రేరేపించు.

ఓయి పూజారీ ఇక నీ జపతపాలను కీర్తనాన్ని విడిచిరా! తలుపులన్నీ మూసుకొని దేవాలయపు చీకటి కోణములో ఎవరికోసం పూజిస్తున్నావు. ఒకమాటు కళ్ళు తెరచి చూడు ఏ దేవుని ఆరాధిస్తున్నావో అతడు నీ ముందు లేడు. అతడు ఎక్కడ ఉన్నాడో చూడు. రైతు రాతి నేలను దున్నుతూ ఉన్నచోట, రోడ్లు వేసే పనివాడు రాళ్ళు కొడుతూ ఉన్నచోట అతడున్నాడు. ఎండనక వాననక పని చేస్తున్న వారివద్దనే అతను ఉన్నాడు, నేను ధరించిన వసనాలు మాసి చిరిగి పోతే మటుకు ఏమిటి పూజారి! అతనితో అతని బాసటే నిలిచి చెమటోడ్చి కష్టించు.

జీవితమనే క్రిక్కి రిసిన సంతలో నా రోజులు చెల్లి పోయాయి. రెండు చేతులా భోగభాగ్యాలు ప్రోగు చేసుకొన్నప్పుడు నేను ఆర్జించింది ఏమీ లేదనే భావాన్ని నాకు కల్గించు.

• • •

# విషవృక్షం

## (బంకింబాబు)

ఇతరుల సుఖం కోసం ఆత్మసుఖాన్ని విసర్జించడమే ప్రేమ అనబడుతుంది. నిస్వార్థ భావాలతో పని చేయాలనే ప్రసక్తి ఉండటమే ప్రేమ. ఆడవాళ్ళ సౌందర్యాన్ని చూచి అభిలషించడం ప్రేమ అనిపించుకోదు. అదంతా బాహ్యరూపానికి చెందిన, మోహం మాత్రమే, విశుద్ధ ప్రణయంలో ప్రేమికుడు ముందుగా ప్రియురాలి గుణగణాల్ని గ్రహిస్తాడు, ఈ గుణగ్రహణ తర్వాత సాన్నిధ్యంకోసం పరితపిస్తాడు. సాఫల్యత లభించడంతో ప్రణయం గంభీర రూపాన్ని దాలుస్తుంది. ఇదే నిజమైన ప్రేమ.

హృదయజనిత ప్రేమ శాశ్వతంగా ఉండిపోవడానికి అవకాశాలున్నాయి. కాని రూపజనిత ప్రేమలో ఈ తత్వం ఉండదు. రూపాన్ని ప్రతి రోజు ఒకేతీరుగా వీక్షిస్తు గడిపిన తర్వాత చూడాలనే కోరిక తగ్గిపోతుంది. కాని గుణాల విషయంలో అలాకాదు. నూతన క్రియలను బట్టి అవినిత్య నూతనంగా కనబడుతాయి. రూపం వలన కూడా విశుద్ధమైన ప్రణయ: ఏర్పడడానికి అవకాశాలు లేకపోలేదు, ఉభయులు కల్సి ఉండి కూడ సంయమంగా ఉంటే రూపజనితమైన మోహం పరిశుద్ధ ప్రణయంగా మార్పుచెందడానికి అవకాశమున్నది.

• • •

# 13వ శతాబ్ధంనాటి ఓరుగల్లు చరిత్ర

**(ఆవాహన పుస్తకం నుండి రచన ముదిగొండ శివప్రసాద్)**

వరంగల్ పూర్వం ఒక పట్టణం కాదు రామన్న పేట్, మట్టి వాడ, గిర్మాజి పేట్, ఇలా నగర్, గోవింద నగర్ అనే ఐదు గ్రామాల కూడలి.

**వరంగల్ :–**

ఖిలాలోని రాతి కోట నాలుగువైపుల నాలుగు సింహద్వారాలతో 8 మైళ్ళ వలయంతో సున్నం వాడని కట్టడమిది. దీని చుట్టు గల మట్టికోట ఫిరంగులు తగిలినా పగలదు ఏనుగులతో త్రొక్కించి కోడిగ్రుడ్ల సొన కలిపి కట్టారు. ఇలాంటివి మొత్తం ఏడు కోటలుండేవి. కంచుకోట, ఇటుకకోట, రాతికోట, పుట్టకోట, భూమికోట, కంపకోట, గలినికోట.

మట్టికోటలోని స్వయంభూదేవాలయం (శంభునిగుడి) లోని లింగం పూర్వం పరుసవేదలింగం (ఇనుము తాకిస్తే బంగారం అయ్యేది) గా చెప్తారు. అన్ని శిల్పాలు ఒక చోట చేర్చిన స్థానం మరియు దర్బారు శిల్ప కళతోనిండినవి అనియు మార్కోపోలో తన గ్రంథలో ఉదహరించాడు. ఈ దుర్గం మలిక్కాఫరు దండయాత్రలో శిథిలమైనది. ఇట్టి చారిత్రక విషయాలు అలూఫ్ ఖాన్ వ్రాతల ద్వార మనకు చరిత్ర విదితం.

రుద్రమాదేవి కుమార్తెలు రుయ్యమ్మ, ముమ్మడమ్మ
చామక్క ఆస్థాన నాట్యకత్తె, ఆమె కుమార్తె కామసాని. ఈమె కూడ ఆస్థాన నాట్యకత్తె

కామసాని ప్రియుడు బళ్ళాల (మల్యాల) సోమేశ్వరుడు కాకతీయ శిల్పాలను చెక్కిన శిల్పి, కాకతీయులు చంద్ర వంశస్థులు.

## కాకతీయ రాజుల పరంపర వరుసగా

1. మొదటి బేతరాజు
2. ప్రోలరాజు
3. రెండవ చేతరాజు
4. రెండవ ప్రోలరాజు
5. రుద్రదేవుడు
6. మహాదేవుడు
7. గణపతిదేవుడు
8. రుద్రమదేవి
9. ప్రతాప రుద్రుడు (రుద్రమా దేవి కూతురు ముమ్మడమ్మ పుత్రుడు)

కామసాని క్రీ.శ. 1260 – 80 మధ్య కాలం అని అంచన, బహుశా ప్రతాప రుద్రుడు 1280లో పుట్టాడు. రుద్రమాదేవి క్రీ.శ. 1298 లో చనిపోయింది అపుడే ప్రతాపరుద్రుడు రాజ్యానికి వచ్చాడు. 1303 క్రీ.శ.లో మలిక్ కాపుర్ దండయాత్ర చేసినాడు.

• • •

# భద్రాచలం దేవస్థానం చరిత్ర
## (సీతారామ చంద్ర స్వామి దేవాలయము)

గోదావరి నది ఉత్తర తీరానా భద్రాచలగిరి గా పిలవబడే పర్వత ప్రాంతమే "భద్రాచలం" గ్రామంగా విలసిల్లి వున్నది. తూర్పు కనుమలలో బాగమైన ఈ పర్వతం దక్షిణ భారత దేశం ఈశాన్య దిశలో (ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో) విస్తరించి వున్నది. ఇచ్చట శ్రీరామదాసుచే నిర్మితమై కాలాను గుణంగా బహుళ ప్రజాదరణ పొందిన " శ్రీ సీతారామ చంద్ర స్వామి" దేవస్థానము కలదు. భారత దేశములో బహుళ ఆదరణీయమైన ఈ దేవాలయము దక్షిణ దేశ ప్రజలచే విశేషంగా ఆదరింపబడుచున్నది. " బ్రహ్మాండ పురాణం" లోని "గౌతమి మహాత్యం" లో ఇట్టి భద్రాచల స్థలము మరియు స్వామివారిని గూర్చి తెలియజేయుచున్నది.

పర్వత రాజు " మేరు" మరియు అతని భార్య "మేరుదేవి" పుత్ర సంతానం గురించి వేల సం॥లు ఇక్కడ తపస్సు చేసినారని ఇట్టి పురాణంలో వర్ణింపబడినది. తపో ఫలితంగా బ్రహ్మదేవుడు వారి కోరికను మన్నించి వరం అంగీకరించడం వలన "భద్ర" అను పుత్రుడు జన్మించినాడు. దండకారణ్యంలో భాగమైన ఈ ప్రాంతములో గోదావరి ఒడ్డున భద్రుడు తపస్సు చేసుకొనుటకు నిర్ణయించుకొని స్థిరపడినాడు. శ్రీరామ చంద్రుడు అతని సోదరుడు లక్ష్మణునితో కలిసి స్వయంగా దండకారణ్యంలో తిరుగుతూ ఇట్టి పర్వత ప్రాంతములోని అనువైన రాతిపై విశ్రాంతి తీసుకొన్నారు. అప్పుడు భద్రుడు శ్రీరామునికి ప్రణమిల్లి. ప్రజలందరికి ముక్తిని ప్రసాదించుటకు, నిత్య దర్శనము, ఆరాధన కొరకు తనపై వెలయమని ప్రార్థించగా. శ్రీరాముడు అతని కోరికను మన్నించి బహుమతిగా తాను విశ్రాంతి తీసుకొన్న రాయిపైనే వెలిసినాడు. శ్రీ రాముడు, విశ్రమించిన అట్టి రాయి సీతారామ, లక్ష్మణ దేవతామూర్తుల విగ్రహాలుగా మారి పోయినవి.

. ఇట్టి ప్రాంతమునకు ఒక మైలు దూరంలో వున్న బద్దిరెడ్డి పాలెం గ్రామంకు చెందిన శబరి కులములోని పోకల వంశస్థురాలైన "ధమ్మక్క"అనే మహిళకు శ్రీరామచంద్రుడు కలలో ప్రత్యక్షమై అక్కడి పరిసరాలలోగల అటవీ ప్రాంతంలోని పర్వతంపై గల ఒక తాటిచెట్టు క్రింద తాను వెలిసినట్లు, తనకు నిత్య పూజలు చేయమని గోరినాడు. అప్పుడు దమ్మక్క అట్టి ప్రాంతమును వెతికి ఆ వనమును శుభ్రపరిచి దేవతా విగ్రహాలను కనుక్కొని ఒక సాదారణ గుడిసెను గుడివలె నిర్మించినది. తరువాత నిత్య పూజలు చేస్తూ అక్కడే వున్న తాటిచెట్టుపండును ప్రతి దినము నైవేద్యంగా సమర్పించేది. ఇప్పటికి కూడా పోకల దమ్మక్క పేరు మీద ఆమెకు వచ్చే సాంప్రదాయ భాగమును ప్రస్తుత పూజారీలు అనుభవిస్తున్నారు.

ఖమ్మం తాలూకా నేలకొండ పల్లి గ్రామంలో 1630వ సంవత్సరంలో జన్మించిన శ్రీ కంచర్ల గోపన్న "శ్రీరామదాసు"గా ప్రాచుర్యం పొందినాడు. గోల్కొండ సామ్రాజ్యంలోని కుతుబ్‌షాహి వంశస్థుడైన అబుల్ హసన్ షా (తానీషా) నవాబు గారి కొలువులో పరిపాలన నిర్వహకులైన అక్కన్న, మాదన్నల మేనల్లుడు గా శ్రీ రామదాసును భావిస్తారు. గోపన్న బాల్యం నుండే తన అంతరాత్మను శ్రీ రామచంద్రునకు అప్పగించినాడు. గోపన్నను చూచిన తానీషా అతని ముఖంలోని వర్చస్సుకు ప్రబావితుడై, అతనిని వెంటనే ఖమ్మం జిల్లా ఆఫీసులో " పెష్కార్" గా నియమించి, "పరగణా" అధికారిగా భాద్యతలు అప్పగించినారు.

ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా పాల్వంచ, బుర్గం పహాడ్ తాలుకాలు కలిపి "పరగణ"గా వుండేవి. ఆ ప్రాంతం నుండి చాలా సంవత్సరాలుగా శిస్తులు బకాయిపడి వున్నాయి. గోపన్న పరగణా ముఖ్య ప్రాంతం అయిన పాల్వంచలో నివసిస్తూ తన మంచితనంతో బకాయి పడిన శిస్తులను వసూలు చేస్తువుండేవాడు. పేదవారికి ఆహార సదుపాయములు సమ కూరుస్తూ నిత్యం క్రమం తప్పకుండా శ్రీరామ భజన చేసేవాడు. గోపన్నను ఆ ప్రాంతం ప్రజలు తహసిల్దారు గా పిలిచేవారు. తనను అనతికాలములోనే ఆ ప్రాంత ప్రజలు ఆదరించి అతని వద్దకు వస్తుండేవారు. వారిలో "దమ్మక్క" కూడా

గోపన్నను కలిసి, గతంలో తనకు కలిగిన అనుభవాన్ని వివరించినది. వెంటనే గోపన్న భద్రాచలంను దర్శించి దేవున్ని ప్రార్థించినాడు. స్వామి దర్శనం అనంతరం పరివశించి తన మకామును భద్రాచలంకు మార్చి నిరంతరం రామున్ని కొలుస్తూ ప్రార్థించి కీర్తించినాడు. అట్టి కీర్తనలే "దాశరథీ శతకం"గా వెలువడినవి.

గోపన్న తన వద్ద వున్న ప్రభుత్వ ఖాజానా నుండి సొమ్ములు ఖర్చు చేసి శ్రీ రామ మందిరం నిర్మిస్తానని దానికి అనుమతి కావాలని నావాబును వేడుకొన్నట్లు దెలియిచున్నది. నవాబు నుండి అనుమతి రాకముందే శ్రీరామాలయ నిర్మాణానికి పూనుకొని రెండు సంవత్సరాల తక్కువ కాలంలోనే దేవాలయ ముఖ్య మందిరము, ప్రహారీలు నిర్మించి, వాహానాలు, బంగారు, వెండి ఆభరణాలు సమకూర్చినాడు. అనవసర వ్యయం నేరమౌతుంది అనే భావన కలిగిన గోపన్న కళ, అలంకరణ, శిల్పాలు వంటి వాటిపై ఒక్క రూపాయి కూడ ఖర్చు చేయకపోవడం గమనించదగిన విషయం. ప్రభుత్వ ఖజానా నుండి ముందస్తూ అనుమతి లేకుండా ఆరు లక్షల రూపాయలను వ్యయం చేసినందులకు తానీషా నవాబు శ్రీ రామదాసును నేరస్తునిగా పరిగణించినాడు. అతనిని గోల్కొండ కోటలోని బందీఖానలో 1674 నుంచి 1680 వరకు ఉంచి శిక్షించినాడు.

"చెఱసాల పాటలు"గా పిలువబడే అనేక కీర్తనలను రామదాసు చెఱసాలలో వుండి ఆలపించినాడు. చెఱసాలలో వున్న వివిధ సమయాలలో ప్రవచించిన ఇట్టి కీర్తనలు ఆంధ్రదేశములోని ప్రతిఒక్కరి నాలుకపై ఆలపింపబడుతున్నాయి.ఒక కీర్తనలో శ్రీరాములవారికి తాను పెట్టిన ఖర్చుల వివరాలను తెలియపరుస్తూ అవి తన "తండ్రి లేదా మామ నుంచి వచ్చాయా" అని ప్రశ్నించేంతవరకు వెళ్ళినాడు.

సమయం ఆసన్నమవగానే శ్రీరాముడు దేవాలయములకు సంబందించిన వ్యక్తుల వలే తానీషా పడకగదిలో ప్రత్యక్షమై పైకము చెల్లించి రసీదును తీసుకొని దానిని చెఱసాలలో నిద్రలో వున్న శ్రీరామ దాసు తలగడ క్రింద వుంచి మాయమైనారు. మరుసటిరోజు ఉదయం నిద్రలేచిన తానీషా జైలు వద్దకు పరుగెత్తి రామదాసును చెఱసాల నుండి విడిపించి, క్షమాపణలు కోరినాడు. శ్రీరాముని చేత స్వయంగా తానీషాకు చెల్లింపబడిన పైకమును తానీషా ప్రభువు రామదాసుకు తిరిగి ఇవ్వదలిచినపుడు, దానిని తిరస్కరించినాడు. తానీషాకు శ్రీరామునిచే ప్రత్యక్షంగా ఇవ్వబడిన పైకమును తాను తీసుకోవడం బావ్యం కాదని రామదాసు భావించినాడు. తదుపరి తాలూకా ప్రాంతంలో రామదాసుచే వసూలు చేయ బడుతున్న శిస్తు పైకమును దేవాలయమునకు వినిమోగించుటకు అనుమతి నిచ్చినాడు. శ్రీరామదాసు భద్రాచలంకు తిరిగి వచ్చి దేవాలయములో అత్యున్నత స్థాయి సేవలను నెలకొల్పినాడు తొందరలోనే వేల సంఖ్యలలో భక్తులు దేవాలయంవైపు అకర్షితులైనారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పర్వదినం నాడు వివిధ ప్రాంతాల నుండి చాలా మంది భక్తులు సందర్శిస్తుంటారు.

హైదరాబాద్ రెండవ నిజాం ప్రభువు మొట్టమొదటగా దేవాలయ నిర్వహణ నిమిత్తం రూ॥ 40 వేలను మంజూరు చేసినారు. తరువాత దానిని 19,465 రూ॥లకు (హైదరాబాద్ కరన్సీ) కి తగ్గించినారు. ఈ సాంప్రదాయం ఇప్పటికి అమలవుతున్నది. తానీషా కొలువులో మాదన్న ముఖ్యమంత్రిగా, అక్కన్న సైన్యాధ్యక్షునిగా వుండేవారు. వారు తానీషా ప్రభుత్వ పరిపాలనలో కీలక పాత్ర పోషించినారు అనునది జగమెరిగిన సత్యం. మద్రాసులోని ఓరియంటల్ లైబ్రరీలో అప్పటి స్థానిక రికార్డులకు చెందిన చాలా పత్రాలు ఇప్పటికి భద్రపరుచబడివున్నాయి.

"పర్ణశాల" అక్కడ వున్న ఇంకొక పుణ్యక్షేత్రం. ఇది ప్రస్తుతము భద్రాచలం శ్రీతారామ చంద్ర స్వామి దేవాలయంకు అనుభంద క్షేత్రముగా వున్నది.

చరిత్ర కారులు, రామాయణానికి సంబందించిన రచయితలు ముఖ్యంగా "ఆంధ్రా వాల్మీకి" గా పిలువబడే "వావిళ్ళకొలను సుబ్బారావు" గారు వివిధ చర్చల, అభిప్రాయల సేకరణ అనంతరం ఈ పర్ణశాల ప్రాంతమును సీతమ్మ, శ్రీరాముడు, లక్ష్మణుడు దండకారణ్యంలోనికి వనవాస నిమిత్తం వెళ్ళినపుడు వారు నివసించిన ప్రదేశంగా నిర్ణయించినారు. రావణాసురుడు సీతాదేవిని ఈ ప్రదేశం నుండే అపహరించినాడు. ఈ ప్రదేశంలో ఒక దేవాలయం కూడా నిర్మింపబడినది. ఇక్కడ గోదావరి నది అత్యంత ప్రశాంతతను కలిగి వుండి హాయినిగొల్పును మరియు ఇక్కడ గల కొండపై సీతా అపహరణ సమయంలోని రావణాసురుని రథంమొక్క చక్రాల గుర్తులను గమనించవచ్చు.

ఇక్కడకు ఆరు మైళ్ళ దూరంలో "బూడిద గ్రామం" అనే అర్థం వచ్చె "దుమ్ముగూడెం" అనే గ్రామం కలదు. సీతదేవి, శ్రీరాముడు మరియు లక్ష్మణుడు పర్ణశాల ప్రాంతంలో నివసించినపుడు "ఖర, దూషణ" అనే రాక్షసులతో జరిగిన పోరులో అట్టి రాక్షసుల ఆద్వర్యంలోని 84 వేల మంది శ్రీరాముని చేతిలో నశించడం వలన వారి బూడిదపై ఈ ప్రాంతం నిర్మాణమైనట్లు ప్రతీతి. పర్ణశాల ప్రాంతంలో గల రాతిపై నిర్మితమైన స్నానఘట్టము వద్దగల రాతిపై వివిద వర్ణాల ఆకృతులను గమనించవచ్చు. ఇక్కడ వివిద రంగులతో కూడిన చీరల రూపాలకు సంబంధించిన వివిద రంగులను ప్రతిబింబించే మృదువైన రాళ్ళు మరియు పసుపు, కుంకుమ వంటి వాటిని తలపించె రూపాలు కలవు.

పర్ణశాలకు, భద్రాచలంకు మద్యమార్గంలో యాటపాక అనే గ్రామం కలదు."జఠాయుపాక" అనే పదం మరియు " జఠాయుపైనుండి" అనే అర్థంవచ్చే పదాలనుండి ఈ గ్రామం పేరు వచ్చినది. జఠాయు పక్షి రావణునితో సీతా అపహరణ సమయంలో తన తుది శ్వాస విడిచేంత వరకు యుద్ధం చేసినది. భద్రాచలం నుండి రెండు మైళ్ళ దూరంలో గోదావరి నది పరివాహాక ప్రాంతంలో వేడినీటి చలిమెలు కలవు. అక్కడ ఏ ప్రదేశంలోనైన వంద గజాల వైశాల్యంలో గొయ్యి త్రవ్విన వేడినీరు ఉద్భవిస్తుంది. శీతాకాలంలో ఇట్టి వేడినీటి చలిమెలలో మునగడం పుణ్యం అని చాలామంది భావిస్తారు. బ్రహ్మాండ పురాణంలో చెప్పినట్లు పవిత్ర లవణరాజు (సముద్రుడు) "ఆదిశేషుడు" పంపిన పవిత్ర అగ్ని వల్ల ఇట్టి వేడి ఉద్భవిస్తుందని భావిస్తారు.

అందువల్ల ఈ ప్రదేశంను కూడా చాలామంది దర్శించుచున్నారు. కావున భద్రాచలం దాని పరిసర ప్రాంతంలో ప్రాముఖ్యమైన ప్రదేశాలు చాలా వుండి అనేక ఋషులు ఇక్కడ వారి తపస్సులు చేసుకొన్న ప్రదేశంగా భావింపబడుచున్నందున పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంత భక్తులను ఈ ప్రదేశము ఇప్పటికి ఆకర్షిస్తుంది.

గమనిక:

నేను 1992 – 1993 సంవత్సరముల ప్రాంతంలో ఖమ్మం జిల్లా భద్రాచలం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసిన కాలంలో భద్రాచలం దేవస్థానం నుండి చాలా విషయాలను సేకరించినాను. అట్టి విషయముల నుండి దీనిని సంక్షిప్త పరిచినాను.

• • •

# శ్రీ రాజరాజేశ్వర స్వామి దేశస్థానము–వేములవాడ

ఇక్కడ కొలువైన దేవదేవుడు శ్రీ రాజరాజేశ్వర స్వామి (శివలింగం) ఆంధ్రప్రదేశ్‌లోని ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతంలోని లక్షలాది భక్తులకు ఆరాధ్య దైవమైనాడు. గర్భాలయంలో కుడివైపున శ్రీ రాజరాజేశ్వరీ దేవి, ఎడమవైపున శ్రీలక్ష్మీ గణపతి, ఎదురుగా నంది వాహనంతో గర్భాలయంలో శ్రీ రాజరాజేశ్వరుడు విరాజిల్లియున్నాడు. ఇట్టి ఆలయ సన్నిధిలోనే వైష్ణవ ప్రాముఖ్యమైన శ్రీ అనంత పద్మనాభ స్వామి, శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాలు కొలువై ఉన్నాయి. ఇది శ్రీ వైష్ణవ సంస్కృతులు కలగలిసి విరాజిల్లుతున్న పురాతన పుణ్య ప్రదేశం ఐనది, అందువల్లనే ఈ క్షేత్రం "హరిహర క్షేత్రము" అను నామముతో ప్రసిద్ధి చెందినది.

ఆలయంలోగల ధర్మగుండం సంవత్సరం పొడవున నీటి ఊట కలిగి ఉంటుంది. భక్తులు ఈ కొలనులో మునిగి తడిబట్టలతో దైవదర్శనం చేసుకొని మొక్కులను చెల్లించుకుంటారు. నాగరికత విలసిల్లి తొలినాళ్ళ నుండి ఇట్టి ప్రదేశం పవిత్ర క్షేత్రంగా విలసిల్లుతున్నది. పురాణాలు కూడా ఇట్టి క్షేత్రంకు, దేవునికి సంబంధించిన విషయాలను తెలుపుచున్నవి.

**పౌరాణిక, చారిత్రిక సాక్ష్యాలు :–**

రామాయణ, మహాభారతంల కంటే ముందే వ్యాసవిరచితమైన "భవిశ్యోత్తర పురాణము"లో ఇట్టి ప్రదేశము అతి పవిత్రమైనదిగా తెలుపుచున్నది.

**శ్రీ రామ నవమి :–**

వసంత నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ నిర్వహిస్తారు. నవమినాడు శ్రీ రామ కళ్యాణం నిర్వహిస్తారు. సంగీత ప్రధాన పండుగగా శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలను పుశ్యబహుళ పంచమి నుండి మూడు రోజుల పాటు నిర్వహిస్తారు.

- ఉగాది తెలుగు సంవత్సరాది
- శంకర జయంతి 5 రోజుల పాటు
- తొలి ఏకాదశి
- దేవి నవరాత్రులు 10 రోజుల పాటు
- దీపావళి
- గీతాజయంతి 5 రోజుల పాటు

**కోడె పూజ :–**

దేశములోని ఏ ఇతర క్షేత్రాల్లో లేని విధంగా ఈ ఒక్క ఆలయంలోనే కోడె పూజగా, కోడెగా పిలువబడే "ఎద్దు" (శివుని వాహనం నంది)ను దేవునికి భక్తితో సమర్పిస్తారు. ఈ క్షేత్రములో ఇట్టి విధము ఒక ప్రత్యేకత. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన లక్షలాది భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో తమ పూజలు చేసిన తరువాత తమ కోరికలు చెల్లించినందుకు "నంది"ని చెల్లించి మొక్కు తీర్చుకుంటారు. ఈ క్షేత్రంకు సంబంధించి ఆదాయములో సగం ఆదాయం ఈ మొక్కు ద్వారా వస్తుంది.

## అనుబంధ దేవాలయం

**శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం :–**

నిర్మాణశైలి పురావాస్తు విధానాల్లో ప్రాముఖ్యమైన, పూర్తిగా రక్షింపబడుచున్న శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయములో పెద్ద భీమేశ్వర లింగం కలదు దాని పరిసరాలు ఆహ్లాదంగా, పచ్చని వాతావరణం మధ్య కలదు.

## శ్రీ బద్ది పోచమ్మ దేవాలయం :-

బద్దిగభూపతి గారిచే నిర్మించబడిన దేవాలయం ఇది. యాత్రికులు, గ్రామస్థులు ముఖ్యంగా ఆది, శుక్రవారములలో అమ్మవారికి వారి ఆరోగ్యం, సంతోషముల గూర్చి "బోనాలను" సమర్పిస్తారు.

శ్రీ నాగేశ్వర స్వామి, కేదారేశ్వర స్వామి, మహాలక్ష్మి దేవాలయములు మరియు శ్రీ వేణు గోపాల స్వామి, మండప హనుమాన్ దేవాలయం, ఉప్పుగడ్డ హనుమాన్ దేవాలయములు ఇతర ముఖ్య దేవాలయములు

ప్రతిరోజు జరిగే నిత్య పూజలతో పాటు ప్రత్యేక అర్చనలు కూడా భక్తుల కొరకు నిర్వహిస్తారు. దేవాలయమును ఉదయం 6 గం॥నుండి రాత్రి 9 గం॥ వరకు మధ్యాహ్నం మూయకుండా నిరంతరం తెరిచి ఉంచుతారు.

**గమనిక :**

నేను ఇట్టి సమాచారమును 1997 సం॥లో కోరుట్ల సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేయు కాలములో వేములవాడ దేవస్థాన రికార్డుల నుండి సేకరించినాను.

• • •

# అల్లూరి సీతారామ రాజు ఆధ్వర్యంలో ఉద్యమ చరిత్ర
## మన్యం పితూరీ యొక్క నోటు - 1922 -24 ( విశాఖపట్నం జిల్లా)

మన్యం ప్రాంతంలోని అడవి దారులు కొండలు అడుగుభాగం నుండి పీఠభూమి వరకు సముద్రమట్టానికి 3000 అడుగుల పైభాగాన మరియు సుమారు 50 మైళ్ళు సముద్రతీరం వెంబడి విస్తరించి వున్నందున సహజంగానే ఈ ప్రాంతం ఎల్లప్పుడూ కల్లోలిత ప్రాంతంగా ఉంటుంది. అందుచేత ఈ ప్రాంతం గవర్నర్ ప్రతినిధి యొక్క ప్రత్యక్ష పరిపాలనలో వున్నది.

'పితూరీ' అని పిలువబడే మన్యం తెగల తిరుగుబాట్లు 1845-48, 1857, 1879-1886, మరియు 1891 సం॥లలో వరుసగా జరుగుతూనే వున్నాయి. ఆ పోరాటాలన్నింటిలో దాదాపు ఒకే పద్ధతిని అవలంభిస్తున్నారు, ఆకస్మికంగా రెండు లేదా మూడు పోలీస్ పోస్టులపై దాడి చేసి లూటీ చేయడం, అట్టి లూటీల ద్వారా కొల్లగొట్టిన ఆయుధ సామగ్రి సహాయంతో మరియు దట్టమైన పొదలు, అడవుల కారణంగా సుదీర్ఘ కాలంపాటు పోలీసులకు పట్టుబడకుండా ప్రతిఘటించడం వారికి అలవాటుగా మారింది.

1922వ సంవత్సరంలో జరిగిన చివరి పితూరీ కూడా ఇదే కోవకు చెందినది. తప్పుడు అభియోగాలతో మన్యం నాయకుల్లో ఒకరైన వీరయ్య దొరను దేశ బహిష్కరణకు గురిచేశారనే అసంతృప్తి అక్కడి స్థానిక ప్రజల్లో నెలకొన్నది. అంతేకాకుండా, అడవుల కేటాయింపులు, రోడ్లు వేయుటకు నిర్బంధ కూలీపని మరియు అక్కడ పని చేసే యురేషియన్ (యూరప్, ఆసియా, సంతతికి చెందిన వ్యక్తి) డిప్యూటీ తహశీల్దారు పెట్టే వివిధ రకాల వేధింపులు, దుష్ప్రవర్తన పట్ల కూడా తీవ్ర అసంతృప్తితో వున్నారు.

1919వ సంవత్సరంలో ఇదే ప్రాంతంలో అనగా నర్సీపట్నం పట్టణానికి సమీపంలో అల్లూరి శ్రీరామరాజు అనే పేరుగల తెలుగు క్షత్రియుడు స్థిరపడ్డాడు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకా మొగల్లు గ్రామంలో జన్మించినాడు. అతడు రాజమండ్రి మరియు రామచంద్రాపురంలో విద్యాభ్యాసం చేసినాడు. 1922వ సంవత్సరంలో అతనికి సుమారు 25 సంవత్సరముల వయస్సు ఉండేదని చెప్పేవారు. ఆయన కఠినమైన క్రమశిక్షణతో కూడిన జీవితం గడిపినాడు. పాలు మరియు ఫలాలను ఆహారంగా స్వీకరించేవాడు. తన కొరకు ఆకర్షణీయమైన ఒక మఠాన్ని నిర్మించుకొని దానికి గాను ఒక ఉద్యాన వనాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. తాను సుదీర్ఘ కాలంపాటు ధ్యానంలో ప్రార్ధనలు చేస్తూ, దైవాంశ సంభూతుడిగా గౌరవంపబడినాడు. తన వద్దకు వచ్చిన రోగులకు సాధారణ మందులు, మూలికలు ఇవ్వడంతో తన పేరు, ప్రఖ్యాతులు విస్తరించాయి. తాను మఠాన్ని వదలి వెళ్ళిన సమయాలలో మన్యం గ్రామాలలో సంచరించడంతో అద్భుత శక్తులు కల్గిన వ్యక్తి అనే నమ్మకాన్ని అక్కడి ప్రజల్లో కల్గించినాడు.

ఎవరైతే మన్యం తెగలలో తీవ్ర అసంతృప్తి పెంపొందడానికి ముఖ్య కారకుడయ్యాడో అదే డిప్యూటీ తహశీల్దారు శ్రీ రామరాజుకు బద్ధ శత్రువుగా మారినాడు. పైన వివరించినట్లుగానే అతడు యూరప్ మరియు ఆసియా సంతతికి చెందిన వ్యక్తి (యురేషియన్) మరియు అతని దగ్గర పనిచేసేవారు నిమ్న కులస్థులు. తప్పుడు దరఖాస్తు ద్వారా శ్రీ రామరాజు తన మఠం కొరకు ఉద్యాన వనాన్ని ఏర్పాటు చేసుకొన్నాడని వారు చెప్పినారు. దాంతో డిప్యూటీ తహశీల్దారు శ్రీరామరాజును అట్టి ఉద్యాన వనాన్ని ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించినాడు. శ్రీరామరాజు అట్టి ఆదేశాలను తిరస్కరించడంతో, డిప్యూటీ తహశీల్దారు వద్ద పనిచేసే నిమ్న కులానికి చెందిన వారు అందులోని సామానులను, కుండలను బయటకు విసిరివేసినారు.

ఇది సహజంగానే మతపరంగా క్రమశిక్షణతో వుండే క్షత్రియులకు తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. అప్పటినుండి శ్రీరామరాజు మన్యం తెగలను ముఖ్యంగా డిప్యూటీ తహశీల్దారుపై ప్రతీకారేచ్ఛతో తిరుగుబాటుకు ప్రోత్సహించినట్లు కనబడినాడు. మన్యం ప్రజలందరు స్వతహాగా చాలా ఇబ్బందుల్లో వున్నందున, వారందరు శ్రీరామరాజు ప్రభావానికి లోనై ముందుకొచ్చారు.

1922 ఆగష్టు నెలలో 200 మందితో కూడిన మన్యం ప్రజలపార్టీ ముఖ్యంగా ఓజులా మరియు బగత కులానికి చెందిన వారు ఎటువంటి హెచ్చరిక లేకుండా వరుసగా మూడు రోజులలో మూడు పోలీస్ స్టేషన్‌లపై దాడి చేసి, లూటీ చేసినారు. తద్వారా కొల్లగొట్టిన తుపాకులు, తూటాలతో వారు ఆయుధులైనారు. మూడవ పోలీస్ స్టేషన్ లూటీ చేసే సమయంలో ద్వీపాంతర వాస శిక్షలో విచారణను ఎదుర్కొంటూ బందీగా వున్న వారి నాయకుడు వీరయ్య దొరను చెరనుండి కాపాడి తమ వెంటబెట్టుకొని విజయగర్వంతో మన్యంలోని వారి ఇళ్ళకు వెనుదిరిగినారు.

ప్రక్క జిల్లాలలో వున్న రిజర్వు పోలీసులను సమీకరించి, వీరయ్య దొరను తిరిగి పట్టుకొని వచ్చేందుకు, అదేవిధంగా మూడు పోలీస్ స్టేషన్లను లూటీ చేసి, వీరయ్య దొరను విడిపించుకొని వెళ్ళిన వారిని అరెస్ట్ చేసి విచారించడానికి పోలీసు పార్టీలను పంపించినారు.

అల్లూరి శ్రీరామరాజు నాయకత్వంలో అట్టి మన్యం ప్రజలందరు అడవిలోనికి వెళ్ళిపోయి రెండు సంవత్సరాల పాటు పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకున్నారు. వారు పోలీసు పార్టీలపై ఆకస్మికంగా దాడి చేసి, ఒకానొక సంఘటనలో ఇద్దరు బ్రిటిష్ అధికారులను చంపివేసినారు. పోలీసు పార్టీలకు, విప్లవకారులకు మధ్య అనేక పోరాటాలు జరగడంతో, కొంత మంది విప్లవకారులు చనిపోయినారు. మరికొందరు పట్టుబడి, విచారింపబడ్డారు.

సోదా చేయవలసిన ప్రాంతం అధికంగా వుండడం వల్ల, అది స్థానిక పోలీసులకు పెనుభారంగా మారింది. అందుచేత మొదటగా అస్సాం మిలటరీ పోలీసుల సహాయం తీసుకున్నారు.

**విప్లవ పార్టీలతో జరిగిన ప్రధాన పోరాటాలు ఈ క్రింద తెల్పబడ్డాయి.**

- 03.09.1922 నాడు ఓంజారి కొండ వద్ద పోలీసులను విప్లవకారులు కొండ చివరి వరకు తరిమివేసి, అందులో ఒక కానిస్టేబుల్‌ను చంపివేసినారు.

- 23.09.1922 నాడు దమనపల్లె కొండ వద్ద గ్రామస్థుల నమ్మక ద్రోహంతో పోలీసు పార్టీపైన ఆకస్మికంగా దాడి చేసి బ్రిటిష్ అధికారు లైన హేటర్ మరియు స్కోట్ కౌన్ ఇద్దరిని చంపివేసినారు. ఒక జమేదార్ మరియు కానిస్టేబుల్ గాయపడ్డారు.

- 06.12.1922 నాడు లింగాపురం వద్ద విప్లవకారులను చుట్టుముట్టగా ఎనిమిది మంది విప్లవకారులు చంపబడ్డారు. నలుగురు గాయపడ్డారు. చాలా ఆయుధాలు, వాటికి సంబంధించిన తూటాలు స్వాధీనం చేసుకున్నారు.

- 07.09.1923 నాడు పాలెం వద్ద జరిగిన పోరాటంలో విప్లవకారుల నాయకుల్లో ఒకరైన గాంమల్లుదొర అరెస్ట్ అయినాడు.

- 28.09.1923 నాడు కట్టిరాలొద్ది వద్ద తక్కువ మంది విప్లవకారులు కనిపించడంతో పోలీసులు వారిని వెంబడించినారు. అందులో ఒక విప్లవకారుడు గాయపడి, తర్వాత మరణించినాడు. పోలీసులకు ఎటువంటి నష్టం కలుగలేదు.

- 26.10.1923 నాడు గూడెం వద్ద విప్లవకారులు పోలీస్ క్యాంప్‌పై దాడి చేసి సెంట్రీ పోలీసును కాల్చడంతో అతడు గాయాలతో చనిపోయినాడు. పోలీసులు వారిపై తిరగబడి, తరిమివేసి ఒక విప్లవకారున్ని చంపివేసినారు.

- 01.11.1923 నాడు గూడెంనుండి ధారకొండ, నడింపల్లికి తరిమివేసిన సంఘటనలో ఒక విప్లవకారుడు హత్యగావింప బడ్డాడు. చాలా ఆయుధాలు, తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 03.11.1923 నాడు విప్లవకారులను వెంబడించిన సంఘటనలో భాగంగా కొండలాయగొంది వద్ద ఒక విప్లవకారుడు హత్య గావింపబడ్డాడు. ఒకరు బందీ అయినారు, మరొకరు గాయపడ్డారు. పోలీసులకు ఎటువంటి నష్టం కలుగలేదు. అప్పటినుండి నాలుగు నెలల పాటు విప్లవకారుల కొరకు కొండపైన, అటవీ ప్రాంతం చుట్టు ప్రక్కల వెతికినా ఎటువంటి ఫలితం కనిపించలేదు.

- 05.05.1924 నాడు కిర్రాబు వద్ద పోలీసులు విప్లవకారులపై దాడిచేసి ఇద్దరిని హత్యచేసినారు, అనేక మంది గాయపడ్డారు. విప్లవకారులలో రెండవ నాయకుడైన అగ్గిరాజును ప్రాణాలతో పట్టుకున్నారు. ఒక కానిస్టేబుల్ గాయపడ్డాడు.

- 07.05.1924 నాడు సిడిపాలెం సమీపంలో అడవిలో తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించిన విప్లవకారుల నాయకుడిని ప్రాణాలతో పట్టుకున్నారు. అతన్ని కొయ్యూరు క్యాంపుకు తీసుకొని పోయినారు. అదేరోజు సాయంత్రం అతడు క్యాంపు నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించగా కాల్చి చంపినారు. పోలీసులకు ఎటువంటి నష్టం కలుగలేదు.

- 25.05.1924 నాడు కినపర్తి వద్ద పోలీసులకు విప్లవకారుల పార్టీ కనిపించగా, ఒకరిని హత్య చేసినారు, మరొకరు గాయపడ్డారు. పోలీసులకు ఎటువంటి నష్టం కలుగలేదు

- 07.06.1924 నాడు సింగదార వద్ద పోలీసులు విప్లవకారుల పార్టీపై ఆకస్మికంగా దాడిచేసి, వారి నాయకుల్లో ఒకరైన గాం గంటన్న దొరను, మరొకరిని చంపివేసినారు. మరొక వ్యక్తి పట్టుబడ్డాడు. వారియొక్క ఆయుధాలు, తూటాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ఎటువంటి నష్టం కలుగలేదు.

ఆ తరువాత విప్లవకారులంతా చెల్లా చెదురైపోయారు. వారందరిని అటుపిమ్మట కొందరిని వారి ఇళ్ళ వద్ద, మరికొందరిని వారు దాగున్న ప్రదేశాలలో అరెస్ట్ చేసినారు. 94 మంది తెలిసిన విప్లవకారుల పేర్లను రికార్డులలో నమోదుచేసినారు. అందులో 8 మందిని మినహాయించి, మిగిలిన వారిని పై పోరాటాలకు బాధ్యులను చేసినారు. మినహాయించిన ఎనిమిది మంది అంత ప్రాధాన్యం లేని వారు కావడంతో, వారిపై పెట్టిన కేసులను 1926 వ సంవత్సరంలో ఎత్తివేసినారు.

**వారి పేర్లు :**

1. కూడ చిన్నయ, కె.డి.పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకుపాలెం H/O అడ్డాకుల గ్రామ నివాసి.
2. కూడ భూపియ, కె.డి.పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకుపాలెం H/O అడ్డాకుల గ్రామ నివాసి.
3. తిరునగిరి గడ్డయ్య, ఒకటవ బిడ్‌లోని మాద్రం గ్రామ నివాసి.
4. పాగి వెంకియ, ఒకటవ డిడ్ నందలి తొట్లూరు అంతాడ ముత్త సమీపంలోని కొప్పుకొండ నివాసి.
5. మట్టడం బోగి దొర, చింతపల్లిలోని డొక్కులూరు H/O గూడెం నివాసి.
6. పొట్టిరేసు మల్లయ్య @ పొట్టూరు మల్లయ్య, చప్రాటి పాలెం పెద్దవలస ముత్త నివాసి.
7. కంకిపాటి నడిపి పడాల్, పెద్దవలస ముత్త నివాసి.
8. బోడి యెండయ్య, గూడెం నివాసి.

పై వ్యక్తులలో ఒకరు, మరొక ముగ్గురు ఏదో ఒక పోరాటంలో చంపబడ్డారని సమాచారం ఉంది. కానీ, ఖచ్చితమైన ఆధారాలు లేవు. మిగతావారు రంగూన్‌కు వలస వెళ్ళినట్లు వదంతులు వున్నాయి.

**ఈ పోరాటాలకు బాధ్యులైన గుర్తింపు పొందిన నాయకులు :**

1. అల్లూరి శ్రీరామరాజు.
2. వేగిరాజు నారాయణరాజు @ అగ్గిరాజు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకా కుమరవిల్లి నివాసి.
3. గాం గంటన్న దొర, నడింపాలెం నివాసి.
4. గాం మల్లు దొర, నడింపాలెం నివాసి.
5. బంకుల మాదిగాడు, చింతలపూడి నివాసి.
6. గోకరి యెర్రేసు, గానర్లపాలెం నివాసి.
7. కంకిపాటి యెండు పడాల్, పెద్దల వలస నివాసి
8. సంకోజి మూగడు, సింగన్నపల్లి నివాసి.

పై వారిలో మొదటి ఇద్దరు తప్ప మిగిలిన వారంతా గిరిజన తెగలకు చెందినవారు. వీరంతా నర్సీపట్నం చుట్టు ప్రక్కల మన్యం గ్రామాల నివాసులు.

విప్లవ నాయకుడైన అల్లూరి శ్రీరామరాజు తేది 07.05.1924 నాడు హతుడైనాడు. వేగిరాజు నారాయణరాజు జైల్లోవున్నారు. మిగిలిన వారిలో కొంత మంది హత్యగావింపబడినారు, మరికొందరిని జైల్లో వుంచారు.

సం.
జిల్లా పోలీసు సూపరింటెండెంట్
విశాఖపట్నం

**గమనిక –**

ఈ నోటును అప్పటి SHO చింతపల్లి PS రికార్డులో విదేశీ ప్రభుత్వాధికారి అల్లూరిని ఒక తీవ్ర వాదిగా భావిస్తూ ఇంగ్లీషులో వ్రాసినది, దానికి అనువాదం ఇది. ఈ నోటును 1993 వ సంవత్సరంలో నేను ఖమ్మం జిల్లా భద్రాచలం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా పని చేయుచున్న సమయంలో విశాఖపట్నం జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించినపుడు సేకరించడం జరిగింది.

# అల్లూరి సీతారామ రాజు అధ్వర్యంలో చింతపల్లి పోలీసు స్టేషన్ ముట్టడి

తేది 22.8.1922 నాడు మద్యాహ్నం సుమారు 12.00 గం॥లకు అల్లూరి శ్రీరామరాజు నాయకత్వంలో అతని అనుచరులు దాస్ గన్ను మల్లుడు, కంకయ్య శరభన్న పడాల్, గబలం సూరిగాడు, మామిడి చిన్నయ్య, అగ్గి వీరయ్య దొర మరి కొందరు కలిసి గొడ్డళ్ళు మరియు 'SBML' ఆయుధాలతో చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించినారు. సెంట్రీ కానిస్టేబుల్‌ను మరియు వేచివున్న ఇతర కానిస్టేబుళ్ళను స్టేషన్‌లోని స్థంబాలకు బంధించి, ఆయుధాగారాన్ని పగులగొట్టి అందులోవున్న సుమారు 1400 తూటాలను, 12 కార్బైన్ తుపాకులను ఎత్తుకెళ్ళి పోయినారు. మలివిడత జరిగిన పితూరీ తిరుగుబాటులో పితూరీ దొరచే లూటీ చేయబడిన మొదటి పోలీస్ స్టేషన్ ఇదే కావడం గమనార్హం. ఈ పితూరీ 1924 వ సం॥లో ముగిసింది.

1914వ సంవత్సరం కన్నా ముందు చింతపల్లి యందు సుమారు 50 మంది పోలీసులు స్టేషన్ కాపలా కొరకు ఉండేవారు. దానిని ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది.

1924వ సం॥లో పితూరీ ముగిసిన తరువాత, చింతపల్లి నందు ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్ళు స్టేషన్ కాపలాగా వుంటున్నారు. పోలీస్ స్టేషన్ రక్షణకు గదిలో తుపాకీతో పేల్చడానికి అనువుగా 12 గవాక్షాలను నిర్మించినారు. మలేరియా నివారణ చర్యలు, లంబసింగి నుండి చింతపల్లి వరకు మరియు పెద్ద వలస నుండి లోతుగడ్డ వరకు రోడ్ల నిర్మాణం మరియు ప్రధాన కార్యాలయ భవనాల నిర్మాణం పనులు జరుగుచున్నవి.

చింతపల్లి నందు ప్రతి బుధవారం నాడు సంత జరుగుతూ ఉంటుంది. నర్సీపట్నానికి చెందిన వర్తకులు బియ్యం, ఉప్పు, మిరపకాయలు, కిరసనాయిలు, చేపలు మొదలగు వాటిని తీసుకొని వచ్చి వాటి స్థానంలో మన్యంలో పండించే చింతపండు, జరూరీ, పిప్పళ్ళు, కాఫీ గింజలు మొదలగు వాటిని మన్యం ప్రజల నుండి తీసుకునేవారు.

సం.
ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్

**గమనిక –**

ఈ నోటును అప్పటి SHO చింతపల్లి PS రికార్డులో విదేశీ ప్రభుత్వాధికారి అల్లూరిని ఒక తీవ్ర వాదిగా భావిస్తూ ఇంగ్లీషులో వ్రాసినది, దానికి అనువాదం ఇది. ఈ నోటును 1993 వ సంవత్సరంలో నేను ఖమ్మం జిల్లా భద్రాచలం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా పని చేయుచున్న సమయంలో విశాఖపట్నం జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించినపుడు సేకరించడం జరిగింది.

• • •

# భగవద్గీత
## (గాంధీజీ ఆత్మ కథ నుండి)

ఆంగ్లదేశంలో ఉన్నప్పుడు నాకు ఇద్దరు దివ్యజ్ఞాన సామాజాకులతో పరిచయం ఏర్పడింది. వారు సోదరులు, అవివాహితులు. భగవద్గీత చదవమని నన్ను ప్రోత్సహించారు. ఆ ఇద్దరూ సర్ ఎడ్విన్ ఇర్నాల్డుగారి అనువాదాన్ని చదువుతున్నారు. తమతో కలిసి సంస్కృత గీత చదవడానికి రమ్మని నన్ను ఆహ్వానించారు. నేనేమో అప్పటి దాకా భగవద్గీత చదవలేదు. సిగ్గుగా అనిపించింది. కనీసం గుజరాతీ అనువాదాన్నయినా చదవాల్సింది. సంకోచింస్తూనే ఆ విషయం చెప్పాను. నాకు సంస్కృతం అంత బాగా రాదు. అయితే మూలానికీ అనువాదానికీ తేడా వస్తే మాత్రం గుర్తించగలనని స్పష్టం చేశాను. ఆ తర్వాత గీత పారాయణం ప్రారంభమైంది. ద్వితీయ అధ్యాయంలో రెండు శ్లోకాలున్నాయి.

**ధ్యాయతో విషయన్ పుంస:**
**సంగస్తే షూపజీయతే!**
**సంగాత్సంజీయతే కామ:**
**కామాత్ క్రోధోభిజాయతే**
**(సాంఖ్యయోగం - శ్లోకం 62)**
**క్రోధోద్భవతి సమ్మోహ:**
**సమ్మోహత్ స్మ ృతి విభ్రమ:**
**స్మ ృతి భ్రంశాద్బుద్ధినాశో**
**బుద్ది నాశాత్ ప్రణశ్యతి**
**(సాంఖ్యయోగం - శ్లోకం 63)**

ఐహిక విషయాల గురించి ఇప్పుడూ ఆలోచిస్తూ ఉంటే, వాటి పట్ల ఆకర్షణ కలుగుతుంది. ఆకర్షణ వల్ల కోరికపుడుతుంది. కోరిక వల్ల కోపం పుడుతుంది. కోపం వల్ల అవివేకం ఆవహిస్తుంది. అవివేకం వల్ల మతి భ్రమిస్తుంది. ఫలితంగా బుద్ధి నశిస్తుంది. బుద్ధినశిస్తే సమస్తం నాశనమైనట్టే.

ఈ రెండు శ్లోకాలూ మనసులో నాటుకు పోయాయి. ఇప్పటికీ అవి నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. భగవద్గీత అమూల్యమైన గ్రంథమన్న విశ్వాసం రోజురోజుకూ నాలో బల పడసాగింది. మనసు చెదిరినప్పుడు భగవద్గీత నాకెంతో సహాయం చేసింది. అప్పట్లో ఆ దివ్యజ్ఞాన మిత్రులతో కలసి గీత చదివానే కానీ, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నానని కచ్చితంగా చెప్ప లేను. ఆ తర్వాత కొంతకాలానికి గీత నాకు నిత్యపారాయన గ్రంథం అయింది.

• • •

# 18 – తరాలు – అంతరాలు

**(మార్క్ విక్టర్)**

తండ్రికొడుకుల మనోభావాలు ఎలా ఉంటాయనే విషయంపై మార్క్‌విక్టర్ అనే సైకాలజిస్టు చక్కని పరిశోధన చేసాడు. ఎందరో తండ్రులను, కొడుకులను కలిసాడు. చాలాదేశాలు పర్యటించాడు. తన పరిశోధనను విశ్లేషించి చక్కని గ్రంథం కూడా రాసాడు. అది కొడుకులందరూ చదవాలని అన్ని పత్రికలు చక్కని విమర్శలు రాసాయి అందులో ఒక చాప్టరులో అబ్బాయిలు ఎలా ఆలోచిస్తారో ఇచ్చిన పట్టిక చదవండి. ఏ వయసులో ఏఏ డైలాగులు ఉంటాయి చూడండి.

4 ఏళ్ళు : మా డాడీ గ్రేట్.

6 ఏళ్ళు : మా డాడీకి అందరూ తెలుసు.

8 ఏళ్ళు: మా డాడీకి అన్నీ తెలుసు.

10 ఏళ్ళు : మా డాడీ మంచివాడే కానీ కోపం ఎక్కువ.

12 ఏళ్ళు : నా చిన్నప్పుడు డాడీ నాతో బావుండేవాడు.

14 ఏళ్ళు : మా డాడీ పెద్దవుతున్నకొద్దీ చాదస్తం పెరుగుతోంది.

16 ఏళ్ళు : మా డాడీకి ప్రస్తుతం లోకం పరిస్థితి తెలీదు.

18 ఏళ్ళు : మా డాడీకి తిక్క బాగా ఎక్కువవుతోంది.

20 ఏళ్ళు : అబ్బ, ఈయన్ని భరించడం కష్టం. అమ్మ ఎలా వేగుతుందో.

25 ఏళ్ళు : డాడీ ప్రతిదానికీ అడ్డంపడుతున్నాడు.

30 ఏళ్ళు : మా అబ్బాయితో వేగడం కష్టంగా ఉంది. డాడీ అంటే నేను చిన్నప్పుడు ఎంత భయపడేవాడిని.

35 ఏళ్ళు : డాడీ నన్ను ఎంత క్రమశిక్షణగా పెంచారు. నేను అలా ఉండాలి.

40 ఏళ్ళు : మా అబ్బాయికి డాడీచేత చెప్పిస్తేనేకానీ వాడు నామాట వినేలా లేడు.

45 ఏళ్ళు : అసలు మా నాన్నగారు మమ్మల్ని ఎలా పెంచి పెద్దచేసారో తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

50 ఏళ్ళు : మా నాన్నగారు మాకోసం ఎన్నికష్టాలు పడ్డాడో. నేను ఒక్క కొడుకుతోనే వేగలేకచస్తున్నాను.

55 ఏళ్ళు : మా నాన్నగారు దూరదృష్టితో మాకోసం ఎంతో చేసారు. ఇటువంటి తండ్రి ఎక్కడా ఉండడు.

60 ఏళ్ళు : మా డాడీ గ్రేట్.

అంటే మళ్ళీ మొదటికి రావడానికి 56 ఏళ్ళు పట్టింది కాబట్టి, మధ్యలోనే తెలుసుకోవాలంటారు మార్క్‌విక్టర్. ఏ తండ్రీ తన కొడుకుని లేదా కూతురుని అకారణంగా విమర్శించడు. తన బిడ్డ అద్భుతాలు సాధించాలనీ, అందరిలో తన పేరు నిలబెట్టాలనీ మనసా, వాచా కర్మణా కోరుకుంటాడు.

కానీ ఈకాలంలో కొందరు పిల్లలు తల్లిదండ్రులను మానసికంగా ఎంతో క్షోభకు గురిచేస్తున్నారు. తల్లిదండ్రులకు భయపడి ఆత్మహత్యలు చేసుకునే పిల్లలకన్నా పిల్లలకు భయపడి అటు చావలేక, ఇటు బతకలేక, బతికుండి రోజు చస్తున్న తల్లిదండ్రులెందరో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టుల వద్ద చికిత్స పొందుతున్నారు. తమ పిల్లవాడు కాలేజీ చదువులకు ఎగనామం పెట్టి, దుర్వ్యసనాలకు బానిస అవడం వల్ల, ఒకవ్యక్తి సమాజానికి ఏం సమాధానం చెప్పాలోనని భయపడి ఆత్మహత్య చేసుకున్న ఉదంతం నాకు తెలుసు.

• • •

# తెలుగు భాష - పద్యసాహిత్యం

తేనెలొలికే తీయని వినసొంపైన తెలుగు భాష దేశవిదేశాలలో ఉన్న తెలుగువారందరికి మాతృభాష. యూరపు దేశాల్లో ఇటలీ భాష ఎంత ప్రసిద్ధమైందో, ఆసియా ఖండంలో తెలుగు అంత ప్రశస్తమైంది. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' గా తెలుగుకు పేరు. సంగీతానికి తెలుగుభాష ఎంతగానో అమరుతుంది. భారతీయ భాషలలో హిందీ తర్వాత తెలుగే ఎక్కువ మంది మాట్లాడుతారు.

శ్రీకృష్ణదేవరాయలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అనడమేకాదు, తన సామ్రాజ్యంలో రాజభాష చేసి కేవలం సంగీత, సాహిత్యాలకే పరిమితం కాకుండా రాజ్యపాలనా వ్యవహారాలకు అనువైన భాషగా గుర్తించారు.తెలుగు లిపి ముత్యాల కోవవలె వుంటుంది. ఈ లిపి చాలా ప్రాచీనమైంది.

ఆంధ్రదేశాన్ని పాలించిన శాతవాహనుల నుంచి ఇక్ష్వాకులు పల్లవులు, చోళులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సార్వభౌముల కాలం దాకా తెలుగే రాజభాష. ఆ భాషలోనే శాసనాలు చెక్కారు. అయితే కొందరు రాజుల కాలం లో లిపిలో కొంత మార్పు కనిపిస్తుంది. బ్రహ్మీలిపి క్రీస్తు పూర్వం ఆరేడు శతాబ్దాలకు ముందే ప్రచారంలో ఉందని బుద్ధుని, మహావీరుని శాసనాల ద్వారా తెలుస్తుంది.దక్షిణ బ్రహ్మిలిపి నుంచి ప్రస్తుతం మన తెలుగుదేశంలో, దక్షిణాపథంలో వున్న లిపులు పుట్టాయి.

నన్నయకు పూర్వం శాసనాల్లో కావ్యభాషా శైలి కనిపిస్తుంది. శతకాలు, కీర్తనలు మొదలగు ప్రక్రియలలో కావ్యభాషకు వ్యావహారిక భాష కూడా తోడైంది. వ్యవహార ఆవశ్యకతను అనుసరించి వాడుకభాష పెరుగుతూ వచ్చింది.

అక్షర స్వరూపం ముద్రణ యంత్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత పూర్తిగా స్థిరపడి పోయింది. తెలుగు పుస్తకం - క్రైస్తవుల ప్రార్థన గ్రంథం - 1746లో ఓం ప్రథమంగా జర్మనీలోని హాలీ నగరంలో ముద్రించారు. మద్రాసుకు ముద్రణ యంత్రం 1772లో వచ్చింది. అక్కడ మొట్టమొదటిసారి అచ్చయిన తెలుగు పుస్తకం తెలుగు వ్యాకరణం.

1913లో కొండా వెంకటప్పయ్య పంతులు గారు బాపట్లలో జరిగిన ప్రథమ ఆంధ్రమహాసభలో మాతృభాషగా తెలుగు వైశిష్ట్యాన్ని విపులీకరించారు.

గురజాడ అప్పారావు గారు, వ్యావహారిక భాషావాదాన్ని లేవదీసి కృతకృత్యులయ్యారు. సంఘ సంస్కర్తగా రచయితగా కందుకూరి వీరేశలింగం పంతులు (క్రీ.శ.1948-1919) గారు ఆధునిక ఆంధ్రలోకానికి నవల జీవిత చరిత్ర లాంటి విన్నూత్న ప్రక్రియలు రుచి చూపారు.

1964లో తిరుపతి విశ్వవిద్యాలయం ఆవరణలో ప్రసిద్ధ కవి పింగళి లక్ష్మీకాంతం ఆధ్వర్యాన జరిగిన గోష్ఠిలో మాతృభాషేతర గ్రంథాలు సమస్తం ఆధునిక ప్రామాణిక భాషతో వ్రాయించాలని నిర్ణయించడం, అంచెలవారీగా స్నాతకోత్తర స్థాయి దాకా వివిధ విశ్వవిద్యాలయాలు తెలుగు మాధ్యమికం ప్రవేశపెట్టడంతో పాటుగా ఆధునిక తెలుగును కూడా ప్రవేశపెట్టాయి.ఇదిలా వుండగా 1966లో తెలుగును అధికార భాషగా అమలు చేస్తూ చట్టం చేశారు. ఉద్యోగాలలో కూడా తెలుగు భాషకు అదనంగా ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి.

## పద్యసాహిత్యం

తెలుగు సాహిత్య ప్రపంచంలో మొట్టమొదటి తెలుగు గ్రంథం – మహాభారతం. క్రీ.శ. 1022 – 1063 మధ్యకాలంలో రాజమహేంద్రవరం రాజధానిగా పాలించిన చాళుక్య మహారాజు రాజరాజ నరేంద్రుని కోరిక మేరకు నన్నయ మహాభారత రచన ప్రారంభించాడు.

అసంపూర్తిగా మిగిలిపోయిన ఆంధ్ర మహాభారతాన్ని నన్నయ తర్వాత రెండువందల సంవత్సరాలకు తిక్కన పదిహేను పర్వాలు పూర్తిచేశాడు. ఆపైన యాభై సంవత్సరాలకు నన్నయ వదలిన అరణ్యపర్వశేషం ఎఱ్ఱాప్రగడ పూరించాడు.

కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవు లనేకుల్ చూచుచుండన్ మదో
ద్ధు రుడై ద్రౌపది నిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘు ని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ అవి నాస్వాదింతు ఉగ్రాకృతిన్.

– నన్నయ

క్రీస్తుశకం 1380 – 1445 మధ్యకాలంలో కవిసార్వభౌముడు శ్రీనాథమహాకవి రచించిన శృంగార నైషధం, హరవిలాసం, కాశీఖండం, తెలుగు సరస్వతికి అమూల్యాలంకారాలు.

జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశభాషలందు తెలుగు లెస్స
జగతి తల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చు టాడుబిడ్డ మేలు గాదె?

– శ్రీనాథ మహాకవి

భాగవతంలో 'మందార మకరంద మాధుర్యమున తేలు' మేలు కవితలల్లి తెలుగువారి అభిమానం చూరగొన్న మహాకవి పోతన.

మందార మకరందమాధుర్యమున దేలు
  మధుపంబు వోపునే? మదనములకు;
నిర్మల మందాకినీ వీచికల దూగు
  రాయంచ చనునె తరంగిణులకు;?
లలితరసాల పల్లవఖాది యై చొక్కు
  కోయిల సేరునే? కుటజములకు;
పూర్ణేందు చంద్రికా స్ఫురితచకోరక
  మరుగునే? సాంద్రనీహారములకు;
అంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృత పాన విశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు ?
వినుతగుణశీల! మాటలు వేయునేల.

స్వయాన మహాకవి అయిన శ్రీకృష్ణదేవరాయల యుగం క్రీస్తుశకం 1503 – 1530 మధ్యకాలం తెలుగు భారతికి స్వర్ణయుగం. ఈయన ఆస్థానంలోని అష్టదిగ్గజాలలో ప్రథముడు అల్లసాని పెద్దన. 'మనుచరిత్ర'ను రచించిన పెద్దన ఆంధ్రకవితా పితామహుడుగా పేరుగాంచాడు. రాయల సభా భవనం పేరు – భువన విజయం. ఇందులో ఎనిమిది దిక్కులలో దిగ్గజాల వంటి మహాకవులు ఆసీనులై కవితా గోష్ఠులు చేసేవారట.

తెలు  గదేల యన్న దేశంబు తెలు  ; గేను
తెలుగువల్లభుండ తెలుగొ కండ
యెల్ల నృపులు గొలువ నెఱుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స!

– శ్రీ కృష్ణదేవరాయలు

గురజాడ అప్పారావు (క్రీ.శ. 1863 – 1915) 'ముత్యాల సరాలు' లాంటి దేశి ఛందస్సులు చేపట్టి ప్రజలకు కవిత్వాన్ని చేరువచేశాడు. 'దేశమంటేమట్టికాదోయ్' అన్న ఒక్క కవిత చాలు గురజాడ సృజన పరికించడానికి.

రాయప్రోలు సుబ్బారావు ' ఏ దేశ మేగినా ఎందుకాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని' లాంటి దేశభక్తి పూరిత రమ్య కవిత లల్లారు.

"ఎంకి–నాయుడు" బావల ముగ్ధ ప్రణయాన్ని పసందుగా ప్రపంచానికి చాటినకవి నండూరి సుబ్బారావు. జాషువా "గబ్బిలం" వ్రాసి నవయుగకవి చక్రవర్తి అనిపించుకున్నారు. కరుణశ్రీ జంధ్యాల పాపాయ్య శాస్త్రి "కుంతి కుమారి" లాంటి శీర్షికలతో సకల జనాదరణ పొందిన పద్యరత్నాలతో ఎన్నో ఖండ  కావ్యాలు వ్రాశారు.

నే నొక పూలమొక్క కడ నిల్చి, చివాలున కొమ్మ వంచి, గో
రానెడు నంతలోన విరులన్నియు జాలిగ నోళ్ళు విప్పి మా
ప్రాణము దీతువా యనుచు బావురుమన్నవి; క్రుంగిపోతి: నా
మానసమం దెదో తళుకు మన్నది పుష్పవిలాప కావ్యమై

ఆయువు గల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవతల్లి జా
తీయత దిద్ది తీర్తుము; తదీయ కరమ్ములలోన స్వేచ్ఛమై
నూయెల లూగుచున్ మురియుచుందుము; ఆయువు తీరినంతనే
హాయిగ కన్ను మూసెదము ఆయమ చల్లని కాలివ్రేళ్లపై

గాలిని గారవింతుము సుగంధము పూసి; సమాశ్రయించు భృం
గాలకు విందు చేసెదము కమ్మని తేనెలు; మిమ్ముబోంట్ల నే
త్రాలకు హాయి గూర్తుము; స్వతంత్రుల మమ్ముల స్వార్థబుద్ధితో
తాళుము; త్రుంపజూడకుము; తల్లిని బిడ్డకు వేరు సేతువే!

ఊలు దారాలతో గొంతు కురి బిగించి
గుండెలో నుండి సూదులు గ్రుచ్చి కూర్చి
ముడుచుకొందురు ముచ్చటముడుల మమ్ము
అకట! దయలేనివారు మీ యాడువారు.

మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ
జీవిత మెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయె; మా
యౌవన మెల్ల కొల్లగొని ఆపయి చీపురుతోడ చిమ్మి మ
మ్మావల పారబోతురు గదా! నరజాతికి నీతి యున్నదా!

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు;
సహజమగు ప్రేమ నీలోన చచ్చె నేమి?
అందమును హత్యచేసెడి హంతకుండ!
మైలపడిపోయెనోయి! నీ మనుజ జన్మ.

**– కరుణశ్రీ**

"వస్తున్నాయ్ వస్తున్నాయ్ జగన్నాథుని రథచక్రాల్" అంటూ ఎలుగెత్తి చాటి – "మహాప్రస్థానం"తో పాత కవిత్వంపై ధ్వజమెత్తి, అభ్యుదయ కవితకు యుగకర్త అయ్యాడు శ్రీరంగం శ్రీనివాస రావు.

పొలాలనన్నీ,
హలాలదున్నీ,
ఇలాతలంలో హేమం పిండగ–
జగానికంతా సౌఖ్యం నిండగా–
విరామ మెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలికావించే,
కర్షక వీరుల కాయం నిండా
కాలువకట్టే ఘర్మ జలానికి,
ఘర్మ జలానికి.
ధర్మ జలానికి,
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్ !
నరాల బిగువూ,
కరాల సత్తువ
వరాలవర్షం కురిపించాలని,
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని–
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనిక స్వామికి దాస్యం చేసే,
యంత్రభూతముల కోరలు తోమే,
కార్మిక వీరుల కన్నుల నిండా
కణ కణ మండే,
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్ !

నిరపరాధులై దురదృష్టంచే
చెరసాలలలో చిక్కేవాళ్ళూ-
లోహ రాక్షసుల పదఘట్టనచే
కొనప్రాణంతో కదలేవాళ్ళూ-
కష్టంచాలక కడుపుమంటలే
తెగించి సమ్మెలు కట్టేవాళ్ళూ-
శ్రమ నిష్ఫలమై,
జని నిష్ఠురమై,
నూతిని గోతిని వెద కేవాళ్ళూ-
అనేకులింకా అభాగ్యులంతా,
అనాథులంతా
అశాంతులంతా
దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్ !

కావున-లోకపుటన్యాయాలూ,
కాల్చేఆకలి, కూల్చే వేదన,
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే
బాటలు తీస్తూ,
పాటలు వ్రాస్తూ,
నాలో కదలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కల్యాణానికి,
శ్రామిక లోకపు సౌభాగ్యానికి,
సమర్పణంగా
సమర్చనంగా-
త్రిలోకాలలో
త్రికాలాలలో,
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని
కష్టజీవులకు,
కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ,
స్వస్తివాక్యములు సంధానిస్తూ,
స్వర్ణవాద్యములు సంరావిస్తూ-
వ్యథార్త జీవిత యథార్థ దృశ్యం
పునాదిగా ఇక జనించబోయే
భావివేదముల జీవనాదములు
జగత్తుకంతా చవులిస్తానోయ్ !

కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం,
జాలరి పగ్గం,
సాలెల మగ్గం,
శరీరకష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు
నా వినుతించే,
నా విరుతించే,
నా వినిపించే నవీన గీతికి,
నా విరచించే నవీనరీతికి,
భావం !
భాగ్యం !
ప్రాణం !
ప్రణవం.

– శ్రీ శ్రీ

## దేశచరిత్రలు

ఏ దేశచరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.

నరజాతి చరిత్ర సమస్తం
పరస్పరాహరణోద్యోగం :
నరజాతి చరిత్ర సమస్తం
రణరక్త ప్రవాహసిక్తం.

బీభత్సరస ప్రధానం,
పిశాచగణ సమవాకారం !
నరజాతి చరిత్ర సమస్తం
దరిద్రులను కాల్చుకుతినడం.

బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు ;
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధి కెక్కిరి.
రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు !
గతమంతా తడిసె రక్తమున,
కాకుంటే కన్నీళులతో.

చల్లారిన సంసారాలూ,
మరణించిన జన సందోహం,
అసహాయుల హాహాకారం
చరిత్రలో మూలుగుతున్నవి.
వైషమ్యం, స్వార్థపరత్వం,
కౌటిల్యం, ఈర్ష్యలు, స్పర్థలు,
మాయలతో మారు పేర్లతో
చరిత్రగతి నిరూపించినవి.

జెంఘిజ్ ఖాన్, తామర్లేనూ,
నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ,
సికందరో ఎవడై తేనేం?
ఒకొక్కడూ మహాహంతకుడు.

వైకింగులు, శ్వేతహూణులూ,
సిధియన్లూ, పారశీకులూ,
పిండారులు, థగ్గులు కట్టిరి
కాలానికి కత్తుల వంతెన.
అజ్ఞానపు టంధయుగంలో
ఆకలిలో, ఆవేశంలో –
తెలియని ఏ తీవ్రశక్తులో
నడిపిస్తే నడిచి మనుష్యులు

అంతా తమ ప్రయోజకత్వం,
తామే భువి కధినాధులమని,
స్థాపించిన సామ్రాజ్యాలూ,
నిర్మించిన కృత్రిమచట్టాల్

ఇతరేతర శక్తులు లేస్తే
పడిపోయెను పేక మేడలై !
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను.

చిరకాలం జరిగిన మోసం,
బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా ! ఇక పై చెల్లవు.

ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ,
ఒక జాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా ? ఇక పై సాగదు.

చీనాలో రిక్షావాలా,
చెక్ దేశపు గనిపనిమనిషీ,
ఐర్లాండున ఓడ కళాసీ,
అణగారిన ఆర్తులందరూ–

హోటెన్‌టాట్, జూలూ, నీగ్రో,
ఖండాంతర నానా జాతులు
చారిత్రక యథార్థతత్త్వం
చాటిస్తా రొక గొంతుకతో.

ఏ యుద్ధం ఎందుకు జరిగెనొ ?
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో?
తారీఖులు, దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం.

ఈ రాణీ ప్రేమ పురాణం,
ఆ ముట్టడికైన ఖర్చులూ,
మతలబులూ, కై ఫీయతులూ
ఇవి కావోయ్ చరిత్రసారం.

ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు !
దాచేస్తే దాగని సత్యం.

నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవన మెట్టిది ?
తాజమహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు ?

సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహసమెట్టిది ?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్,
అది మోసిన బోయీలెవ్వరు ?

తక్షశిలా, పాటలిపుత్రం,
మధ్యధరా సముద్రతీరం,
హరప్ప, మొహెంజొదారో,
క్రో – మాన్యాన్ గుహాముఖాల్లో –

చారిత్రక విభాతసంధ్యల
మానవకథ వికాసమెట్టిది ?
ఏ దేశం ఏ కాలంలో
సాధించిన దే పరమార్థం ?

ఏ శిల్పం? ఏ సాహిత్యం?
ఏ శాస్త్రం? ఏ గాంధర్వం?
ఏ వెల్గుల కీ ప్రస్థానం?
ఏ స్వప్నం? ఏ దిగ్విజయం?

**– శ్రీ శ్రీ**

"నాగార్జున సాగరం" గేయ కావ్యంతో ప్రారంభించి "ప్రపంచ పదులు", "సినారెగజళ్లు" దాకా డాక్టర్ సి. నారాయణ రెడ్డి ఎన్నో పోకడలు పోయారు. విశ్వనాథ తర్వాత జ్ఞానపీఠ్ అవార్డు వీరి "విశ్వంభర" వచన కావ్యానికి లభించింది.

'ఆంధ్ర పత్రిక', భారతి' వంటి పత్రికల చేయూతతో సాహిత్య పునరుజ్జీవానికి పాటుపడిన వాడు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు.

వ్యంగ్య వైభవంతో కూడిన ప్రహసనాలు చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు, వ్యాసాలు పానుగంటి లక్ష్మీనరసింహరావు వ్రాయగా, హాస్యంతో మనసును ఉల్లాసపరిచే రచనలు భమిడిపాటి కామేశ్వర రావు, మునుమాణిక్యం నరసింహరావు వ్రాశారు. సెటైర్ వ్రాయడంలో ముళ్లపూడి వెంకట రమణ పేరు పొందారు.

ఇంకా కొన్ని పద్యసాహిత్య మణిదీపాలు :

అడిగెద నని కడుపడి జను;
నడిగిన దను మగుడు నుడుగ నడని నడ యుడుగున్;
వెడవెడ సిడిముడి తడబడ
నడుగిడు నడు గిడదు జడిమ నడుగిడు నెడలన్

– పోతన

తల్లి గర్భమునుండి ధనము తే డెవ్వండు
వెళ్ళిపోయెడి నాడు వెంటరాదు
లక్షాధికారైన లవణ మన్నమె కాని
మెఱుగు బంగారంబు మ్రింగ బోడు
విత్త మార్జన చేసి విఱ్ఱవీగుటె కాని
కూడ బెట్టినసొమ్ము కూడ రాదు
పొందుగా మఱుగైన భూమిలోపల బెట్టి
దాన ధర్మము లేక దాచి దాచి

తుదను దొంగల కిత్తురో దొరల కవునొ
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు,
భూషణ వికాస! శ్రీ ధర్మపురి నివాస!
దుష్ట సంహార! నరసింహ! దురితదూర!

ధరణిలో వేయేండ్లు తనువు నిల్వగ బోదు
ధన మెప్పటికి శాశ్వతంబు గాదు
దాన సుతాదులు తన వెంట రాలేరు
భృత్యులు మృతిని తప్పింపలేరు
బంధుజాలము తన్ను బ్రతికించుకోలేదు
బలపరాక్రమ మేమి పనికి రాదు
ఘనమైన సకల  భాగ్యం బెంత కల్గిన
గోచిమాత్రం బైన గొనుచు బోదు

# మాతృదేశము

మాతృదేశము మాట ముచ్చట
ముదము గూర్పదు మదికి ననియెడి
పరమనీచుడు ధరణినంతట
గలయ వెదకిన గానననగునా?
నీరులేని ఎడారియైనను
వాన వరదల వసతియైనను
అగ్గికొండల అవనియైనను
మాతృదేశము మాతృదేశమె.
దేశదేశము తిరిగి చూడుము
కొంత హాయియె కూర్పు మదికిని
నాల్గురోజులు నచ్చదేదియు
స్వర్గమే నపవర్గమేనియు.
తల్లి ఏడుపు తండ్రి కోపము
భార్యబిడ్డల ప్రణయపాశము
ఇంచుకైన గణింపనీయదు
మాతృదేశము మాతృదేశమె.
లాఠిదెబ్బల లక్ష్యమేమీ
కఠిన శిక్షయె కాదు కాదు
చావుకైనను జంకనీయదు
మాతృదేశము మాతృదేశమె.
పొట్టకన్నము, కట్టుబట్టయు
లేని బ్రతుకును లెక్కసేయక
యెచ్చటికి బోనిచ్చగింపము
మాతృదేశము మాతృదేశమె.
స్వర్గమే అపవర్గమేయని
చాటి చెప్పెడు జన్మభూమియె
పరులవశమున నరకకూపము
కన్న హేయము కఠినతరము

– కాళోజీ

# విశ్వంభర
**డా.సి. నారాయణ రెడ్డి**

ఎంత వింతమనసు ?
ఏ రూపమూ లేదు తనకు.
అయినా అది
నాదంగా ఎగిసింది–
పదంగా నడిచింది
రేఖలుగా మెరిసింది
మూర్తులుగా నిలిచింది
అణువణువులోని లయలను
తనువులో ఒలికింది.
మదిరాక్షి కళ్ళలో మునకలేసింది
పెదవిముడి విప్పిచూసింది
తెరలు తెరలుగా
పరిమళాలను కాజేసింది.
పొరలు పొరలుగా
సుస్వరాలను లాగేసింది.
మెత్తని వేళ్ళకొసలతో
మేనినునుపును పడబోసింది.

మనసొక రోదసి;
పిడుగుల అడుగులు పడుతుంటాయి
మెరుపుల చురకలు అంటుతుంటాయి.
జాబిల్లి కమ్మెచ్చులో లాగిన వెన్నెలలు
తీగలై సాగుతుంటాయి.
సూర్యుని కంటికొలిమి నూరిన చిచ్చుకణికలు
పచ్చిబొగ్గులై పడిపోతుంటాయి.
రోదసికి తెల్లపూత పూస్తే
అది వెలుగు.
రోదసికి నల్లరంగు పులిమితే
అది చీకటి.
మనసుకు గజ్జెలు కట్టుకుంటే
తెరలేస్తుంది.

మనసును ఆవులింతలు చుట్టుకుంటే
తెర వాలుతుంది.
ఊగిపోవాలనుకుంటుంది అది
ఉయ్యాలలౌతాయి మబ్బులు.
మోగిపోవాలనుకుంటుంది అది
మృదంగాలౌతాయి ఉరుములు.

మనసొక వృక్షమూలం;
ఆగుపించని పొరల్లోని జీవసారం.
పగలబడి నవ్వుతుంది
చిగుళ్ళు విప్పారిన రేకులౌతాయి.
కుమిలికుమిలి ఏడుస్తుంది
ఆకులు
జలజలరాలే మంచుబొట్లవుతాయి.
నెత్తినిమాడ్చే మండుటెండల్లో
నీడలజల్లులు కురిపిస్తుంది.
తననుముక్కలుగా నరికే గొడ్డలికి
తానే ఆధారంగా నిలుస్తుంది.
తన బిడ్డల్ని గాలిలో ఎగరేస్తుంది.
కాలం తన కళ్ళలో దుమ్ముచల్లినా
కదలని కాళ్ళతో నిలిచిపోతుంది.
ఎప్పుడూ కుదురువీడని మనసు వేళ్ళను
అప్పుడప్పుడు ఆశ తొలుస్తుంది
కొమ్మల చేతులెత్తి ఆడాలని;
చిగురాకుల జేబురుమాళ్ళను ఊపుతూ
పథికుల కళ్ళను పలకరించాలని.
వేళ్ళకొసలు పెళ్ళగించుకుని లేస్తే
వృక్షమాతృక కూలబడుతుంది.
ఆశల అంచులు పొగరేపుకుంటూ వస్తే
అంతరంగం కూరుకుపోతుంది.

# శిల్పి

సాగిల దీసి రాళ్ల నొక
జాలుగ వాగుగ తోగులాగునన్
లాగెద వెట్టు లన్న నటు
లన్ : ప్రియురాలి పయంటలో అజం
తా గుహలోని స్వప్నములు
తాపిన నీ ఉలిముక్కు లోపలన్
దాగుడు మూతలాడె కవి
తా లలితాంగి రహో విహారముల్.

రాలు మలంతు వీ వని వ
రాలను కుప్పలు వోసి రాణివా
సాలకు గొంచుబోయి ఒక
చక్కని జాణను చెక్కు మంచు ర
త్నాల నొసంగినారు నర
నాథులు; లే జవరాలిమోవి స్తం
భాలకు చెక్కినావు; ఉలి
పన్నుల నొక్కులు తాకనట్లుగా.

నీ ఉలి చూచి ప్రస్తరము
నీరయి పారును; వెన్నముద్దపై
చేయిడి యొత్తినట్టుల; ని
శీథములం దభిసారికా పదా
బ్జాయత రాగరంజిత న
వారుణ కంటకపాళి గూర్చి నే
గేయము వ్రాసినట్లు; విలి
ఖింతువు లోతగు భావముల్ శిలన్.

నిను గని కొండ లన్ని రమ
ణీ కుచపాళికలై, కపోల మో
హన ఫలకమ్ములై, భ్రుకుటు
లై, కుటిలాలక జాలమై, సురాం
గన లయి రూపు దిద్దికొన
గా ఉలితో అమృతమ్ము చల్లి జీ
వనములు పోసి పోయెదవు;
బ్రహ్మవు శిల్పికులావతంసమా!

చెక్కిన రాతిలో – మధుర
సీధువు లొల్కు విపంచికా రవం
బుక్కు నరాలలో పలుకు
లొత్తిన రీతి ధ్వనించునంట ; ఏ
లెక్కలతో ఉలిన్ కదిపి
'రిం' గను చక్కని మ్రోత రాతిలో
గ్రుక్కితి వయ్య ! శిల్పి కుల
కుంజర ! పుంజిత బ్రహ్మతేజమా!

సుత్తెల మ్రోతతో అలసి
చొక్కిన కొండల పిండు లెల్ల నో
రెత్తి నినాద మిచ్చినవి
"ఈ వెటువంటి మనోజ్ఞ రూపకం
బెత్తు మటన్న నెత్తెదము;
ఎందుల కిట్టుల మట్టి మట్టిగా
మొత్తెద వోయి శిల్పి కుల
భూషణ! శైల శిలా ప్రపేషణా!

**– డా. దాశరథి కృష్ణమాచార్యులు**

# గీతాసారం

తనువుతో కలుగు బాంధవ్యమ్ములెల్ల
తనువుతో నశియించు ధరణిలో గలియు
తనువనిత్యమ్ము నిత్యమ్ము ఆత్మయొకటే
చివికి జీర్ణములైన చేలముల్ వదలి క్రొత్తవలువలు గట్టి కొన్నట్టి రీతి
కర్మానుగతి వొక్క కాయమ్ము వదలి వేరొక్క తనువు ప్రవేశించునాత్మ
ఆత్మకు ఆదియు అంతములేదు
అదిగాలికెండదు అంబుతో తెగదు, నీటనానదు అగ్ని నీరైపోదు
కరణా విషాదాలు కలిగించునట్టి అహమును మమకార
మావలనెట్టి మోహమ్ము వీడి ప్రబుద్ధుడవగుమా!
ఒక్కడు చంపు వేరొక్కడు చచ్చుననుమాట పొరపాటు
అభ్రాంతి విడుము! పురుషులలో ఉత్తమ పురుషుండనేనే
కనులకు దోచు జగమ్మును నేనే జగతాత్మయును నేనే
నేనే జగమును సృజించి పోషించి లయమును పొందింతు
స్వార్థమునకు ధర్మమాహుతిజేసి, మదమత్తులై పేర్చు
మానవకోటి నాశమ్ము జేయ సంకల్పించినాడ
ఈరణ యజ్ఞమ్మును ఎవ్వరు ఆపలేరు మృత్యుముఖములో
మిడుకుచునున్న రాజలోకమ్మును రక్షింపలేరు
నాచేత హతులైన నరనాయకులను వధింపగ నిమిత్త
మాత్రుండవీవు భీష్మాది కౌరవ వీర లోకమ్ము నా గర్భమున
మహాకీలలందు కాలుచున్నారు ఇదే కనుము కౌంతేయ

# ఆత్మ గౌరవం

బాల రసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపు గూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి? గహనాంతరసీమల గందమూల కౌ
ద్దాలికులైన నేమి? నిజదారసుతో దరపోషణార్థమై.

– పోతన.

సాదు జలముల నీయవేస కలనదులు
ఫల రసాదులు కురియవే పాదపములు
పొసగ బిక్షలు పెట్టరే పుణ్య సతులు
ధనమ దాందుల కొలువేల తాపసులకు

– పోతన.

# ఛమత్కారం

సిరిగలవానికి చెల్లును
తరిణుల పదియాఱువేల తగ పెండ్లాడన్
తిరిపెమున కిద్ద రాంఁడ్రా?
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్.

–శ్రీ నాథుడు

# దానం

అన్నము లేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న
రావన్న శరీరదారులకు నాపద వచ్చిన వారియాపదల్
గ్రనన్న మాన్పి వారికి సుఖంబులు చేయుటకంటె నొండమే
లున్నదే? నాకు దిక్కు పురుషోత్తంబుడొక్కడ సుమ్ము పుల్కసా

## పట్టణం, రాష్ట్రం, దేశం, ఖండం, సముద్రముల – పురాతన మరియు నూతన పేర్లు

| సం॥ | పురాతన పేరు | నూతన పేరు |
|---|---|---|
| 1. | పాతాళం | అమెరిక |
| 2. | హరివర్షం | ఐరోపా |
| 3. | ఆంధ్రాలయం | ఆస్ట్రేలియా |
| 4. | పర్షియా | హిస్టారికల్ హౌజ్ ఆఫ్ ఇరాన్స్ |
| 5. | చెంపా | వియత్నాం |
| 6. | యావద్వీప | జావా |
| 7. | సప్తద్వీప | ■ సుమత్ర<br>■ హవాయ్<br>■ బోర్నియా<br>■ ఫిలిప్పీన్స్<br>■ పాపువన్<br>■ ఆస్ట్రేలియా<br>■ న్యూజిలాండ్ |
| 8. | వర్మా ద్వీప | బోర్నియో |
| 9. | కంబోజా | కంబోడియా |
| 10. | తామ్రపర్ణి, సిలోన్ | శ్రీ లంక |
| 11. | ఇంద్ర ద్వీప (బ్రహ్మ దేశం) | బర్మా |
| 12. | సియోని | స్విట్జర్‌లాండ్ |
| 13. | గాంధార దేశం | ఆఫ్ఘనిస్తాన్ |
| 14. | ఇథియోఫియా | అబిసేనియా |
| 15. | అనిలోధాథ ద్వీపం | జపాన్ |
| 16. | కలింగ దేశం | ఒరిస్సా |
| 17. | మగధ | బిహార్ (అంగదేశం లోని భాగం) |
| 18. | కామరూపం | అస్సాం |
| 19. | పాగ్‌జ్యోతిష్‌పురం | గౌహతి |
| 20. | పాటలీపుత్రం | పాట్న |
| 21. | కొలికట్టా (కాలికత్తా) | కల్‌కత్తా |
| 22. | హస్థినాపురం | న్యూ ఢిల్లీ (దిల్లీ) |
| 23. | మహేసురం | మైసూర్ |
| 24. | వారణాసి (కాశి) | బనారస్ |
| 25. | చెన్నపట్నం | చెన్నై (మద్రాస్) |
| 26. | కష్యప సముద్రం | అరేబియా సముద్రం |
| 27. | భద్రస్వ వర్షం | పెసిఫిక్ మహా సముద్రం |
| 28. | కేథుమద వర్షం | అట్లాంటిక్. |

# ఋతువులు ప్రకృతి

| ఋతువులు | ప్రకృతి | తెలుగు మాసాలు | కాలాలు | ఇంగ్లీషు మాసాలు |
|---|---|---|---|---|
| వసంత ఋతువు | చెట్లు చిగురిస్తాయి.ఎండలు మండుతాయి. అడవులు తగలబడ్తాయి. వడగాలులు, సుడిగాలులు, వడగళ్ల వానలు వస్తాయి. మోదుగులు అగ్నికణాల్ని పూస్తాయి. మామిడిపళ్ళు – పెళ్ళిళ్లలో ముస్తాబవుతాయి. ఆవకాయలు అవతరిస్తాయి | చైత్ర, వైశాఖలు | వేసవి కాలము | మార్చి, ఏప్రిల్, మే |
| గ్రీశ్మ ఋతువు | ఎండలు తగ్గుతాయి. చెట్లు ఆకుల్తో నిండుతాయి. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఆకాశంలో మబ్బులు ఆశపెడ్తాయి. చినుకులు పడ్తాయి.పడ్డట్లు, పడనట్లు. రైతు ఆకాశానికి మొక్కుతుంటాడు. | జేష్ఠ, ఆషాఢములు | వేసవి కాలము | మే, జూన్, జూలై |
| వర్ష ఋతువు | వర్షాలు కురుస్తాయి.వాన అందరినీ సంబరపరుస్తుంది.పశువులూ, పక్షులు గంతులు వేస్తాయి.పంట పొలాల పచ్చగా ఉంటాయి. వృక్ష సుందరి తలంటి పోసు కుంటుంది.ఏర్లూ, వాగులు పొంగి పొర్లుతాయి.చెరువులు నిండు జవ్వనిలా ఉంటాయి. తామరపూలు చెరువుల తలలో పూలు తురుముతాయి. తుమ్మెదలు వాటివెంట పడ్తాయి. వర్షకాలం జగతికి ప్రాణం. | శ్రావణ, బాధ్రపదములు | వర్షా కాలము | జూలై, ఆగష్టు, సెప్టెంబరు, |
| శరదృతువు | నిండ వెన్నెల కాస్తుంది.చంద్రుడు వెన్నెలపాలు నేలమీద పారబోస్తాడు. నదులు నిర్మలం, మందగమనల్లా పార్తాయి.ప్రకృతి సాంతం స్వచ్ఛంగా, సుందరంగా, మౌనంగా ఉంటుంది. శరన్నవరాత్రులు ప్రమదల సందడి – రాత్రులు ఆరాధనలు. ప్రకృతి పగలబడి నవ్వుతుంది. | ఆశ్వజ, కార్తీకములు | వర్షా కాలము | సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు |
| హేమంత ఋతువు | చలి వణికిస్తుంది.పొగమంచు ఎదుటివాణ్ణి చూడనివ్వదు. పసుపు పరచినట్లు జనప చేలు, పచ్చని మిరప తోటలో ఎర్రని మిరప పండ్లు. పసుపుముద్దబంతులు. బళ్లలో ఇంటికి పంటచేరడం. ఊరినిండా గడ్డీగింజా. సస్యశ్రీ పరవసింస్తుంది. | మృగశిర, పుష్యములు | చలి కాలము | నవంబరు, డిసెంబరు, జనవరి |
| శిశిర ఋతువు | చెట్లు ఆకులు రాలుస్తాయి.మునుల్లా నిలుస్తాయి.చెట్లకింద ఎండిన ఆకుల గలగలు. నిర్మలమైన నీలినీలి ఆకాశం. చలిపోయింది – ఎండరానుంది. హాయి వాతావరణం. బట్టలేక బయట తిరగగలిగిన వాతావరణం. శిశిరం నేలకు రాలిన ఆకుల ఎరువు సమకూరుస్తుంది. | మాఘం, ఫాల్గునములు | చలి కాలము | జనవరి, ఫిబ్రవరి, మార్చి |

పుస్తకం అనేది ఒక రచయిత జీవిత అనుభవాల సారాంశం. ఒక మనిషి తన జీవిత కాలంలో అనగా 30,40,50,60...సంవత్సరాలలో చూసిన, నేర్చుకున్న, విన్న మరియు అనుభూతి చెందిన అంశాలను ఒక పుస్తకం ద్వారా చదివిన మనం తెలుసుకొనేట్లు, అనుభూతి చెందేటట్లు చేసేది.

ఐతే ప్రస్తుత ఇంటర్‌నెట్ యుగంలో పుస్తక పఠనం అంటే బ్రౌజింగ్ అనే ఈనాటి యువతరానికి ఆనాటి నుండి ఈనాటి వరకు వచ్చిన ఎన్నో మంచి పుస్తకాలను చదివి వాటి నుండి సేకరించిన మంచి విషయాలను (మంచి భాగాలను) మలహాల్ రావు గారు జీవన కిరణాలు పుస్తకంగా తీసుకొని రావడం ఎంతో అభినందనీయం.

* అది తామరలు నిండిన చెరువు. తామరాకుల మీద నీటి బిందువులు. సూర్య కిరణాల తళతళలు. విచ్చుకున్న తామరలు – అరవిచ్చినవి – మొగ్గలు. వాటిపై ఝుమ్మని తిరిగే తుమ్మెదలు! అబ్బో – ఎంత అందం! అది అందానికి అందం!! అక్షరానికి అందని అందం. –జీవన యానం – డా. దాశరథి రంగాచార్యులు.

* గాలిని బంధించిన మొనగాడులేడు ! జ్ఞానమును కట్టిపెట్టగల నియంతలేడు !!

– వేదం జీవన నాదం – డా. దాశరథి రంగాచార్యులు.

* ఎక్కువ మంది తమ మనసుకున్న శక్తిని ఎరగరు. ఎంతో బాగా ఆలోచించగలిగిన వారు కూడా తమ మానసిక నిధిలో ఒక్కశాతం మాత్రమే వినియోగించుకుంటున్నారు. మనందరం ఊపిరి తీసుకున్న నాటి నుంచీ దాదాపు ఒకే రకమైన ముడి సరుకుతో వచ్చాం. కానీ కొందరు ఎక్కువ ఆనందాన్ని, విజయాన్ని సాధించడం ఎందుకు జరుగుతుందంటే వాళ్ళు ఆ ముడి సరుకును ఇతరులకంటే బాగా వినియోగించుకోవడం వల్ల.

– ఒక యోగి ప్రస్థానం – రాబిన్ ఎస్. శర్మ.

* ప్రేమ లేకుండా పెట్టిన రొట్టె చేదుగా ఉండటమే కాదు అది ఆకలిని సగమే తీరుస్తుంది.హృదయాలతో ఏమి చెయ్యని వాళ్ళ విజయం బోలుగా ఉండటమే కాక అది తన చుట్టూ వెగటుతనాన్ని వ్యాపింప చేస్తుంది.

– ఒక విజేత ఆత్మ కథ – ఎ.పి.జె. అబ్దుల్ కలామ్.

* నిన్ను నేను ప్రార్థించేది ఒకందుకే ప్రభూ! నాలోని లోభిత్వాన్ని సంకుచితత్వాన్ని సమూలంగా నిర్మూలించు. కష్టసుఖాలను తేలికగా భరించే శక్తి నాకు ప్రసాదించు. నా ప్రేమను నీ సేవలో ఫలప్రదం చేసుకొనే శక్తిని నాకివ్వు. పేదవారిని తిరస్కరించకుండా, అధికార గర్వం ముందు తలవంచకుండా ఉండే బలాన్ని నాకు అనుగ్రహించు,

– గీతాంజలి –రబీంద్ర నాథ్ ఠాగూర్.

పైన తెలిపినవి కొన్ని మాత్రమే ఇలాంటి ఎన్నింటినో రచయిత ఈ పుస్తకంలో పొందుపర్చడం జరిగింది. ఈ పుస్తకం చదివిన తరువాత మీరు తప్పకుండా ఓ 50 సంవత్సరాల అనుభవాన్ని అనుభూతి చెందుతారు, అని ఆశిస్తున్నాము. మలహాల్ రావు గారు పోలీస్ శాఖలో ఉంటూ నిరంతరం పుస్తక పఠనం చేస్తూ వాటిలోని మంచి విషయాలను సులభంగా అర్థం అయ్యేరీతిలో మనకు అందించారు.

వీరి ఇతర రచనలు :

- ఆణిముత్యాలు
- మన సంస్కృతి
- sense the essence